# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 1 - సంచిక 4 | జనవరి 2023 | వెల : రూ.15

నియంతల ప్రజాస్వామ్యం

ఆవరిస్తున్న పారిశ్రామిక మాంద్యం

జనాన్ని దోచి.. కుబేరులకు పంచి!

మరి నిజమైన పప్పూ ఎవరు ?

తెలుగు రాష్ట్రాలలో రాజకీయ పరిణామాలు

భ్రమల గూడు కడుతున్న బహుజన రాజకీయాలు

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి.. రాజ్యాంగ లక్ష్యాలపై దాడి

భారత జర్నలిజంలో చీకటి యుగం

విఫల ప్రత్యామ్నాయం సుభాష్ బోస్

విఫల ప్రత్యామ్నాయంపై సమాధానం

అక్షరాలే సాక్ష్యాలుగా మార్క్స్ ఏంగెల్స్ జీవితాలు

మార్క్సిజాన్ని మరింత పరిపుష్టం చేసిన ఆంటోనియో గ్రాంసీ

దేశాన్ని సానిటైజ్ చేద్దాం

సాహిత్య సవ్యసాచి కేవీయార్

ఓ దేశభక్త ముస్లిం ఆత్మఘోష

కేశవ్ గారి కొత్త పుస్తకం 'మార్కెట్లో...' కు స్వాగతం

జనవరి - 2023

# దారి దీపం మాసపత్రిక

సంపుటి : 1 - సంచిక : 4


డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణ మూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. నియంతల ప్రజాస్వామ్యం
- సంపాదకీయం 3
2. ఆవరిస్తున్న పారిశ్రామిక మాంద్యం
- ప్రభాత్ పట్నాయక్ 4
3. జనాన్ని దోచి.. కుబేరులకు పంచి!
- క్రిస్టోఫ జెఫెలో 6
4. మరి నిజమైన పప్పూ ఎవరు ?
- మహువా మొయిత్రా 9
5. తెలుగు రాష్ట్రాలలో రాజకీయ పరిణామాలు - డి.వి.వి.యస్ వర్మ 12
6. భ్రమల గూడు కడుతున్న బహుజన రాజకీయాలు - అశోక్ కుంబము 16




కార్టూన్ : సతీష్ ఆచార్య

7. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తి.. రాజ్యాంగ లక్ష్యాలపై దాడి - కెఎస్ లక్ష్మణరావు 20
8. భారత జర్నలిజంలో చీకటి యుగం - రవీష్‌కుమార్ 23
9. విఫల ప్రత్యామ్నాయం సుభాష్ బోస్ - కొప్పర్తి వెంకటరమణమూర్తి 26
10. అక్షరాలే సాక్ష్యాలుగా మార్క్స్ ఏంగెల్స్ జీవితాలు - మార్సెలో ముస్తో 30
11.మార్క్సిజాన్ని మరింత పరిపుష్టం చేసిన ఆంటోనియో గ్రాంసీ : ఎస్.వెంకట్రావు 32
12. దేశాన్ని సానిటైజ్ చేద్దాం! - డాక్టర్ దేవరాజు మహరాజు 35
13. సాహిత్య సవ్యసాచి కేవీయార్ - రాఘవశర్మ 36
14. ఓ దేశభక్త ముస్లిం ఆత్మఘోష - ఆర్వీ రామారావు 38
15. కేశవ్ గారి కొత్త పుస్తకం 'మార్కెట్లో...' కు స్వాగతం : ఎన్.వేణుగోపాల్ 40
16. మోలీ కార్టూన్స్ 42
17. కొత్త పుస్తాలు... స్వీకారం 43

దారి దీపం మాసపత్రిక

వివరాలకు సంప్రదించండి

డా॥ బి.రమేష్ చంద్రబాబు,
34-15-1,
దొడ్డిపట్ల వారి తోట వీధి,
తణుకు - 534211,
ప.గో.జిల్లా, ఏపీ
ఫోన్ : 93971 14495

**గాంధీ మార్గం**

దేశసేవ అంటే ఉపన్యాసాలు దంచడం కాదు.
ఎవరి విధిని వారు సక్రమంగా నిర్వర్తించడమే దేశసేవ.



# నియంతల ప్రజాస్వామ్యం

మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం. అంటే ప్రజాస్వామ్య లక్షణాలు ఎక్కువగా వున్న దేశం కాదు. ఎక్కువ మంది ఓటర్లు వున్న దేశం మాత్రమే. మనం రాచరికం నుంచి ప్రజాస్వామ్యంలోకి వచ్చాం. ఇప్పుడు ప్రజాస్వామ్యం నుంచి రాచరికంలోకి ప్రయాణిస్తున్నాం. మనది ప్రజాస్వామ్య రాజ్యాంగం. దానిని అనుసరించి వచ్చిన ప్రజాస్వామ్య ఎన్నికల వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నాం. మన ఎన్నికల వ్యవస్థలో మనం శాసన సభ్యులను ఎన్నుకుంటాం. లోక్‌సభ సభ్యులను ఎన్నుకుంటాం. అందులో మెజారిటీ వచ్చిన పార్టీలు సంఘటనలు ముఖ్యమంత్రిని, ప్రధాన మంత్రిని ఎన్నుకుంటాయి. ఇది పరోక్ష పద్ధతి. ఇది మన దేశంలో రాజ్యాంగ బద్ధమైన పద్ధతి. ఇప్పుడు మన ఎన్నికల రాజకీయం దీనిని ఉల్టా చేసింది. పరోక్ష పద్ధతిని ప్రత్యక్ష పద్ధతిగా ఆచరణలోకి తెచ్చింది. అధ్యక్ష తరహా పద్ధతికి మారిపోతున్నది. మా ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తున్నాం. మా ప్రధానమంత్రి అభ్యర్థిని ప్రకటిస్తున్నాం. వారికి ఓటు వేయండి అంటున్నారు. నన్ను గెలిపిస్తే రాష్ట్రాన్ని మారుస్తా, దేశాన్ని మారుస్తానని ప్రకటిస్తున్నారు. పాలక పార్టీలన్నీ దాదాపుగా ఇదే బాట పట్టాయి. స్థానిక అభ్యర్థులు ముఖ్యం కాదు. ఎవరు ముఖ్యమంత్రి, ఎవరు ప్రధానమంత్రి అన్నది ముఖ్యమైన ఎన్నికల నినాదం అయ్యింది. గెలిచేది ఆయనే, గెలిపించేది ఆయనే అయినప్పుడు పార్టీలు వెనకకుపోతున్నాయి. స్థానిక అభ్యర్థుల యోగ్యతా యోగ్యితలు అసంగతమౌతున్నాయి.

ఎన్నికల రాజకీయంలో వచ్చిన మార్పు నియంతలను సృష్టిస్తున్నది. రాష్ట్రంలో దేశంలో ఇలా గెలిచిన వారు నియంతలు కావడం సహజం. ఇలా అధికారం చేపట్టిన వారు ప్రభుత్వ యంత్రాంగాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంటున్నారు. పోలీసు యంత్రాంగాన్ని తమ కనుసన్నలలో పెట్టుకుంటున్నారు. నియంతృత్వపాలనకు తెర తీస్తున్నారు. మరోపక్క ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల భాగస్వామ్యం గల ప్రజాస్వామ్యం నాయకుని చేత, నాయకుని కొరకు, నాయకుని ఏకచ్ఛత్రాధిపత్యంగా రూపాంతరం చెందుతోంది. ఇది నాయకుని స్వంత అనుచరగణాన్ని, భక్తులను తెరమీదకు తెస్తున్నది. వారు నాయకుని మీద విమర్శను సహించరు. ఈగ వాలితే బడిత పూజ చేస్తారు. ప్రశ్నిస్తే నాలుక కోస్తామంటారు. ఇది నియంతలు అనుసరించే రాజకీయం. ప్రస్తుతం దేశంలోని వివిధ రాష్ట్రాలలో ఇదే నడుస్తున్నది. ఈ నియంతల తరహా పాలన, ఈ మూక ప్రజాస్వామ్యం వారు ప్రత్యర్థుల ప్రచారాన్ని కట్టడి చేస్తారు. నిషేధాలకు పూనుకుంటారు. భారత్ జూడో యాత్రను కొవిడ్ పేరుతో నిషేధించాలని కేంద్రం భావిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో ప్రతిపక్షాల ప్రచార యాత్రలను నిషేధించే జీవోలను ప్రయోగించడం ఈ నియంత పోకడలకు అద్దం పడుతున్నది. నిషేధాలు, నియంత్రణలు నియంతలను కాపాడలేవు. ఈ అధికార దుర్వినియోగాన్ని ప్రజలు, పాలక పార్టీల బలహీనతగానే భావిస్తారు. ప్రజాస్వామ్య దేశాలలో నియంతలు అప్రజాస్వామిక చర్యలతో ఎల్లకాలం పాలించలేరు. ప్రజాకోర్టులో వారు ఓటమి పాలుకాక తప్పదు.

డీవీవీఎస్ వర్మ,
85006 78977

# ఆవరిస్తున్న పారిశ్రామిక మాంద్యం



- ప్రభాత్ పట్నాయక్

**ఆదాయాలలో పెరుగుతున్న అసమానతల ఫలితంగా పారిశ్రామిక సరుకులకు డిమాండ్ అంతకంతకూ కుంచించుకుపోతోంది. అత్యధికులుగా ఉన్న ప్రజానీకపు కొనుగోలు శక్తి పరిమితంగా ఉండడమే గాక, పెరుగుతున్న ఆదాయాల అసమా నతల కారణంగా వాళ్ళ కొనుగోలుశక్తి సాపేక్షంగా తగ్గుతోంది కూడా. ఇది నయా ఉదారవాద విధానాల పుణ్యమే.**

అక్టోబర్ 2021 మాసంతో పోలిస్తే అక్టోబర్ 2022లో పారిశ్రామిక ఉత్పత్తి సూచిక నాలుగు శాతం పడిపోయింది. సహజంగానే దీనిపై చర్చ జరుగుతోంది. ఇలా పడిపోవడానికి కోవిడ్ లాక్డౌన్ కారణం అంటూ సాకులను ఇప్పుడు చూపించడం సాధ్యం కాదు. ఎందుకంటే ఈ కాలంలో కోవిడ్ ప్రభావం ఆర్థిక వ్యవస్థ మీద ఏమీ లేదు. కాబట్టి ఈ మారు పారిశ్రామిక ఉత్పత్తి ఈ విధంగా పడిపోవడం మన దేశ ఆర్థిక వ్యవస్థలో లోతుగా వేళ్ళూనుకుని వున్న ఏదో రోగాన్ని సూచిస్తోంది. అయితే, తక్షణం కనిపిస్తున్న ఈ పారిశ్రామిక ఉత్పత్తి పతనాన్ని మాత్రమే చూస్తే కొంత కాలం నుంచీ మన పారిశ్రామిక ఉత్పత్తిలో ఎదుగూ బొదుగూ లేకుండా ఉంటున్నదన్న వాస్తవం మరుగున పడిపోతుంది. పారిశ్రామిక ఉత్పత్తి సూచికను లెక్కించేందుకు ప్రాతిపదికగా ఒక సంవత్సరపు ఉత్పత్తిని మూల సంవత్సరంగా ఎంచుకుంటారు. అయితే, మన ప్రభుత్వం ఆ మూల సంవత్సరాన్ని పదే పదే మార్చేస్తూ వుంటుంది. అందువలన వేర్వేరు మూల సంవత్సరాల ప్రాతిపదికలన లెక్కించే పారిశ్రామిక సూచికలను పోల్చి చూడడం గందరగోళంగా ఉంటుంది. దానిని నివారించేందుకు మనం 2011-12 మూల సంవత్సరంగా లెక్కించిన సూచికను ప్రాతిపదికగా తీసుకుందాం. మన దగ్గర ఉన్న తాజా ప్రాతిపదిక అదే.

2011-12 నుంచి 2019-20 వరకూ, అంటే కరోనా మహమ్మారి కన్నా ముందరి కాలంలో, మొత్తం పారిశ్రామిక ఉత్పత్తి కేవలం 29 శాతం మాత్రమే పెరిగింది. అంటే సగటున ఏడాదికి 3.2 శాతం పెరుగుదల మాత్రమే ఉంది. ఇది చాలా తక్కువ. అంతకు మునుపటి ఏ కాలానికి సంబంధించిన పారిశ్రామిక ఉత్పత్తితో పోల్చినా ఇది చాలా తక్కువ. మన నయా ఉదారవాద మేధావులు 1951-1965 సంవత్సరాల మధ్య కాలాన్ని 'హిందూ వృద్ధి రేటు కాలం'గా పరిగణిస్తారు. ప్రభుత్వ జోక్యం మితిమీరి ఉన్నందున ఆ కాలంలో దేశంలో ఆర్థికవృద్ధి చాలా తక్కువగా నమోదైందని విమర్శిస్తారు. ఎదుగూ బొదుగూ లేని ఆర్థికవృద్ధి అని చెప్పడానికి వెటకారంగా 'హిందూ వృద్ధి రేటు' అని అంటారు. అయితే, అటువంటి కాలంలో వృద్ధి 7 శాతం మించి ఉంది(1956 ప్రాతిపదికన). 2004-05 మూల సంవత్సరంగా లెక్కిస్తే 2004 నుంచి 2014-15 మధ్య కాలంలో పారిశ్రామిక వృద్ధి 5.87శాతం ఉంది. అంటే ఇటీవల కాలంలో పారిశ్రామిక వృద్ధి రేటు బాగా పడిపోయిందని స్పష్టం అవుతోంది. ఇంత కాలమూ నయా ఉదారవాద మేధావులు దేశ ఆర్థికవృద్ధి గతంలో ఎన్నడూ లేనంత ఎక్కువ వేగంగా సాగుతోందని, దేశం ముందుకు దూసుకుపోతోందని చెప్పుకుంటూ వచ్చిన దానికి వాస్తవ పరిస్థితి పూర్తి భిన్నంగా ఉంది. స్వాతంత్ర్యానంతరం నయా ఉదారవాద విధానాలు అమలైన కాలంలో పారిశ్రామిక వృద్ధి అంతకు ముందరి కాలపు సగటు వృద్ధికన్నా తక్కువగా ఉంది. అంతేగాక, నయా ఉదారవాద కాలంలో ఇటీవల వేగం మరీ తగ్గింది. ఈ పారిశ్రామిక వృద్ధి సూచికను లెక్క వేయడంలో చిన్న, మధ్య తరహా పారిశ్రామిక యూనిట్లను పరిగణనలోకి తగిన విధంగా తీసుకోరు. ఇటీవలి కాలంలో ఆ చిన్న, మధ్య తరహా యూనిట్లు తీవ్ర సంక్షోభంలో పడ్డాయి. నయా ఉదారవాద విధానాల కారణంగా వాటికి ప్రభుత్వ మద్దతు నిలిచిపోయింది. అయితే, అది ఒక్కటే వాటి సంక్షోభానికి కారణం కాదు. దీనికితోడు మోడీ ప్రభుత్వం పెద్దనోట్ల రద్దు, జీఎస్టీ వంటి తప్పుడు విధానాలతో వాటిని మరింత సంక్షోభంలోకి నెట్టింది. ఆ యూనిట్ల పరిస్థితిని లెక్కలోకి తీసుకుంటే వాస్తవ పారిశ్రామిక వృద్ధి సూచిక ఇంకా తక్కువగా ఉంటుంది.

కోవిడ్ అనంతర కాలంలో పారిశ్రామిక ఉత్పత్తి తిరిగి కోలుకోవడం చాలా బలహీనంగా ఉంది. మామూలుగానైతే, సరుకుల ఉత్పత్తికి అంతరాయం ఏర్పడినప్పుడు ఆ సరుకులకు డిమాండ్ వాయిదా పడుతుంది. అనంతరం మళ్ళీ వృద్ధి సంభవించి వేగం పుంజుకున్నప్పుడు అంతవరకూ బిగబట్టుకున్న డిమాండ్ సాధారణ

డిమాండుకు అదనంగా తోడవుతుంది. అందుకే యుద్ధం జరిగిన కాలంలో ఉత్పత్తికి అంతరాయం కలిగిన తర్వాత యుద్ధానంతర కాలంలో ఉత్పత్తి ఒక్కసారి పుంజుకుంటుంది. కాని కోవిడ్ అనంతర కాలంలో అటువంటి పుంజుకోవడం ఏదీ జరగలేదు. అంతవరకూ కొనసాగిన మాంద్యం ఆ తర్వాత కొనసాగడమే గాక, మరింత దిగజారింది. ఆ విధంగా పారిశ్రామిక మాంద్యం మన ఆర్థిక వ్యవస్థ సహజ స్వభావం కింద మారింది. ఈ విధంగా మన దేశ ఆర్థిక వ్యవస్థ ఎందుకు తయారైంది ?

ఇక్కడ రెండు అంశాలు అత్యంత ప్రాధాన్యతను కలిగి వున్నాయి. ఆదాయాలలో పెరుగుతున్న అసమానతల ఫలితంగా పారిశ్రామిక సరుకులకు డిమాండ్ అంతకంతకూ కుంచించుకు పోతోంది. అత్యధికులుగా ఉన్న ప్రజానీకపు కొనుగోలు శక్తి పరిమితంగా ఉండడమే గాక, పెరుగుతున్న ఆదాయాల అసమానతల కారణంగా వాళ్ళ కొనుగోలుశక్తి సాపేక్షంగా తగ్గుతోంది కూడా. ఇది నయా ఉదారవాద విధానాల పుణ్యమే. నాలుగేండ్ల కోమారు నిర్వహించే సర్వేల ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ తలసరి ఖర్చు 2011-12కి, 2017-18 సంవత్సరాల మధ్య 9 శాతం మేరకు తగ్గింది. ఇందులో శ్రామిక ప్రజల తలసరి ఖర్చు ఇంకా ఎక్కువే తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లోని భూస్వాములకు, ధనిక రైతులకు ఆదాయాలు తగ్గిపోయింది ఏమీ లేదు. వారిని మినహాయించి లెక్క వేస్తే గ్రామీణ పేదల తలసరి ఖర్చు మరీ తక్కువగా ఉంటుంది. గ్రామీణ భారతంలో తలసరి ఖర్చు తగ్గడంతో పారిశ్రామిక సరుకుల డిమాండ్ తగ్గడం అనివార్యంగా జరుగుతుంది. గ్రామీణ పేదల ఆదాయాలు తగ్గడానికి, పట్టణాల్లోని శ్రామికుల ఆదాయాలు తగ్గడానికి లింకు ఉండడం నయా ఉదారవాదకాలపు లక్షణం. గ్రామీణ పేదరికం పెరిగితే అక్కడివారు పట్టణాలకు వలసలు వస్తారు. దాంతో పట్టణాల్లో ఉద్యోగాల కోసం పోటీ పడేవాళ్ళు పెరుగుతారు. దానివలన పట్టణ కార్మికుల వేతనాలు తగ్గిపోతాయి. అందువలన పారిశ్రామిక సరుకుల డిమాండ్ తగ్గిపోయి మాంద్యం పెరుగుదలకు దోహదం చేస్తుంది.

చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రంగాలను ఊపిరాడకుండా చేయడం అసమానతల పెరుగుదలను వేగవంతం చేస్తుంది. నయా ఉదారవాద విధానాలు మాత్రమే కాక, ప్రస్తుత ప్రభుత్వపు తప్పుడు విధానాలు దీనికి కారణం. చిన్న, మధ్యతరహా పరిశ్రమలు చేసే ఉత్పత్తుల స్థానాన్ని బడా పరిశ్రమలు ఉత్పత్తులు ఆక్రమిస్తాయి. అవే సరుకులు చిన్న పరిశ్రమల్లో గనుక తయారైతే, వాటిని తయారు చేయడానికి ఎక్కువ మంది కార్మికులు అవసరం అవుతారు. వాటిని ఇప్పుడు బడా పరిశ్రమల్లో ఉత్పత్తి చేస్తున్నారు గనుక అందుకు తక్కువ మంది కార్మికులు సరిపోతారు. ఆ విధంగా కార్మికవర్గపు స్థూల ఆదాయం తగ్గిపోతుంది. అది వారి కొనుగోలు శక్తిని మరింత దెబ్బతీస్తుంది. అందువల్ల పారిశ్రామిక సరుకుల డిమాండ్ మరింత తగ్గుతుంది.

సంపద ఉత్పత్తి క్రమంలో ఏర్పడే అదనపు విలువలో అంతకు మునుపటికన్నా అధికంగా వాటా పొందిన వర్గాలవారు కూడా ఉన్నారు కదా? మరి వారు అంతకు ముందుకన్నా అదనంగా పారిశ్రామిక ఉత్పత్తులు కొనుగోలు చేస్తారు కదా? అన్న ప్రశ్న ఇక్కడ తలెత్తుతుంది. నయా ఉదారవాద విధానాలు అమలు మొదలైన తొలి సంవత్సరాలలో ఇటువంటి పరిస్థితి ఉండేది. నయా ఉదారవాద విధానాలు మొదలుకాక మునుపు పలు పారిశ్రామిక సరుకులు దేశీయంగా ఉత్పత్తి అయ్యేవి కావు. వాటి దిగుమతుల మీద కూడా ఆంక్షలు ఉండేవి. అటువంటి సరుకులకు డిమాండ్ చాలా ఉండేది. అలా పేరుకుపోయిన డిమాండ్ నయా ఉదారవాద విధానాలు మొదలై, ఆంక్షలు తొలగిపోగానే ఒక్కసారిగా బైటకు తన్నుకొచ్చింది. దాని వలన మొదట్లో ఆర్థిక వృద్ధి కొద్ది సంవత్సరాలపాటు వేగంగా సాగింది. అయితే, ఆ క్రమంలో దేశంలోని మిగులు సంపదలో చాలా భాగం విదేశాల సరుకుల కొనుగోలుకు బైటకు తరలిపోయింది కూడా. ఇప్పుడు దాని పర్యవసానాలు కనిపిస్తున్నాయి. 'యంత్రాలు, విడిభాగాలు' రంగం, వినిమయ సరుకుల రంగం-ఈ రెండింటిలోనూ వృద్ధిరేటు తక్కిన రంగాలకన్నా మరీ తక్కువగా ఉంది. అక్టోబర్ 2022లో వినిమయ సరుకుల రంగంలో వృద్ధి 2011-2012 నాటికన్నా కూడా తక్కువగా ఉంది. ఇక యంత్రాలు విడిభాగాల రంగం దాదాపు 2011-12 నాటి స్థితిలోనే ఉండిపోయింది. దీనికి కారణం ఆ రంగాల్లో ఉత్పత్తి అయ్యే సరుకులు విదేశాల నుండి కూడా దిగుమతి అవుతూ ఉండడమే.

కాబట్టి పారిశ్రామిక మాంద్యం నెలకొనడానికి కారణం నయా ఉదారవాద విధానాలే. ఆ విధానాల కారణంగా ఆదాయాల్లో శ్రామిక ప్రజల వాటా తగ్గిపోయి వారి కొనుగోలుశక్తి పడిపోయింది. దీనికితోడు దిగుమతులు పెరిగిపోయాయి. ఈ పరిస్థితిని చక్కదిద్దడానికి ఈ ప్రభుత్వం చేసిందేమిటి? మౌలిక వసతుల కల్పన రంగంలో (ఇన్ఫ్రాస్ట్రక్చర్) ప్రయివేటు రంగ వ్యయాన్ని పెంచడానికి వీలుగా ప్రైవేటు రంగానికి ప్రభుత్వ రంగ బ్యాంకుల నుండి రుణాలు విరివిగా ఇప్పించింది. ఇది ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికా? లేకపోతే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అమలు చేయడంలో భాగమా? అన్నది అటుంచితే ఇది ప్రభుత్వ రంగ బ్యాంకుల వద్ద నిరర్థక ఆస్తులు విపరీతంగా పేరుకుపోడానికి దారితీసింది. పైగా ఆర్థిక వ్యవస్థ పుంజుకున్నది ఏమీ లేదు. మొత్తానికి ప్రభుత్వ రంగ బ్యాంకులు మాత్రం తీవ్రమైన ఆర్థిక వత్తిడికి లోనవుతున్నాయి. ఇది మోడీ ప్రభుత్వ పుణ్యమే. ❑

# జనాన్ని దోచి..
# కుబేరులకు పంచి!




క్రిస్టోఫ జెఫెలో
ఫ్రెంచి రాజనీతి శాస్త్రవేత్త

**ఒకప్పుడు బీజేపీ, ఆర్ఎస్ఎస్ నాయకులు తమ చేతికి మట్టి అంటకుండా బజరంగ్ దళ్ వంటి సంస్థలను వాడుకునే వారు. ఇప్పుడు ఈ మూకలకు చెందిన వారు బీజేపీలో పదవులు పొందుతున్నారు. పార్లమెంటులోకి ప్రవేశిస్తూ అధికార ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని చట్టుబండలు చేస్తూ సంఘ పరివార్ శక్తులు పోటీ ప్రభుత్వాలను నడుపుతున్నాయి. మోదీ మొదటి హయాం లో ప్రభుత్వం నేరుగా కల్పించుకోకుండా ఈ దౌర్జన్యమూక లను ప్రోత్సహించింది. రెండవ పర్యాయం అధికారానికి వచ్చిన తర్వాత రాజ్యవ్యవస్థనే నిరంకుశంగా మార్చింది.**

అచ్చే దిన్, మోదీ హైతో ముమ్‌కీన్ హై అంటూ అధికారానికి వచ్చిన తరువాత మోదీ నిజంగానే పేదల కోసం పాటుపడ్డారా? లేక బడా వ్యాపారస్థుల కోసం పనిచేస్తున్నారా? అనే సందేహాలు రోజురోజుకూ బలపడుతున్నాయి. ఎన్నికల ముందు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి అధికారానికి రావడానికి బీజేపీ పాలకులు అలవాటుపడ్డారు. కానీ, ప్రజల సంక్షేమం కోసం కృషి చేసి ఓట్లడిగే పరిస్థితి ఎప్పుడూ లేదు. వాస్తవానికి మోదీ రెండు పర్యాయాల పరిపాలనలో పేదల బతుకులు దిగజారి పోయాయి. బడా వ్యాపారులకు మాత్రమే లబ్ధి చేకూరుతున్నది. ప్రజల సంక్షేమ పథకాలకు కత్తెర వేస్తూ, ఆశ్రిత వ్యాపారులకు పరమాన్నం వడ్డిస్తున్నారని గణాంకాలను పరిశీలిస్తే అతి సులభంగా అర్థమవుతుంది. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారింది అంటే కరోనా వల్ల అని సమర్థించుకోవచ్చు. కానీ, దేశాన్ని కరోనా కమ్మేయడానికి ముందే మోదీ పాలన ముంచేసింది. అది పేదల పాలిట శాపంగా పరిణమించింది.

బ్యాంకింగ్ రంగం సంక్షోభంలో పడటంతో ఆర్‌బీఐ రుణాలు ఇవ్వటం నిలిపివేసింది. దీంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమల తోపాటు రైతులు దెబ్బతింటున్నారు. పారిశ్రామికవేత్తలు తమ




ఆస్తులను అమ్మి రుణాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. కానీ వీరిపై చర్యలు తీసుకుని బ్యాంకులను కాపాడే చిత్తశుద్ధి మోదీ ప్రభుత్వానికి లేదు.

ప్రధాని మోదీ పాలనలో దేశవ్యాప్తంగా ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలలో బజరంగ్‌దళ్, గోరక్షక్ దళ్ మొదలైన పేర్లతో హింసాయుత మూకలు చెలరేగిపోవడం పరిపాటి అయింది. ప్రేమికుల దినోత్సవం నాడు ప్రేమికులు కనిపిస్తే వారిపై దాడులు జరుపుతున్నాయి. గోరక్షణ పేర కొట్టి చంపిన ఉదంతాలున్నాయి. బీసీలు, దళితులు, మైనారిటీలపై వీరి దాడులు సాగుతున్నాయి. ఒకప్పుడు గుజరాత్‌లో జరిగిందే ఇప్పుడు మరింత దౌర్జన్య పూరితంగా ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాలలో జరుగుతున్నది. చాలా సందర్భాలలో పోలీసులు, నాయకులు వీరితో కుమ్మక్కవుతూ దాడులకు మద్దతు ఇస్తున్నారు. ఫ్రెంచి రాజనీతి శాస్త్రవేత్త క్రిస్టోఫ జెఫెలో. భారతదేశం– దక్షిణాసియా రాజకీయాలు ఆయన ప్రత్యేక అధ్యయనాంశం. 'మోదీ'స్ ఇండియా' హిందు నేషనలిజమ్ అండ్ ది రైజ్ ఆఫ్ ఎత్నిక్ డెమొక్రసీ' అనే పుస్తకంలో మోదీ హయాంలో భారతదేశం అన్ని రంగాలలో ఏ విధంగా దిగజారి పోయిందీ ఆయన వివరించారు. సంపన్నులకు లబ్ధి చేకూర్చే మోదీ విధానాలతో పేదల పరిస్థితి మరింత భారమై పోయిందని సోదాహరణంగా వెల్లడించారు. ఈ పుస్తకంలోని కొన్ని అంశాలు క్లుప్తంగా..

## పెరిగిన గ్రామీణ పేదరికం

జాతీయ గణాంక కార్యాలయం సర్వే (2019) ప్రకారం- కుటుంబ వినియోగ వ్యయం మోదీ పాలనలో 3.7 శాతం తగ్గిపోయింది (2004-05 నుంచి 2009-10 మధ్య కాలంలో ఈ వ్యయం 13 శాతం పెరిగింది). సగటు కుటుంబ వినియోగ వ్యయం 2011-12లో రూ.1,501 ఉంటే 2017-18లో రూ.1,446కు పడిపోయింది. వాస్తవ లెక్కల ప్రకారం చూస్తే- 1972-73 నుంచి ఇంతగా ఎప్పుడూ పడిపోలేదు. వినియోగ వ్యయం నగర ప్రాంతాల్లో రెండు శాతం పెరిగితే గ్రామీణ ప్రాంతంలో 8.8 శాతం తగ్గింది. దీనిని బట్టి మోదీ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతం పట్ల చూపుతున్న వివక్ష తెలిసిపోతున్నది. ఆహారంపై చేసే సగటు వ్యయం 2011-12లో రూ.643 ఉంటే 2017- 18 నాటికి రూ.580కి క్షీణించింది. 2018-19 నాటికి గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణాలలోనూ క్షీణత మొదలైంది. ప్రపంచ బ్యాంక్ హ్యూమన్ కాపిటల్ ఇండెక్స్ (2018) ర్యాంకింగ్ ప్రకారం అధ్యయనం చేపట్టిన మొత్తం 157 దేశాల్లో మన దేశం స్థానం 115. ప్రపంచ ఆకలి సూచిక ప్రకారం మొత్తం 119 దేశాల్లో భారత్ స్థానం 103. జాతీయ పోషకాహార పర్యవేక్షణ బ్యూరో నివేదిక (2018) ప్రకారం 35 శాతం గ్రామీణ ప్రజలు పోషకాహార లేమితో బాధపడు తున్నారు. 42 శాతం పిల్లలు తగినంత బరువు లేరు. 1970 దశకం నాటి కన్నా ఇది అధ్వాన్నమైన స్థితి. అంతర్జాతీయ ఆహార విధాన పరిశోధనా సంస్థ ర్యాంకింగ్ (2017) ప్రకారం మొత్తం 119 దేశాల్లో మన దేశం వందవ స్థానంలో ఉన్నది.

## బడుగులకు నష్టం-అగ్ర కులాలకు మేలు

అట్టడుగు వర్గాలు మోదీ హయాంలో తీవ్రంగా నష్టపోయాయి. ఉన్నత వర్గాలకు లబ్ధి చేకూరింది. బడ్జెట్‌లో స్పెషల్ కాంపోనెంట్ ప్లాన్ కింద దళితులకు జనాభా ప్రకారం 16.6 శాతం కేటాయించాలి. కానీ మోదీ హయాంలో 9-6.5 శాతం మధ్య ఊగిసలాడింది. బడ్జెట్ కోత వల్ల స్కాలర్‌షిప్ నిధులు తగ్గాయి. దీనివల్ల 50 లక్షల మంది దళిత విద్యార్థులు నష్టపోయారు. పబ్లిక్ రంగాన్ని కుదించడం వల్ల రిజర్వేషన్ లేక బడుగు వర్గాలు నష్టపోయాయి. యూపీఎస్సీ ఉద్యోగ నియామ కాలను మోదీ సర్కారు నలభై శాతం తగ్గించింది. నిపుణుల పేరుతో ప్రైవేటు రంగంలో వ్యక్తులకు ఉద్యోగాలు ఇస్తున్నారు కానీ, అందులో రిజర్వేషన్ పాటించడం లేదు. మోదీ ప్రభుత్వం 2019లో ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్‌ను ప్రవేశపెట్టింది. దీంతో సామాజిక వెనుకబాటుతనం కింద రిజర్వేషన్ అనే సైద్ధాంతిక ప్రాతిపదికను నీరుగార్చింది. ఈ కోటా కింద అర్హతకు ఎనిమిది లక్షల రూపాయల వార్షికాదాయం నిర్ణయించడంతో దాదాపు అగ్రవర్ణాల వారిని అందరినీ రిజర్వేషన్‌కు అర్హులను చేసినట్టయింది. రాజకీయ రంగంలో బీజేపీతోపాటు అగ్రకులాల ప్రాభవం పెరిగింది. ప్రత్యేకించి హిందీ ప్రాంతంలో ఈ వర్గాలకు చెందిన ఎంపీల సంఖ్య పెరిగింది. 2014లో బీజేపీకి చెందిన ఉన్నత కులాల ఎంపీల సంఖ్య 47.6 శాతం. ఇదే సమయంలో ఆ పార్టీలో బీసీ ఎంపీల సంఖ్య 20కు పడిపోయింది. బీజేపీలోని ఉన్నత కులాలలో కూడా బ్రాహ్మణులు, క్షత్రియుల సంఖ్య ఎక్కువగా ఉన్నది. మండల్ అనంతర కాలంలో ఉన్నత వర్గాల సంఖ్య ఇంత ఎక్కువగా ఎన్నడూలేదు. ఉన్నతవర్గాలు అధికులనే భావజాలాన్ని కూడా బీజేపీ పెంచుతున్నది.

### వ్యవసాయానికి మొండిచెయ్యి

యూపీఏ హయాంలో వ్యవసాయానికి బడ్జెట్ పెరుగుదల 26 శాతం ఉంటే మోదీ పాలనలో 8.7 శాతానికి తగ్గింది. అంతే కాదు, ఒక్క 2016-17 ఆర్థిక సంవత్సరాన్ని మినహాయిస్తే, ఏ ఏడాది కూడా బడ్జెట్ కేటాయింపులకు అనుగుణంగా నిధులను వినియోగించలేదు. మరోవైపు, నిజ పెట్టుబడులు తగ్గుతూ ఉన్నాయి. పంటల బీమా పథకం వల్ల రైతులకన్నా మోదీ సన్నిహిత వ్యాపారి అనిల్‌అంబానీ కంపెనీ ఎక్కువ లాభపడింది. వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధరను వ్యయంకన్నా ఒకటిన్నర రెట్లు అధికంగా వచ్చేట్లు చేస్తానన్న మోదీ హామీ నెరవేరలేదు. వ్యవసాయ ఉత్పత్తుల ధరలు పెరిగినప్పుడల్లా కేంద్రప్రభుత్వం దిగుమతులు జరిపి వాటి ధరలు తగ్గించింది. అధిక దిగుబడి ఉన్నప్పుడు ఎగుమతులకు అనుమతించడం లేదు. మార్కెట్‌లో రేట్లు మాత్రం పెరుగుతున్నాయి.

## ధనవంతుల ఆస్తుల పెరుగుదల

2014లో మోదీ అధికారం చేపట్టిన తరువాత ధనికులు మరింత ధనికులయ్యారు. పేదలు మరింత పేదలయ్యారు. ఆర్థిక వ్యత్యాసాలు పెరిగిపోయాయి. ఆక్స్‌ఫామ్ నివేదిక (2018) ప్రకారం, 77.4 శాతం దేశ సంపద పది శాతం అత్యంత ధనవంతుల వద్దకు చేరింది. 58 శాతం సంపద ఒక శాతం ధనికుల దగ్గరే ఉన్నది. 2017లో ముకేశ్ అంబానీ సంపద 67 శాతం పెరిగింది. మోదీ అధికారంలోకి రాగానే సంపద పన్ను రద్దు చేశారు. కోటి రూపాయలు మించి ఆదా యం ఉన్న వారిపై ఆదాయపు పన్ను రెండు శాతం పెంచారు. ప్రత్యక్ష పన్నుల భారం సంపన్నులపై ఉంటుంది. కానీ సంపన్నులకు అదొక పెద్ద లెక్క కాదు, పరోక్ష పన్నులు విధిస్తే అందరిపై భారం పడుతుంది. పేదలపై భారం ఎక్కువగా ఉంటుంది. మోదీ ప్రత్యక్ష పన్నులకు బదులు పరోక్ష పన్నులు పెంచి పేదల వ్యతిరేకతను చాటుకున్నారు. పెట్రోలుపై పన్ను

పెంచడం ఇటువంటిదే. మోదీ ప్రభుత్వం 2015 బడ్జెట్ నుంచి కార్పొరేట్ టాక్స్‌ను తగ్గిస్తూ వచ్చింది. దీంతో పాటు విదేశీ, దేశీయ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల క్యాపిటల్ గెయిన్స్‌పై గతంలో పెంచిన సర్‌చార్జిని ఉపసంహరించుకున్నది. 2019- 20లో ప్రత్యక్ష పన్నులు 4.92 శాతం తగ్గాయి. సంపన్నులకు పన్ను భారం తగ్గించడం వల్ల ఏర్పడిన లోటును పూరించడానికి ప్రభుత్వం పరోక్ష పన్నును పెంచింది. దీంతో పేదలపై భారం పడింది. ఆదాయ వనరులు తగ్గడం, బడ్జెట్ లోటు వల్ల విద్య, ఆరోగ్యం వంటి సంక్షేమ రంగాలపై కోత పెట్టారు. పేదరిక నిర్మూలన పథకాలకు నిధులు తగ్గాయి. దీంతో అన్ని విధాలా పేదలు నష్టపోయారు. పేదరికం పెరిగిపోయింది. సంపన్నులు మరింత సంపన్నులు అయ్యారు.

## బ్యాంకుల దోపిడీ- బడా వ్యాపారులకు వితరణ

బడా వ్యాపారులకు బ్యాంకుల సొమ్మును దోచిపెట్టే విధానం కాంగ్రెస్ హయాంలోనూ ఉన్నప్పటికీ, మోదీ పాలనలో తారాస్థాయికి చేరింది. 2018 మే నాటికి పబ్లిక్ రంగ బ్యాంకుల మొండి బకాయిలు 12.65 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. మొత్తం రుణాలలో మొండి బకాయిల వాటా 2012 మార్చిలో మూడు శాతం ఉంటే 2018 నాటికి 14 శాతానికి చేరింది. ఇదంతా బడా పెట్టుబడిదారీ సంస్థలు ఎగవేసిన రుణాలే. 2002 నుంచి మోదీకి మద్దతుదారుగా ఉన్న అదానీకి చెందిన గ్రూపు కూడా ఇందులో ఒకటి. 2015లో ఈ గ్రూపు ఓడ రేవును, రెండు విద్యుత్ కేంద్రాలను కొనుగోలు చేయడంతో రుణం 16 శాతానికి చేరింది. బ్యాంకింగ్ రంగం సంక్షోభంలో పడటంతో ఆర్‌బీఐ రుణాలు ఇవ్వటం నిలిపివేసింది. దీంతో చిన్న, మధ్య తరహా పరిశ్రమలతో పాటు రైతులు దెబ్బతింటు న్నారు. ఎంతో మంది ఉపాధి కోల్పోతున్నారు. 2016 నాటి చట్టం-ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్రప్సీ కోడ్-ప్రకారం పారిశ్రామికవేత్తలు తమ ఆస్తులను అమ్మి రుణాలు చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. కానీ వీరిపై చర్యలు తీసుకుని బ్యాంకులను కాపాడే చిత్తశుద్ధి మోదీ ప్రభుత్వానికి లేదు.

## ఉపాధి హామీ ఉత్తదే

మోదీ నోరు తెరిస్తే చాలు పేదల కోసం పాటుపడుతున్నట్టు చెప్పుకొంటారు. కానీ బీజేపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి గ్రామీణుల, పేదల సంక్షేమ పథకాలు నిర్వీర్యమైపోయాయి. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కూడా ఈ గతి పట్టింది. మోదీ ఈ పథకానికి నిధులను క్రమం గా తగ్గించి వేశారు. ఈ పథకానికి నిధులు పంపిణీ చేయాలని 2016 మే నెలలో సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. అయినా, పంపిణీ చేయవద్దంటూ కేంద్రం గుట్టుగా ఆదేశాలను అధికారులకు జారీ చేసింది. ఫలితంగా, వంద రోజుల ఉపాధి పొందిన వారి సంఖ్య 2013-14లో 4,70,000 ఉండగా, 2014-15 నాటికే 2,50,000కు తగ్గిపోయింది. 2015-16 నాటికి 1,70,000కు తగ్గిపోయింది. ఈ కూలీలందరి మొత్తం పనిదినాల సంఖ్య 2013-14లో 221.15 కోట్లు ఉండగా, 2014-15 నాటికి 166.32 కోట్లకు పడిపోయింది. సగటు కూలీ పనిదినాల సంఖ్య 2013-14లో 46 ఉండగా, 2014-15 నాటికి 39కి తగ్గిపోయింది. సగటు నిజ కూలీ రేటు 2014-15 నుంచి ఏడాది తిరిగే నాటికి రూ.142 నుంచి 136కు తగ్గింది. పలు రాష్ట్రాలలో కనీస వేతనం ఈ పథకం కన్నా ఎక్కువగా ఉన్నది.

## స్వయం ప్రకటిత సంరక్షకులు

ప్రధాని మోదీ పాలనలో దేశవ్యాప్తంగా ప్రత్యేకించి బీజేపీ పాలిత రాష్ట్రాలలో బజరంగ్ దళ్, గోరక్షక్ దళ్ మొదలైన పేర్లతో హింసాయుత మూకలు చెలరేగిపోవడం పరిపాటి అయింది. ప్రేమికుల దినోత్సవం నాడు ప్రేమికులు కనిపిస్తే వారిపై దాడులు జరుపుతున్నాయి. గోరక్షణ పేర కొట్టి చంపిన ఉదంతాలున్నాయి. బీసీలు, దళితులు, మైనారిటీలపై వీరి దాడులు సాగుతున్నాయి. ఒకప్పుడు గుజరాత్‌లో జరిగిందే ఇప్పుడు మరింత దౌర్జన్యపూరితంగా ఉత్తరప్రదేశ్, హర్యానా తదితర రాష్ట్రాలలో జరుగుతున్నది. చాలా సందర్భాలలో పోలీసులు, నాయకులు వీరితో కుమ్మక్కవుతూ దాడులకు మద్దతు ఇస్తున్నారు. దౌర్జన్యానికి పాల్పడే మూకలు అధికారులను శాసిస్తున్నాయి. దీంతో బీజేపీ పాలిత రాష్ట్రాలలో చట్టబద్ధ పాలన లేకుండా పోయింది. పోలీసుల్లో, సైనిక దళాల్లో ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్‌పరివార్‌కు చెందిన వారిని పెద్ద ఎత్తున నియమిస్తున్నారు.

ఒకప్పుడు బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు తమ చేతికి మట్టి అంటకుండా బజరంగ్ దళ్ వంటి సంస్థలను వాడుకునేవారు. ఇప్పుడు ఈ మూకలకు చెందిన వారు బీజేపీలో పదవులు పొందుతున్నారు. పార్లమెంటులోకి ప్రవేశిస్తున్నారు, అధికార ప్రతినిధులుగా వ్యవహరిస్తున్నారు. చట్టాన్ని చట్టుబండలు చేస్తూ సంఘ పరివార్ శక్తులు పోటీ ప్రభుత్వాలను నడుపుతున్నాయి. మోదీ మొదటి హయాంలో ప్రభుత్వం నేరుగా కల్పించుకో కుండా ఈ దౌర్జన్యమూకలను ప్రోత్సహించింది. రెండవ పర్యా యం మోదీ అధికారానికి వచ్చిన తరువాత రాజ్యవ్యవస్థనే నిరంకుశంగా మార్చింది. లౌకికత్వాన్ని, బహుళ పార్టీ రాజకీ యాన్ని సహించకుండా ప్రత్యర్థుల అణచివేతకు బీజేపీ పూను కొంటున్నది. ఎన్నికలలో ఓడిపోయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోయడం ద్వారా అధికారం చేపడుతున్నది. ❑

**(నమస్తే తెలంగాణ సౌజన్యంతో)**

# మరి నిజమైన పప్పూ ఎవరు ?



అనువాదం : ఎన్.వేణుగోపాల్

**మహువా మొయిత్రా లోక్‌సభలో ఉపన్యాసం**

**మీరు పెద్దనోట్ల రద్దు ధమాకా ప్రకటన చేసిన ఆరేళ్ల తర్వాత చలామణీలో ఉన్న కరెన్సీ నవంబర్ 2016లో ఉన్న 18 లక్షల కోట్ల రూపాయల నుంచి ఈ నవంబర్ నాటికి 32 లక్షల కోట్లకు చేరింది. సీఎంసీ అనే ద్రవ్య నిర్వహణా సంస్థ తయారు చేసిన క్యాష్ ఇండెక్స్ ఈ దీపావళికి అత్యున్నత స్థాయికి చేరింది. అంటే ఇంకా కాగి తపు కరెన్సీదే రాజ్యం. మీ పెద్ద నోట్ల రద్దు చెప్పిన మూడు లక్ష్యాలలో ఏ ఒక్కటీ సాధించలేదు.**

'అత్యంత నీచుడైన రచయితకు కూడ పాఠకులుంటారు' అని జొనాథన్ స్విఫ్ట్ అన్నట్టు, అతి పెద్ద అబద్ధాలకోరుకు కూడ నమ్మే వాళ్లు కొందరుంటారు. ఆ అబద్ధాన్ని గంటపాటు నమ్మగలిగినా సరే దాని పని అది చేస్తుంది. అబద్ధమేమో వేగంగా ఎగిరిపో తుండగా, సత్యం మాత్రం ఎక్కడో దాని వెనుక కుంటుతూ నడుస్తుంది. ఈ ప్రభుత్వం ప్రతి ఫిబ్రవరిలో మనచేత కొన్ని అబద్ధాలు నమ్మేలా చేస్తుంది. ఆర్థిక వ్యవస్థ అద్భుతంగా పురోగ మిస్తున్నదనీ, మనం ప్రపంచంలోకెల్లా వేగంగా అభివృద్ధి చెందుతున్నామనీ, ప్రతి ఒక్కరికీ ఉద్యోగం దొరుకుతున్నదనీ, ప్రతి ఒక్కరికీ గ్యాస్ సిలిండర్లు దొరుకుతున్నాయనీ, విద్యుత్తు దొరుకుతున్నదనీ, పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తున్నారనీ అబద్ధాలు ఎనిమిది, పది నెలలపాటు చక్కర్లు కొడుతుంటాయి. అప్పుడిక సత్యం కుంటుతూ కుంటుతూ మన ముందుకు వస్తుంది. తానే ప్రవేశపెట్టిన బడ్జెట్ అంచనాలను మించి మరొక మూడు లక్షల ఇరవై ఆరు వేల కోట్ల రూపాయలు కావాలని ఇప్పుడు ఈ డిసెం బర్‌లో ప్రభుత్వమే స్వయంగా ప్రకటిస్తుంది. ఈ ప్రభుత్వమూ పాలకపక్షమూ పప్పూ అని ఒక పదం సృష్టించాయి. అవతలి వాళ్లను అవమానించడానికి, వాళ్లు సంపూర్ణమైన అసమర్థులని హేళన చేయడానికి దాన్ని వాడుతారు. మరి నిజమైన పప్పూ ఎవరో మన గణాంకాలు ఏమి చెపుతున్నాయో మీకు చూపడానికి నేను రానున్న కొద్ది నిమిషాలు వాడుకుంటాను.

జాతీయ నమూనా సేకరణ సంస్థ గణాంకాలు నిన్ననే విడుద లయ్యాయి. మన పారిశ్రామిక ఉత్పత్తి అక్టోబర్‌లో నాలుగు శాతం తగ్గి, ఇరవై ఆరు నెలల కనిష్టానికి పడిపోయింది. వస్తు తయారీ రంగం 5.6 శాతం తగ్గిపోయింది. ఇప్పటికీ వస్తు తయారీ రంగమే మన ప్రధాన ఉద్యోగ కల్పనారంగం. పారిశ్రామిక ఉత్పత్తి సూచిక నిర్మించడానికి ఉపయోగించే 17 పారిశ్రామిక రంగాలు ప్రతికూల అభివృద్ధి రేట్లను నమోదు చేశాయి. గత సంవత్సరంలో మన విదేశీ మారక నిలువలు 72 బిలియన్ డాలర్లు తగ్గిపోయాయి. నిన్న ప్రశ్నోత్తరాల సమయం లో ఒక ప్రశ్నకు జవాబిస్తూ ఆర్థిక మంత్రిగారు వర్ధమాన దేశాలకు అందుతున్న విదేశీ సంస్థాగత మదుపులో 50 శాతం భారత్‌కే వస్తున్నదన్నారు. చాలా బాగుంది. కాని, ఆమె సహచరుడు, విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి గత శు క్రవారం ఈ సభలోనే మరొక ప్రశ్నకు జవాబిస్తూ, గత పది నెలల్లో దాదాపు రెండు లక్షల మంది, కచ్చితంగా చెప్పాలంటే 1,83,741 మంది, తమ భారత పౌరసత్వాన్ని వదులుకున్నారని చెప్పారు. 2022లో బైటికి తరలి వెళ్లిన ఈ ప్రవాహంతో కలిసి, ఈ ప్రభుత్వపు తొమ్మిదేళ్లలో భారత పౌరసత్వాన్ని వదులుకుని విదేశాలకు వెళ్లిపోయిన వారి సంఖ్య పన్నెండున్నర లక్షలు దాటి పోయింది. ఈ సంవత్సరం వెళ్లిపోయినవారి సంఖ్య మిగిలిన సంవత్సరాల సంఖ్య కన్న ఎక్కువ. అంటే అత్యంత సంపన్నులు భారత పౌరసత్వం వదులుకుని, పది లక్షల డాలర్లయినా వెచ్చిం చి పోర్చుగల్, సేంట్ కిట్స్, గ్రీస్ వంటి దేశాల పౌరసత్వం కొనుక్కోవడానికి సిద్ధపడుతున్నారన్నమాట. భారతదేశంలో ఆరోగ్యకరమైన ఆర్థిక వాతావరణమో, ఆరోగ్యకరమైన పన్నుల వాతావరణమో ఉన్నదనడానికి ఇది సూచన అవుతుందా?

**మరి నిజమైన పప్పూ ఎవరు ?**

వ్యాపారవేత్తల మీద, అత్యంత సంపన్నుల మీద ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అనే కత్తి వేలాడుతున్న భయ భీతావహ వాతావరణం రాజ్యమేలుతున్నది. పాలకపక్షం వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టి చట్టసభ సభ్యులను కొనుక్కుంటున్నది. ఈడీ దాడులకు గురవుతున్న వారిలో 95 శాతం ప్రతిపక్ష సభ్యులే ఉంటున్నారు. సరే, రాజకీయ నాయకుల సంగతి వది లేయండి. వాళ్లు గట్టివాళ్లు, తమను తాము రక్షించుకోగలరు. కాని వ్యాపారస్తులు, అత్యంత సంపన్నులు ఈ ప్రభుత్వానికి

సులభంగా దొరికిపోయే ఎరలుగా ఉన్నారు. గత వర్షాకాల సమావేశాలలో గౌరవ జేడీయూ సభ్యుడు రాజీవ్ రంజన్ సింగ్ అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ ఆర్థికమంత్రి గారు ఈ సభకు చెప్పినదేమంటే, గత 17 సంవత్సరాలలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ కింద ఈడీ 5,422 పరిశోధనలు చేపట్టిం దట. కాని, అన్ని కేసులలో కేవలం 23 మంది మీద మాత్రమే ఆరోపణలు రుజువయ్యాయట. అంటే దయనీయమైన 0.5 శాతం శిక్షా రేటు అన్నమాట. 2011 నుంచి ఈడీ 1,600 పరిశోధనలు చేపట్టి, 1800 సోదాలు చేసింది. కాని, ఆరోప ణలు రుజువై శిక్షలు పడినది కేవలం పది మందికి మాత్రమే. ఇప్పుడు అదనపు నిధులు కావాలి అని ప్రభుత్వం అడుగుతున్న అనుబంధ పత్రంలో రూ.2,900 కోట్లు అదనంగా ఈడీకి కావాలని అడుగుతున్నారు. భూమి కొనడానికి, కార్యాలయాలు నిర్మించడానికి ఈడీకి ఆ నిధులు కావాలట. అంటే మీరూ నేనూ పన్ను చెల్లింపుదారులందరమూ కట్టిన పన్నుల లోంచి ఇటు వంటి పరిశోధనలకూ, విచారణలకూ, సోదాలకూ, అధికారుల విదేశీ యాత్రలకూ అదనపు నిధులు ఇవ్వాలన్నమాట. అటు వంటప్పుడు పార్లమెంటుకూ ప్రజా ప్రతినిధులకూ ఈడీ అధికారులను ఒక ప్రశ్న అడిగే హక్కు వస్తుంది. ఆరోపణలు నిర్ధారణ అయ్యే రేటు, శిక్షా రేటు అంత ఘోరంగా 0.5 శాతం ఉన్నదంటే, ఈడీ పని ఎంచుకున్న వ్యక్తు లను వేధించడం మాత్రమేనా, లేక నిజమైన ఆర్థిక నేరస్తులను వెతికి పట్టుకుని, విచారణ జరిపి, ఆరోపణలు రుజువు చేసి, శిక్షలు విధించే పని ఏమన్నా చేస్తున్నారా? లేక ఈ స్థాయి అసమర్థతకు మీకు అదనపు నిధులు ఇవ్వాలా?

### మరి నిజమైన పప్పూ ఎవరు ?

పెద్ద నోట్ల రద్దు సాధించిన ఫలితాలను గురించి అధికారపక్ష సభ్యులు ఎటువంటి గణాంకాల సహాయం లేకుండా ప్రచారం చేసే అబద్ధాలు వింటుంటే వాంతి వస్తుంది. డబ్బు రహిత డిజి టల్ ఆర్థిక వ్యవస్థను రూపొందించడమే మీ లక్ష్యం అని చెప్పు కున్న దాన్ని మీరు సాధించలేదు. దొంగనోట్లను ఏరివేసే పనిని ఆరేళ్ల తర్వాత కూడ మీరు సాధించలేదు. మీరు పెద్దనోట్ల రద్దు ధమాకా ప్రకటన చేసిన ఆరేళ్ల తర్వాత చలామణీలో ఉన్న కరెన్సీ నవంబర్ 2016లో ఉన్న 18 లక్షల కోట్ల రూపాయల నుంచి ఈ నవంబర్ నాటికి 32 లక్షల కోట్ల రూపాయలకు చేరింది. సీఎంసీ అనే ద్రవ్య నిర్వహణా సంస్థ తయారు చేసిన క్యాష్ ఇండెక్స్ ఈ దీపావళికి అత్యున్నత స్థాయికి చేరింది. అంటే ఇంకా కాగితపు కరెన్సీదే రాజ్యం. మీ పెద్ద నోట్ల రద్దు చెప్పిన మూడు లక్ష్యాలలో ఏ ఒక్కటీ సాధించలేదు.

### మరి నిజమైన పప్పూ ఎవరు ?

అదనపు నిధుల కేటాయింపు కోరుతూ ప్రవేశపెట్టిన అనుబంధ పత్రం చూస్తున్నప్పుడు అందులోని చాలా అంశాలు దిగ్భ్రాంతి కలిగించాయి. ఎరువుల శాఖ గత మార్చిలో అడిగిన లక్షా తొమ్మిది వేల కోట్ల మొత్తం సబ్సిడీకి అదనంగా ఇప్పుడు అనుబంధ కోరికలలో మళ్లీ అదే పరిమాణంలో నిధులు కోరుతున్నది. అందులో కేవలం యూరియాకే రూ.86,000 కోట్లు ఉన్నాయి. నేలనూ, ఉత్పాదకతనూ, చివరికి మన ఆరోగ్యాలనూ చంపేస్తున్న మితిమీరిన యూరియా వాడకాన్ని అరికట్టడానికి ఈ ప్రభుత్వం ఏం చేస్తున్నది ? మన నేలకు కావలసినది సమతౌల్యపు ఎరువుల వాడకం. బెంగాల్ అటువంటి సమతౌల్యాన్ని పాటిస్తూ ప్రధాన ఎరువులన్నిటినీ సమపాళ్లలో వాడడాన్ని ప్రోత్సహిస్తున్నది. కాని కేంద్ర ప్రభుత్వం అటువంటి ప్రధాన ఎన్‌పీకే ఎరువుల సమతౌల్యపు సరఫరా బెంగాల్‌కు అందకుండా చేస్తున్నది. మా బంగాళా దుంపకు అవసరమైన మౌలిక ఎరువులు అవి. నవంబర్‌లో బెంగాల్ ప్రభుత్వం సమతౌల్యపు ఎరువులు ఇమ్మని కేంద్ర ప్రభుత్వాన్ని కోరితే, కేంద్ర ప్రభుత్వం మా డిమాండ్‌లో 33 శాతానికి మాత్రమే అనుమతించింది. ఎరువుల రంగానికి అవసరమైన సహజ వాయువును ఎక్కువగా గెయిల్ సరఫరా చేస్తుంది గనుక యూరియా సబ్సిడీలో అత్యధిక భాగం గెయిల్‌కే వెళుతుంది. ఈ రంగంలో ఎంతో కాలంగా చేస్తున్న సంస్కరణ వాగ్దానాలు అమలులోకి రావడం లేదు. గెయిల్ పరిధిని తగ్గిస్తామనే హామీ నెరవేరడం లేదు. ఈ ప్రభుత్వం గెయిల్‌ను పరిరక్షిస్తోంది. ప్రజలకు యూరియా సబ్సిడీ ఇస్తున్నామనే పేరు మీద అను బంధ పద్దులోని దాదాపు రెండు వేల కోట్ల రూపాయలు భారీ పరిశ్రమకు కట్టబెడుతున్నారు. మరొకవైపు పారిశ్రామిక రంగం లో అతి ఎక్కువ ఉద్యోగాలు కల్పిస్తున్న చిన్న, మధ్యతరహా పారి శ్రామిక రంగానికి మాత్రం కేవలం రూ.233 కోట్లు విదిల్చారు. ఇవి పూర్తిగా వక్రీకృత ప్రాధాన్యతలు.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి, ఇతర గ్రామీణ ఉపాధి పథకాలకు రూ.45,000 కోట్ల డిమాండ్ ఉంది. అది చాలా తక్కువ, చాలా ఆలస్యంగా అందుతున్నది. దేశంలోని ఉద్యోగ కల్పనలో మూడింట రెండు వంతులు గ్రామీణ రంగంలో ఉండగా, గ్రామీణ ప్రజలు అతి తక్కువ నరేగా ఉపాధి పొందుతున్నారని, వాగ్దానం చేసిన 100 రోజులు బదులుగా 30-40 రోజులు మాత్రమే ఉపాధి పొందుతున్నారని క్షేత్రస్థాయి నివేదికలు చెపుతున్నాయి. అంతేగాక, వేతనాల చెల్లింపులో మూడు నాలుగు వారాల ఎడం ఉంటున్నది. దానికంతటికీ కారణం తగినన్ని నిధుల కేటాయింపు జరగక పోవడమే. అదనపు నిధుల కోరికల జాబితాలో ప్రజా పంపిణీ వ్యవస్థ కింద ఆహార సబ్సిడీ ఊసే లేదు. మొత్తం మీద పేదల పట్ల వ్యతిరేకత కొనసాగుతున్నది.

**మరి నిజమైన పప్పూ ఎవరు ?**

ఇక అనుబంధ నిధుల కోరికల జాబితాలో బీఎస్ఎన్ఎల్ గురించి ఉన్నది. వయబిలిటీ గ్యాప్ ఫండ్(సరిగా పనిచేయ డానికి తక్కువ పడుతున్న నిధులు) పేరు మీద గ్రామీణ వైర్ లైన్ కార్యకలాపాల కోసం రూ.18,000 కోట్లు అడుగుతున్నారు. చూడగానే ఇది ఏ సమస్యా లేనట్టు కనబడుతుంది. కాని బీఎస్ ఎన్ఎల్‌కు ఈ నిధులు ఇచ్చేట్టయితే, రూ.30 వేల కోట్ల విలువైన ఉచిత స్పెక్ట్రమ్ ఇచ్చేట్టయితే, గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్కరికీ ఉచిత రోమింగ్ సౌకర్యం ఎందుకు ఇవ్వగూడదు? నేనేమీ బీఎస్ఎన్ఎల్ వినియోగదారును కాదు, నేను ఎయిర్ టెల్ వినియోగదారును. కాని బీఎస్ఎన్ఎల్ ఉచిత స్పెక్ట్రమ్ ఖర్చు చెల్లిస్తున్నది బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు మాత్రమే కాదు, దేశంలోని ప్రజలందరూ. అటువంటప్పుడు, ఎయిర్ టెల్‌కు గ్రామీణ ప్రాంతాల్లో సరైన నెట్‌వర్క్ లేకపోతే అందరికీ ఉచితంగా అందే బీఎస్ఎన్ఎల్ సర్వీసుతో ఎందుకు అనుసంధానం చెయ్యగూడదు? ఈ అనుబంధ ఖర్చుల పద్దులు అదనంగా రూ.4.36 లక్షల కోట్ల భారం వెయ్యనున్నాయి. అది మీరు బడ్జెట్‌లో పెట్టుకున్న ద్రవ్య లోటు లక్ష్యాన్ని దాటి పోతుంది. మరి ఆ లోటును పూరించడానికి ప్రభుత్వం దగ్గర ఉన్న అదనపు ఆదాయ మార్గాలేమిటి? పన్నేతర ఆదాయ మార్గాలేమిటి?

**మరి నిజమైన పప్పూ ఎవరు ?**

గౌరవ ఆర్థిక మంత్రి గారు నిన్న ఈ సభలో లేచి నిలబడి మా ప్రతిపక్షాలన్నిటినీ విదేశ్ కా దుష్మన్‌తో పోల్చారు. భారతదేశపు అభివృద్ధి చూసి మేం రగిలిపోతున్నామన్నారు. ఆ గౌరవ మంత్రి గారు ఎక్కడ ఉన్నారో గాని నేను ఆమెకు, ఈ ప్రభుత్వానికి, ఈ పాలక పక్షానికి ఒక మాట చెప్పదలచాను. మేమందరమూ మా జీవితాలను, యవ్వనాలను, ఉద్యోగాలను వదిలి ఈ మహత్తర భూమి సేవ కోసం, ఈ ప్రజల సేవకోసం మమ్మల్ని మేం అంకితం చేసుకున్నాం. కరీంపూర్ నుంచి కచ్ వరకూ, కార్గోడమ్ నుంచి కాసరగోడ్ వరకూ ఈ దేశపు నలు మూలలకూ ప్రాతినిధ్యం వహిస్తున్నవాళ్లమే. ఈ ప్రభుత్వాన్ని ప్రశ్నలు అడగడం ఎవరూ గుంజుకోలేని మా హక్కు. మీ అసమర్థతను ప్రశ్నించడం మా హక్కు. మౌనంగా, మారుమాట్లాడకుండా మా గొంతులు వినడం అధికారపక్షపు, ప్రభుత్వపు రాజధర్మ బాధ్యత. ఇక్కడ ఊరికే లేచి నిలబడి, సత్యం మాట్లాడడానికి అపారమైన సాహసమూ పట్టుదలా కావాలి. మేం ఆ పనే చేస్తున్నాం. కాగా అధికార పక్షం మాత్రం బెంగాల్‌ను ఉత్తర దక్షిణాలుగా విభజించడం దగ్గర మొదలుపెట్టి, పౌరసత్వ సవరణ బిల్లు నుంచి, రుజువై శిక్షపడిన హంతకులనూ రేపిస్టులనూ ఎన్నికల ముందు విడుదల చేయడం దాకా, న్యాయవ్యవస్థను బెదిరించడం వరకు ఒకదాని తర్వాత ఒకటిగా దేశాన్ని తగులబెట్టే పనులు చేస్తున్నది. భారతదేశాన్ని భయపెట్టి లొంగదీసు కోవాలని చూస్తున్నది. భయపెట్టి ఒకదాని తర్వాత ఒకటిగా ఎన్నికలు గెలవగలనని అనుకుంటున్నది. కాని, అది పని చేయడం లేదు. మీరు మూడు రాష్ట్రాల్లో ఎన్నికలకు వెళ్లారు. ఎంత బలప్రయోగం చేసినా, ఎన్ని వనరులు ఖర్చుపెట్టినా, మీరు ఒక్కటంటే ఒక్క రాష్ట్రం మాత్రమే గెలవగలిగారు. అధికార పక్షపు అధ్యక్షుడే తన సొంత రాష్ట్రంలోనే గెలవలేకపోయాడు.

**మరి నిజమైన పప్పూ ఎవరు ?**

ఔషధాలూ మూలికలూ అమ్ముకునే బాబా బహిరంగంగా తాను చీరల్లో, సల్వార్‌లో, అవి లేకుండా కూడా స్త్రీలను ఇష్టపడతానని బహిరంగంగా అంటాడు. అదీ ఒక అధికారపార్టీ ఉప ముఖ్యమంత్రి భార్య ఎదురుగా. మీ గుండె మీద చెయ్యి వేసుకుని మిమ్మల్ని మీరు అడుక్కోండి. ఇంతకు సుదూరమైన మాట అయినా సరే, ఒక ప్రతిపక్ష నాయకుడు అని ఉంటే మీరు అతని నెత్తురు కళ్ల చూసేవారు కాదా? కాని ఇప్పుడు అధికార పార్టీ ఆ మాటను కనీసం ఖండించలేదు. శిక్షపడిన హంతకుడు, రేపిస్టు పెరోల్ మీద బైటికి వచ్చి బహిరంగంగా ప్రవచనాలు పలుకుతుంటే అధికార పార్టీ నాయకులు చెవులప్పగించి వింటున్నారు. మీకు తప్పేదో ఒప్పేదో తెలుసుకునే నైతిక విచక్షణ కూడా లేదు.

**మరి నిజమైన పప్పూ ఎవరు ?**

మృదువైన హిందుత్వ పేరుతో శాంతియుతంగా ఉండమనీ, మౌనం వహించమనీ కొందరు నాకు చెపుతున్నారు. నేను హిందువునే. కాని,ఈ దేశానికి అవసరమైన ఏ విషయంలోనైనా మృదువుగా ఉండడానికి నేను నిరాకరిస్తున్నాను. ఈ దేశానికి కావలసింది ఒక ఎన్నికైన ప్రభుత్వం నైతికత పట్ల దృఢంగా ఉండడం, న్యాయబద్ధత పట్ల దృఢంగా ఉండడం, దృఢమైన ఆర్థిక విధానాలు అవలంబించడం. వీటిలో మృదుత్వం పనికి రాదు. ఆర్థిక వ్యవస్థను తమ అదుపులోకి తీసుకొమ్మని ఈ ప్రభుత్వానికీ ఆర్థిక మంత్రికీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఈ దేశపు పగ్గాలు ఎవరి చేతికి ఇవ్వాలో జాగ్రత్త వహించాలని భారత ప్రజలను కోరుతున్నాను. ❑

**(పార్లమెంటు శీతాకాల సమావేశాలలో డిసెంబర్ 13న తృణమూల్ కాంగ్రెస్ సభ్యురాలు మహువా మొయిత్రా చేసిన ఉపన్యాసం)**

**(అనువాదకుడి నోట్ : తృణమూల్ తోనూ, ఈ ఉపన్యాసంలో ప్రస్తావించిన బెంగాల్ ప్రశంసలతోనూ ఏకీభావం లేనప్పటికీ, సంఘ్ పరివార్ ప్రభుత్వం మీద ఈ శక్తిమంతమైన విమర్శ తెలుగు పాఠకులకు చేరాలనుకున్నాను)**

# తెలుగు రాష్ట్రాలలో రెండు దశాబ్దాల కాలంలో రాజకీయ పరిణామాలు



- డి.వి.వి.యస్ వర్మ

21వ శతాబ్దానికి ఇప్పుడు ఇరవై రెండేళ్లు. అందులో 14 ఏళ్లపాటు తెలుగు ప్రజలు ఉమ్మడి రాష్ట్రం వున్నారు. మిగిలిన 8 ఏళ్లు రెండు రాష్ట్రాలలో వున్నారు. ఈ కాలంలో శాసన సభలకు నాలుగుసార్లు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలు, పార్టీలు, వారి వారి గెలుపు ఓటముల ఫలితాలకే పరిమితం అయితే అది కేవలం ఎన్నికల విశ్లేషణే అవుతుంది. అధికార మార్పిడుల పరిశీలనే అవుతుంది. ఈ 22 ఏళ్లలో రాష్ట్ర రాజకీయరంగంలో కొన్ని కీలక పరిణామాలు జరిగాయి. పై పై చూపులకు అవి అంతగా కనిపించవు. కాని, అవి వర్తమానం మీద భవిష్యత్ మీద విశేషమైన ప్రభావాన్ని చూపించేవిగా వున్నాయి.

**కొన్ని ముఖ్య పరిణామాలు**

1. 1956లో సాధించుకున్న భాషా ప్రయుక్త రాష్ట్రం 2014 లో రెండుగా చీలింది.

2. కొత్తగా మరొక ఐదు రాజకీయ పార్టీలు పుట్టుకొచ్చాయి. అందులో రెండు పార్టీలు అధికారాన్ని దక్కించుకున్నాయి.

3. కాంగ్రెస్ పార్టీ ఆంధ్ర ప్రాంతంలో 2014లో నామ మాత్రంగా మిగిలింది. అది ఒక కుటుంబ వారసుని పరం అయింది.




**రాష్ట్రంలో నియంతృత్వ తరహా పాలన సాగిస్తున్నారు. పరిపాలన వ్యవస్థలని వినియోగించి రాజకీయ ప్రత్యర్థుల మీద కేసులు బనాయించడం, దాడులు చెయ్యడం, సర్వ సాధారణమైంది. తమ సమస్యల మీద ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేసే ఉద్యోగులు, ఉపాధ్యాయులు, నిరుద్యోగుల మీద వివిధ రకాల మహిళ కార్మికుల మీద బలప్రయోగం పరిపాటి అయింది. కోర్టు తీర్పులను పట్టించుకోకపోవడం, ప్రజాస్వామ్య హక్కుల్ని హరించడం, నిరంకుశ పాలనకు అద్దం పడుతున్నాయి. ఇవన్నీ అభద్రతా భావం నుండి ఉత్పన్నమైన రాజకీయ పోకడలు.**

4. ప్రభుత్వాల నేతలు నియంతలుగా మారడానికి పరిణామాలు దారి తీశాయి.

5. కుల, మత ప్రాబల్యం గల పార్టీల ఓటు బ్యాంకుల నుంచి ప్రత్యక్ష లబ్ధిదారులు ఓటు బ్యాంకులుగా రూపాంతరం చెందాయి.

ఇన్ని పరిణామాలను ఒక చిన్న వ్యాసంలో విపులీకరించడం సాధ్యం కాదు. అందువల్ల ఈ వ్యాసం కొన్ని పరిమితులు గల రేఖా చిత్రంగానే పరిగణించాలి.

**పూర్వరంగం**

1982లో ఎన్టీ రామారావు తెలుగుదేశం పార్టీ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో రాజకీయ రంగంలో అధికారం కోసం తెలుగు దేశం–కాంగ్రెస్‌ల మధ్య ద్విముఖ పోరాటంగా మారింది. ఇలాంటి పరిస్థితి కొనసాగుతున్న కాలంలో కొత్త పార్టీల ప్రవేశానికి ఎలాంటి జాగా(స్పేస్) వుండదు. కొత్త పార్టీలు పెట్టుకునే వారు తమకు తాముగా ఒక కొత్త రాజకీయ జాగాను నిర్మించుకోవాలి. లేదా ఆ రెండు పార్టీల మధ్య నలిగిపోయి పరాజయం పాలు కావాలి. రాజకీయ రంగంలో శూన్యత లేని కాలంలో 2001లో కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర సమితిని ఏర్పాటు చేశారు. పై రెండు పార్టీలు మధ్య జరుగుతున్న ఎన్నికల పోరాటంలో భాగం కాకుండా 'ప్రత్యేక రాష్ట్ర సాధన' నినాదంతో తన పార్టీకి కొత్త జాగాను రూపొందించుకున్నారు. అది 2010 నాటికి ఒక ప్రజా ఉద్యమమైంది. 2014లో ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది. అప్పుడే

జరిగిన ఎన్నికలలో తెరాస పార్టీ విజయాన్ని సాధించింది.

### జాతి నిర్మాణానికి భాష ఒక్కటే సరిపోతుందా?

1956కి పూర్వం రెండు ప్రాంతాలలోనూ విశాలాంధ్ర ఏర్పడాలన్న ఉద్యమం జరిగింది. తొలిభాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పడింది. తర్వాత 13 ఏళ్లకే హైకోర్టు ముల్కీని (స్థానిక ఉపాధి హక్కు) రద్దు చేయడంతో జై తెలంగాణ ఉద్యమం, జై ఆంధ్ర ఉద్యమాలు రాష్ట్ర విభజన కోరుతూ ఉగ్రరూపంతో సాగాయి. కేంద్రం రాష్ట్ర విభజనను వ్యతిరేకించి స్థానిక ఉద్యోగ రక్షణ కల్పిస్తూ ఆరు సూత్రాల పథకాన్ని ప్రకటించి విభజనను నిరోధించింది. స్థానిక జీవనోపాధి సమస్య భాషాపరమైన సమైక్యతను సవాలు చేయగలిగింది. భాషను మించిన ప్రభావాన్ని జీవన సమస్యలు కలిగిస్తాయని ఈ ఉద్యమాలు స్పష్టం చేశాయి. 2001లో ఏర్పడిన తెలంగాణ రాష్ట్ర సమితి పార్టీ ప్రత్యేక తెలంగాణ నినాదంతో తెలంగాణ వెనకబాటుతనాన్ని, భాషాపరమైన మాండలిక, సాంస్కృతికపరమైన అంశాలను, నీళ్లు–నిధులు–నియామకాల వంటి జీవన సమస్యలతోపాటు వారిలో కొత్త ఆకాంక్షలను పెంపొందించి విస్తరించింది. ఇది ఉమ్మడి రాష్ట్రం ఏర్పడిన 50 ఏళ్ల తర్వాత జరిగింది. ఒక భాష మాట్లాడే జాతిని సమైక్యపరచడం అంటే జాతి నిర్మాణం, అది ప్రాంతీయపరమైన అంతరాలను, భాషా సాంస్కృతికపరమైన అంశాలను, ఆర్థికంగా ఎదగాలని భావించే ప్రాంతీయ వర్గాల ఆకాంక్షలను గుర్తించడం, గౌరవించడం, వాటికి సముచిత స్థానం కల్పించడం ద్వారానే ఒక భాష మాట్లాడే ప్రజా సమూహాలను ఒక జాతిగా కలిపి వుంచడానికి తప్పనిసరి అవసరం. భాష ఒక ప్రాతిపదిక అయినప్పటికి అది మాత్రమే సరిపోదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం నుండి తీసుకోవలసిన గుణపాఠం ఇదే.

### ఉమ్మడి రాష్ట్రంలో కొత్త పార్టీలు

తెరాస పార్టీ 2001లో ఏర్పడింది. ప్రత్యేక తెలంగాణా నినాదంతో అది తనదైన ప్రత్యేక జాగాను(స్పేస్)ను నిర్మించుకుని విస్తరించిన క్రమం మనం చూశాం. 2006లో డా॥ జయ ప్రకాష్ నారాయణ్ నాయకత్వంలో లోక్‌సత్తా పార్టీ ఏర్పడింది. కొత్త తరానికి కొత్త రాజకీయం పేరుతో ఈ పార్టీ కూడా ప్రజలలో తనదైన ప్రత్యేక జాగా కోసం ప్రయత్నించింది. ఆ పార్టీ ప్రకటించిన ప్రజాస్వామ్య సంస్కరణలు, అవినీతి అంతం కోసం, వికేంద్రీకరణ కోసం ఇచ్చిన నినాదాలు మధ్యతరగతి ప్రజల్ని ఆకర్షించాయి. 2009 ఎన్నికలలో నగరాలలో 9, 10 శాతం ఓట్లు పొంది, ఒక స్థానాన్ని గెలుచుకుంది. 2014 ఎన్నికలలో పోటీ చేసినా దాని ప్రభావం విస్తరించలేదు. ఇకపై ప్రత్యక్ష ఎన్నికలకు దూరంగా వుంటుందని ప్రకటించి ఎన్నికల రంగం నుండి స్వచ్ఛందంగా నిష్క్రమించింది.

2008లో ప్రజారాజ్యం పేరుతో చిరంజీవి తన పార్టీని ప్రకటించారు. ఆ పార్టీ తనదైన ప్రత్యేక జాగా కోసం ప్రయత్నించకుండా ప్రధాన పార్టీల మీద వున్న వ్యతిరేకత మీద, సినీ అభిమానుల మీద, కుల ప్రభావం మీద విజయం సాధించాలనుకున్నారు. తనదైన రాజకీయ జాగా లేకపోవడంతో పై పరిమిత బలంతో 16 శాతం ఓట్లు గెలుచుకున్నారు. తన పార్టీని కొనసాగించలేని స్థితిలో దానిని కాంగ్రెస్‌లో విలీనం చేసి ఆయన కేంద్ర మంత్రి అయ్యారు. తనదైన ప్రత్యేక ఎజెండాతో ప్రజల ఆకాంక్షలను పెంచి ప్రజాబలంతో అధికారంలోకి రావాలన్న ప్రయత్నం లేనప్పుడు జరిగేది ఇంతేనని ఆ పార్టీ రుజువు చేసింది.

### పార్లమెంటరీ వ్యవస్థ - అధ్యక్ష తరహాల ఎన్నికలు

ఉమ్మడి రాష్ట్రంలోనే 2011లో వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీ ఏర్పడింది. అది ఏర్పడిన నాడే బలమైన పోటీదారు కావడానికి దారితీసిన రాజకీయ నేపథ్యాన్ని మనం పరిశీలించాలి. మన రాజ్యాంగం ప్రకారం దేశంలో ప్రధానమంత్రిని, రాష్ట్రంలో ముఖ్యమంత్రిని ప్రత్యక్షంగా ఎన్నుకునే పద్ధతి లేదు. లోక్‌సభలో, శాసన సభలో మెజారిటీ స్థానాలు గెలిచిన పార్టీ తమ నాయకుని ఎన్నుకుంటుంది. వారు ప్రధాని, ముఖ్యమంత్రి అవుతారు. ఇది పరోక్ష పద్ధతి. అధ్యక్ష తరహా ఎన్నిక ప్రత్యక్ష పద్ధతి. 21వ శతాబ్దంలో మన రాజకీయ రంగంలో రాజ్యాంగ బద్ధమైన పరోక్ష పద్ధతి స్థానంలో క్రమేణా అధ్యక్ష తరహా ప్రత్యక్ష పద్ధతి ఆచరణలో వేళ్లూనుకుంది. దీని పర్యవసానంగా పార్టీల మధ్య పోటీకి బదులు నాయకుల మధ్య పోటీగా మారింది. ఒక పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిని ప్రకటించడం ఇతర పార్టీలు కూడా దానిని అనుసరించడం చాలాచోట్ల ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈ పరిణామం చోటు చేసుకుంది. ముఖ్యమంత్రి చంద్రబాబా లేక రాజశేఖరరెడ్డా అన్నది నినాదం అయింది. ఓటర్లు తమ ముఖ్యమంత్రి కోసం ఓటు వేసే స్థితి వచ్చింది. స్థానిక అభ్యర్థులకంటే ముఖ్యమంత్రి ఎవరన్నదే ప్రధానమైంది. ఎన్నికల రంగంలో అధ్యక్ష తరహా ఆలోచన ప్రవేశించడంతో అది రాజకీయ రంగంలో కొన్ని కొత్త కోణాలను ముందుకు తెచ్చింది. 1. ఎప్పుడైతే పార్టీల స్థానంలో ముఖ్యమంత్రుల అభ్యర్థులు ప్రధానం అవుతారో, ఓటర్లు ఆ వ్యక్తుల చుట్టూ సమీకృతం అవుతారో అలాంటి దశలో వారికి వారసులు పుట్టుకొస్తారు. ప్రజలు అలాంటి వారసుల కోసం ఎదురు చూస్తారు. వై.యస్. జగన్ అలా ఒక జాతీయ పార్టీలో పుట్టుకొచ్చిన వారసుడు.

2009 ఎన్నికలలో జగన్ పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యే వరకు ఆయన గురించి ఎవరికీ తెలియదు. కాంగ్రెస్ పార్టీలో

దీర్ఘకాలంగా పనిచేసిన చరిత్ర లేదు. ప్రజా ప్రతినిధిగా ఏదో ఒక స్థాయిలో పదవులు నిర్వహించిన అనుభవం లేదు. కాని రాజశేఖర రెడ్డి మరణంతో కాంగ్రెస్ పార్టీ సహజంగానే ఆ పార్టీ సీనియర్ నేతలకు అధిష్టానం అధికార పగ్గాలు అప్పగించింది. కాని కాంగ్రెస్ శ్రేణులు, ఓటర్లు రాజశేఖరరెడ్డి వారసుని కోసం చూస్తున్నారు. అలా రాజశేఖరరెడ్డి వారసునిగా గత చరిత్రతో నిమిత్తం లేకుండా వారు జగన్‌కు బ్రహ్మరథం పట్టారు. ఇది అధ్యక్ష తరహా పోటీ పద్ధతి నుండి ఉత్పన్నమైన ఒక రాజకీయ పరిణామం.

## మారిన ఓటు బ్యాంకు రాజకీయం- డిమాండ్ లేని సప్లయ్

దీనిలో భాగంగానే ఓటు బ్యాంకు రాజకీయం కూడా మారిపోయింది. గతంలో ఓటు బ్యాంకులు కులాల ప్రాతిపదికగా మతాల ప్రాతిపదికగా, సమూహాల ప్రాతిపదికగా వారికి ప్రత్యేక కార్పొరేషన్లు, రాయితీలు ప్రాతిపదికగా రూపొందించుకున్నారు. ఇప్పుడు వాటిని నామమాత్రంగా కొనసాగిస్తూనే నేరుగా ఓటరుకు, వారి కుటుంబాలకు ఏదో ఒక పథకం పేరుతో డబ్బును అందిస్తున్నారు. ఓటర్ల నోట నాయకుని పేరు వినిపించేలా ఈ పథకాలు అమలు చేస్తున్నారు. ఇప్పుడు ప్రధానంగా ఓటర్లుగా వున్న పేద ప్రజలు తమ కోసం ఎలాంటి డిమాండ్ చేసే అవసరం లేదు. రాజకీయ పార్టీలు డిమాండ్ లేని సప్లయిగా పథకాలను ఇస్తున్నారు. పసుపు కుంకుమ కావాలని ఎవరూ డిమాండ్ చెయ్యలేదు. ఎలాంటి ఉద్యమాలు రాలేదు. అయినా పసుపు కుంకుమ సప్లయి అయింది. అలాగే అమ్మ ఒడి, డ్వాక్రా మహిళలకు ప్రత్యేక ధన సహాయం వారు కోరింది కాదు. అయినా సప్లయి చేస్తున్నారు. ఇప్పుడు ఈ పథకాల చుట్టూ ఓటు బ్యాంకులు ఏర్పడుతున్నాయి. దీనిలో అన్నీ కులాలు, మతాలు వుంటున్నాయి. ఒకో పథకం సూదంటు రాయిలా ఒకో ఓటు బ్యాంకు సమూహంగా మారుతోంది. ఓటర్లకు ఇప్పుడు వున్నది ఏ పార్టీ ఏ నాయకుడు అధికారంలోకి వస్తే తమకు ఏమి దక్కుతుందనే లబ్ధిదారుల చైతన్యం మాత్రమే వుంది. రాష్ట్రాలలో రాజకీయం దాని చుట్టూనే, ఓటర్లు దాని చుట్టూనే తిరుగుతున్నారు.

## నియంతలుగా మారడానికి తెరుచుకున్న ద్వారాలు

మరో పరిణామం పార్టీలో నాయకుడే సర్వస్వం అయినప్పుడు ప్రజలలో నాయకుని ఆరాధన వ్యక్తి పూజ మెదలవుతుంది. ప్రభుత్వ సొమ్ము అది ప్రజల పన్నుల సొమ్ము. కాని అది ముఖ్యమంత్రుల సొంత సొమ్ముగా ప్రచారం అవుతుంది. ప్రభుత్వాలు ఏ పథకాలు ప్రకటించినా అవి ముఖ్యమంత్రి పేరు తగిలించి వదులుతారు. జగనన్న పథకాలు, అంతకుముందు చంద్రన్న పథకాలు అన్నీ వ్యక్తి పూజ, ఆరాధన పెంచడానికి పుట్టుకొచ్చినవే. తన వల్లే పార్టీ, తన వల్లే గెలుపు, తన చుట్టూనే ప్రజలు అన్న భావన ముఖ్యమంత్రుల తలకెక్కితే అది నియంత పోకడలకు దారి తీస్తుంది. తన అదుపులో పార్టీయే కాదు, పోలీసు, ప్రభుత్వ యంత్రాంగం అంతా తన చెప్పు చేతలలోకి తెచ్చుకోవడం ఇతర పార్టీలను అణిచిపెట్టడానికి, ప్రజా ఉద్యమాల మీద దాడులు చెయ్యడానికి, మీడియా నోరు నొక్కడానికి వెనుకాడని పరిస్థితి నెలకొంటుంది. ఏ పార్టీ అయినా ప్రత్యర్థి నాయకుల్ని బదనాం చెయ్యడం ప్రధాన వ్యాపకం అవుతుంది. వ్యక్తిగత దూషణలో, దాడులు పెచ్చరిల్లి నియంత పోకడల నుండి పుట్టుకొచ్చిన నీచ రాజకీయమే.

## రాష్ట్ర విభజన - అనంతర పరిణామాలు

ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన రాజకీయ పరిణామాల కొనసాగింపు రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. 2014 ఎన్నికలలో ప్రత్యేక తెలంగాణను సాధించిన ఉద్యమ నేపథ్యంలో తె.రా.స విజయం సాధించింది. కె.చంద్రశేఖర రావు ఆ ఉద్యమానికి ఎన్నికల విజయానికి తిరుగులేని నాయకుడు కావడంతో ఆ పార్టీ ఒక కుటుంబ పార్టీగా రూపొందింది. కె.సి.ఆర్ తన కుమారున్ని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చేసి తన వారసుడిని ఖరారు చేసుకున్నారు. ప్రజా ప్రతినిధులకు టిక్కెట్లు ఇచ్చేది, గెలిపించేది ఆయనే కావడంతో నియంతగా వ్యవహరించే దారి ఏర్పడింది. పరిపాలనా యంత్రాంగాన్ని తన అదుపాజ్ఞలలోకి తెచ్చుకున్నారు. ముందుగా ప్రత్యర్థిగా వున్న తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధుల్ని సామ దాన దండోపాయాలతో తన పార్టీలో కలిపేసుకున్నారు. అంతర్గత కుమ్ములాటలలో వున్న కాంగ్రెస్ పార్టీతో బలమైన ప్రతిపక్షం లేకుండాపోయింది. మొదటి ఐదేళ్లలో తెలంగాణ ప్రభుత్వం సాగునీరు, తాగునీరు అందించే మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలు మైనర్ ఇరిగేషన్‌తో, గ్రామాలకు తాగునీరు అందించడంలో మంచి ఫలితాలనే ఇచ్చింది. తర్వాత ఆ ప్రభుత్వం భారీ ఎత్తిపోతల పథకాలను తలకెత్తుకుంది. తన బడ్జెట్‌కు మించిన భారం కావడంతో పైగా అందులో అవినీతి పెరగడంతో తెలంగాణ అప్పులదారి పట్టింది. దీనికి తోడు తన రాజకీయ ఆధిపత్యం కోసం ప్రజలకు నేరుగా లబ్ధి చేకూర్చే అనేక పథకాలను ప్రారంభించింది. 10 జిల్లాల తెలంగాణను 32 జిల్లాలుగా విభజించి రాష్ట్రానికి అదనపు భారం తెచ్చారు. విభజన నాటికి 70,000 కోట్లు అప్పు వున్న రాష్ట్రం ఇప్పుడు అధికారికంగా 3,12,191 లక్షలకు పెరిగింది. ఎత్తిపోతల పథకాలకు వివిధ ద్రవ్య సంస్థల నుండి తెచ్చిన అప్పులు కలుపుకుంటే 4 లక్షల కోట్లకు పైగా అప్పువున్నట్లు అంచనా వేస్తున్నారు. ఇన్ని అప్పులు చేసినా ఇంకా నెరవేర్చాల్సిన వాగ్దానాలు డబుల్ బెడ్ రూం ఇల్లు, పేదలకు 3 ఎకరాల

భూమి, దళిత బంధు వగైరాలు నిధులు లేక నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలో అధికారంలో వున్న బి.జె.పి. తెలంగాణలో మతపరమైన విభజన రాజకీయంతో దూకుడును పెంచింది. కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వ వ్యతిరేకతను వినియోగించుకుని ఎదిగే ప్రయత్నాలు చేస్తున్నది. తెరాస ప్రభుత్వం ఇప్పుడు ఒక పక్క ఆర్థిక ఇబ్బందులు, మరొక పక్క రాజకీయ సంఘర్షణను ఎదుర్కొనే సంకట స్థితిలో తన పూర్వ వైభవాన్ని కోల్పోయే స్థితిలో పడింది.

**ఆంధ్రప్రదేశ్**

2014 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ, బి.జె.పి. కలిసి పోటీ చేశాయి. ఎన్నికలకు ముందు పవన్‌కల్యాణ్ జనసేన పార్టీని ఏర్పాటుచేశారు. ఈ ఎన్నికలలో ఆ పార్టీ పోటీ చేయకుండా తెలుగుదేశం పార్టీకి మద్దతు ప్రకటించింది. ఈ ఎన్నికలలో విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. అటు తెలంగాణాలోను కొన్ని స్థానాలు గెలవడంతో తెలుగుదేశం పార్టీని జాతీయ పార్టీగా ప్రకటించారు. చంద్రబాబు అధ్యక్షుడుగా, కుమారుడు లోకేష్ ప్రధాన కార్యదర్శిగా, వారసుని పేరు కూడా నిర్ధారణ చేశారు. చంద్రబాబు ప్రభుత్వ తొలి ప్రాధాన్యత ప్రపంచంలోనే అత్యాధునిక రాజధాని నిర్మాణం అయింది. అమరావతి రాజధాని కోసం రైతుల నుండి ఉభయ తారకంగా వుండే విధంగా 33 వేల ఎకరాల భూమిని సేరించడంతో రాజధాని నిర్మాణానికి తొలి అడుగువేశారు. దేశ ప్రధానితో శంకుస్థాపన చేయించి రాజధాని నిర్మాణం పట్ల విశ్వాసం కల్పించారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగవంతం చెయ్యడానికి పూనిక వహించారు. అలాగే తక్షణ అవసరాల కోసం తాత్కాలిక రాజధాని పనులు పూర్తి చేసి అమరావతి నుండి పరిపాలన మొదలుపెట్టారు. ఈ ఐదేళ్లలో ముఖ్యమంత్రి ఇటు అమరావతి అటు పోలవరం మీదే తన దృష్టి కేంద్రీకరించారు. మరోపక్క ప్రతిపక్ష నేతగా వున్న జగన్ పాదయాత్రలతో రాష్ట్రాన్ని చుట్టుముట్టి ప్రభుత్వ వాగ్దాన భంగాలను వినియోగించుకుని బలపడ్డారు. 2019 నాటికి రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి మారింది. బి.జె.పి.తో పొత్తును తెలుగుదేశం పార్టీ తెగతెంపులు చేసుకుంది. గత ఎన్నికలలో మద్దతు ఇచ్చిన పవన్‌కల్యాణ్ ఈ ఎన్నికలలో వేరుగా పోటీ చేశారు. దీనికితోడు ఆ పార్టీ వాగ్దానం చేసిన సంక్షేమ పథకాలు పూర్తిగా అమలులోకి రాలేదు. మరో పక్క రాష్ట్రంలో అప్పులు 90 వేల కోట్ల నుండి 2 లక్షల 42 వేల కోట్లకు పెరిగాయి. అదనంగా పెండింగ్ బిల్లులు వున్నాయి. ఈ పరిస్థితులలో ఒంటరి పోరాటంలో తెలుగుదేశం పార్టీ పరాజయం పాలైంది.

175 స్థానాలున్న రాష్ట్ర శాసనసభలో 151 స్థానాలు గెలుచుకుని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చారు. భారీ మెజారిటీ, ఏక వ్యక్తి ఆధారిత పార్టీ అధినేత కావడంతో నియంత తరహా పాలనకి దారి ఏర్పడింది. తాను పాదయాత్రలో చేసిన వాగ్దానాలు, ప్రకటించిన నవరత్నాల పథకాలు అమలు చేయడం ద్వారా ప్రత్యక్షంగా లబ్ధి పొందే ఓటు బ్యాంకును పదిలపర్చుకోవడమే ప్రధాన లక్ష్యం అయింది. ఈ మూడేళ్లలో లక్షా 80 వేల కోట్లు వీటిపైనే ఖర్చు పెట్టారు. ఈ ప్రభుత్వం ఈ మూడేళ్లలో అప్పుల భారాన్ని 4,73,000 కోట్లకు పెంచింది. కార్పొరేషన్ల ద్వారా ఇతరత్రా చేసిన అప్పులు మరో లక్ష కోట్లు వుంటాయన్నది ఒక అంచనా. అప్పు లేకుండా ఒక్క నెల కూడా గడిచే స్థితి లేకుండా పోయింది. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుంది. అభివృద్ధి కార్యక్రమాలు కుంటుపడ్డాయి. మరో పక్క అనాలోచిత ప్రభుత్వ నిర్ణయాలు పరిపాలనను అస్తవ్యస్తం చేస్తున్నాయి. వికేంద్రీకరణ పేరుతో మూడు రాజధానుల ప్రకటన రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి తగిన ప్రణాళికకు బదులుగా ప్రాంతీయ అంతరాలను రాజకీయ లబ్ధికోసం వినియోగించుకునే పాచికగా మారింది. ఇది ప్రాంతీయ అసమానతల స్థాయి నుండి విద్వేషాల స్థాయికి పెరిగితే యీ రాష్ట్ర సమగ్రతే ప్రశ్నార్థకమౌతుంది. రెవెన్యూ జిల్లాల విభజన రెవెన్యూ మండలాల ప్రాతిపదికన కాకుండా అశాశ్వితమైన పార్లమెంటరీ నియోజకవర్గాల ఆధారంగా చేయడంతో అవి అయ్యవార్లను చెయ్యబోతే కోతి రూపం ధరించాయి. పంచాయతీలకు, మున్సిపాలిటీలకు అధికారాలు, నిధులు బదిలీ చేయకుండా వాటి అదుపులో లేని సచివాలయాల ఏర్పాటు, రాజకీయ లబ్ధికోసం ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థలు పరిపాలన వికేంద్రీకరణకు బదులుగా మరింత కేంద్రీకరణ చేశారు. ప్రాథమిక విద్యలో బోధనా భాషగా ఇంగ్లీషును అశాస్త్రీయమైన పద్ధతిలో ప్రవేశపెట్టి పిల్లల విద్యా వికాసంతో చెలగాటం ఆడుతున్నారు. ఇక రాష్ట్రంలో నియంతృత్వ తరహా పాలనలు సాగిస్తున్నారు. పరిపాలన వ్యవస్థలని వినియోగించి రాజకీయ ప్రత్యర్థుల మీద కేసులు బనాయించడం, దాడులు చెయ్యడం, సర్వసాధారణమైంది. తమ సమస్యల మీద ఆందోళనలు, నిరసనలు వ్యక్తం చేసే ఉద్యోగుల మీద, ఉపాధ్యాయుల మీద, నిరుద్యోగుల మీద వివిధ రకాల మహిళ కార్మికుల మీద బలప్రయోగం చేయడం పరిపాటి అయింది. అందులో భాగంగానే అమరావతి రైతుల పాదయాత్ర మీద దాడులు సాగిస్తున్నారు. కోర్టు తీర్పులను పట్టించుకోకపోవడం, ప్రజాస్వామ్య హక్కుల్ని హరించడం, నిరంకుశ పాలనకు అద్దం పడుతున్నాయి. ఇవన్నీ అభద్రతా భావం నుండి ఉత్పన్నమైన రాజకీయ పోకడలు. ఆంధ్రప్రదేశ్‌లో నెలకొన్న ఈ పరిస్థితిని చక్కదిద్దుకునే బాధ్యత పౌరసమాజం మీదే వుంది. ❑

**(ప్రపంచ రచయితల సభ సందర్భంగా ప్రచురించిన 'గమనం-గమ్యం' పుస్తకంలోని వ్యాసం సంక్షిప్తంగా..)**

# భ్రమల గూడు కడుతున్న బహుజన రాజకీయాలు



- అశోక్ కుంబము

**దేశ ఎన్నికల రాజకీయాలను పరిశీలించే ఎవరికైనా మతం, కులం, మత్తు, డబ్బు ఎలా పనిచేస్తాయో, ఎన్నికల బూటకత్వం, విలువలు లేనితనం ఏమిటో చెప్పనక్కర లేదు. అణగారిన ప్రజలను కేవలం బహుజనులు, మహాజనులు అని ఒక పెద్ద సంఖ్య కిందికి కుదించి వాళ్ళను ఓటర్లుగా చూసి మురిసిపోకుండా, నిబద్ధతతో కూడిన నిర్మాణాత్మక ఉద్యమాలు చేయడం అవసరం. ఆ ఉద్యమాలకు హిందూత్వం, సామ్రాజ్య వాద వ్యతిరేక రాజకీయాలు లేకపోతే అవి దళిత, బహుజనులను మోసగించడానికే దారితీస్తాయి.**

మార్టిన్ లూథర్ కింగ్‌కు భారతదేశంలో పర్యటించాలనేది ఒక చిరకాల కోరిక. అక్కడ స్వాతంత్ర్యోద్యమంలో ప్రజలు అనుసరించిన పోరాట మార్గాలను, వాటి ఫలితాలను పరిశీలించి అవి అమెరికాలో నల్ల జాతి విముక్తికి ఎలా ఉపయోగపడుతాయో అర్థం చేసుకోవాలని అతని తాపత్రయం. చివరికి 1959లో ప్రధాని నెహ్రూ ఆహ్వానం మేరకు తన సహచరి కొరెట్టా స్కాట్ కింగ్‌తో కలిసి ఇండియా వచ్చాడు. అతను ఢిల్లీ చేరగానే విలేకరులతో మాట్లాడుతూ 'నేను ఇతర దేశాలకు పోతే ఒక టూరిస్టులా పోతాను, కానీ ఇండియాకు ఒక యాత్రికునిగా వచ్చాను' అన్నాడు. అతను ఇండియాను ఒక 'పుణ్యక్షేత్రం'గా భావించడానికి కారణం అది గాంధీ పుట్టిన గడ్డ కావడం. మార్టిన్ లూథర్ కింగ్‌కు గాంధీ అంటే విపరీత మైన అభిమానం, గౌరవం. అమెరికాలో నల్ల జాతి విముక్తికి గాంధీ అహింసామార్గం ఒక ఆయుధమని భావించాడు. భారత దేశంలో కేవలం గాంధీ శాంతియుత రాజకీయాలను మాత్రమే కాదు. భారతదేశ సామాజిక వ్యవస్థలో తరతరాలుగా అట్టడుగుకు తొక్కబడిన 'అంటరాని' ప్రజల జీవితాలను చూడాలనుకున్నాడు. దేశ ప్రధాని ఆహ్వానం మేరకు రావడంతో అతను ఎక్కడపోయినా అధికార మర్యాదలకు, సౌకర్యాలకు కొదవలేదు. ప్రతిచోట తన ఆటోగ్రఫీ తీసుకోవడానికి ప్రజలు గుంపులుగా ఎగబడేవారు. అధికార ఆర్భాటాల మధ్య దేశంలో పర్యటిస్తే ప్రజల నాడీ అర్థం కాదని తాను, తన సహచరి ఇద్దరే కలిసి కేరళలోని త్రివేండ్రం పోతారు. అక్కడ ఒక దళితవాడలోని స్కూల్‌కి పోయి ఆ స్కూల్ హెడ్ మాస్టర్‌తో మాట్లాడి, విద్యార్థులతో సంభాషించే అవకాశం ఇవ్వమని కోరుతారు. దానికి ఆ హెడ్ మాస్టర్ ఒప్పుకొని వారిని ఒక క్లాస్ రూంలోకి తీసుకుపోయి 'విద్యార్థుల్లారా' మీకు అమెరికా నుండి వచ్చిన మీ తోటి అంటరానివాడిని పరిచయం చేయాలనుకుంటున్నాను" అనే పరిచయ వాక్యంతో మొదలు పెడతాడు. ఒక్కసారిగా తనను అంటరానివాడిగా పరిచయం చెయ్యగానే మార్టిన్ లూథర్ కింగ్‌కు ఎట్లా స్పందించాలో కూడా అర్థం కాలేదు. 'నాది ఈ దేశం కాదు. ఈ ఖండం కాదు. ఈ కుల వ్యవస్థతో సంబంధం లేదు. అయినా నేను ఇక్కడ అంటరానివాణ్ణి ఎట్లయిన?' అనే ప్రశ్నలతో ఆశ్చర్యపోతాడు. 'తాను అమెరికాలో జాతి వివక్ష వ్యతిరేక ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్నా, నెహ్రూ ఆహ్వానంతో భారతదేశ అతిథిగా వచ్చినా ఆ హెడ్ మాస్టర్ దృష్టిలో అంటరానివాడిగా ఎలా మారాను' అని బాధపడతాడు. కానీ కొంత లోతుగా ఆలోచిస్తే 'నిజమే, అమెరికాలో నేను అంటరానివాడినే కదా! నేనే కాదు, కోట్లాది నల్ల జాతీయులందరూ వందల ఏండ్లుగా బానిసలుగా, అంటరాని వాళ్ళుగా బతుకుతున్నారు కదా' అనే అభిప్రాయానికి వస్తాడు. (ఈ సంఘటనను 2020లో ఇసబెల్ విల్కెర్సన్ అనే ప్రముఖ నల్లజాతి జర్నలిస్టు జాతివివక్ష మీద రాసిన తన పుస్తకం



Caste: The Origins of Our Discontentsలో ప్రస్తావించారు. అమెరికాలో జాతి వివక్ష గురించి రాసిన ఈ పుస్తకానికి 'కులం' అనే శీర్షిక పెట్టి కులానికి, జాతివివక్షకు ఉండే సంబంధాన్ని వివరిస్తుంది. కుల వివక్షను, జాతివివక్షను ఒకే గాటన కట్టడం సరైనది కాదు అనే విమర్శ వుంది. అది వేరే చర్చ)

గత ఏడాది ఒక మిత్రుడి తల్లిదండ్రులు అమెరికా వచ్చారు. వాళ్ళు 'అగ్ర'కులస్తులు. ఒకసారి వాళ్ళను కలిసినప్పుడు మా మిత్రుడి తండ్రి తన బుర్రను ఎప్పటి నుండో తొలిచేస్తున్న ఒక ప్రశ్న అడిగాడు. 'ఈ దేశంలో వున్న నల్లోళ్ళు అంతా మన దగ్గర మాల, మాదిగోళ్ళ మాదిరిగానేనా?' 'నల్లోళ్ళు కూడా అంటరాని వాళ్ళేనా?' అనేది ఆయన ప్రశ్నలోని సారాంశం. దానికి సమాధానంగా నేను 'అంకుల్, ఈ దేశంలో తెల్ల జాత్యహంకారుల దృష్టిలో నల్లోళ్ళు మాత్రమే కాదు, మనమందరం మాల మాదిగోళ్ళమే" అని చెప్పిన. ఆ మాటకు ఆ పెద్దాయన మొఖంలో రక్తం గడ్డకట్టినట్లు అయ్యింది. 'ఇంత బతుకు బతికి మనం మాల మాదిగోళ్ళం కావడం ఏంది' అన్నాడు. నేను వెంటనే 'ఎంత బతుకు బతికినా వాడి దృష్టిలో మనం మాల, మాదిగోళ్ళమే" అని మళ్ళీ అదే మాట చెప్పిన. గుండె పలిగిలినంత పనయినట్లుంది. అక్కడి నుండి వెంటనే వెళ్ళిపోయిండు. ఈ రెండు సంఘటనలలో కులం ఏ విధంగా ఆధిపత్య భావనను నిర్మాణం చేస్తుందో తెలుస్తుంది. అంతేకాదు, కులం ఏ విధంగా ఒక అపరిపక్వ మానసిక స్థితిని, అహేతుక సామాజిక తను, అపసవ్య ప్రాపంచిక దృక్పథాన్ని తయారుచేస్తదో అర్థమవుతుంది. అయితే కులం కేవలం వ్యక్తుల మీద జరిగే హింస, అణిచివేత, అవమానం మాత్రమే కాదు. అది ఒక వ్యవస్థీకృత నేరం. అది అట్టడుగు కులాలకు ఒక ఊపిరాడని స్థితిని తయారుచేస్తుంది. పిడికెడు ఆత్మగౌరవం కోసం గొంతెత్తడం కూడా నేరం చేస్తుంది. న్యాయ, సామాజిక, పౌర స్పందనలలో కూడా ఆధిపత్య కుల నాలికలే పలికేలా చేస్తుంది.

కుల హింస, దోపిడీ నిత్య జీవితంలో భాగమై ఉన్నా 'ఈ కాలంలో కులమెక్కడుందండి?' అని అజ్ఞానంతోనో, అహంకారంతోనో అడిగేవాళ్ళు కొందరైతే, 'మాది ఫలానా కులం, కాని మాకు కులపట్టింపులు లేవండి' అని ఉదారవాదాన్ని చాటుకునేవాళ్ళు ఇంకొందరు. కానీ కులమనే సామాజిక తెగులు పోవాలంటే ఇప్పుడు కావాల్సింది ఉదారవాద మానవీయత కాదు. నీళ్ళు నమలని కుల వ్యతిరేకత (anti-casteism). కుల వ్యతిరేకత లేకుండా కుల నిర్మూలన జరగదు. అయితే కుల వ్యతిరేకత కేవలం ఒక వ్యక్తిగత, నైతిక విలువగా ఉంటే పెద్దగా ప్రయోజనం ఉండదు. వ్యవస్థీకృత కులాన్ని కూల్చడానికి కుల వ్యతిరేకత వ్యవస్థీకృతంగానే(systemic anti-casteism) ఉండాలి. అది సామాజిక, రాజకీయ ఉద్యమ వ్యక్తీకరణై ఉండాలి. ఆ ఉద్యమాలే కుల వ్యతిరేకులను (anti-casteists) తయారుచేస్తాయి. ఆ స్పృహ కుల పునాదులను (రాజకీయార్థిక అంశాలను) దాని వ్యక్తీకరణగా వుండే ఉపరితల అంశాలను (విద్య, సంస్కృతి, మతం, న్యాయం, విలువలు, కళలు, సాహిత్యం) ప్రశ్నిస్తుంది.

కుల వ్యతిరేకులు లేదా కుల నిర్మూలనా ఉద్యమకారులు చరిత్ర పొడవునా వున్నారు. అనేక సాహసోపేతమైన ఉద్యమాలు చేశారు, చేస్తున్నారు. అనేక సంఘాలు, వ్యక్తులు కుల నిర్మూలనా పోరాటాలు చేస్తున్నా మొత్తంగా సమాజంలో రావాల్సిన చలనం ఎందుకు రావడం లేదు? చివరికి ఏదో ఒక సంఘటన జరిగినప్పుడు వచ్చే మానవీయ స్పందనలు రోజు రోజుకు కరువవుతున్నాయి. కుల హింస సాధారణీకరింపబడుతుంది. దీనికి కారణం ఏమిటి? వాస్తవానికి ఈ ప్రశ్న ఇప్పటిది కాదు. అంబేద్కర్ కాలం నుంచీ వున్న ప్రశ్న. అంబేద్కర్ ఈ సమస్యకు రెండు రకాల కారణాలు అన్వేషించాడు. మొదటిది, graded inequality. ఒక అసమాన సమాజంలో విప్లవకర పరిస్థితుల్లో దోపిడీ వర్గాలను పీడిత వర్గాలు కూలదోసి అధికారం చేబట్టి సమ సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చు. కానీ graded inequality ఉన్న సమాజంలో పీడితులంతా ఒక వర్గంగా ఏకం కాలేరు. ఎందుకంటే వాళ్ళు కులాలుగా, ఉపకులాలుగా విడదీయబడి ఉంటారు. ఆ కులాలు, ఉపకులాలు వైరుధ్యభరితమైన జీవన విధానంతో నిచ్చెన మెట్ల మాదిరిగా నిర్మాణం అవుతాయి. ఆ నిర్మాణాలను 'సహజీకరణం' (naturalization) చేయడానికి, 'సాధికారత' కల్పించడానికి వర్ణాశ్రమ ధర్మాన్ని ఏర్పాటు చేసి దానిని హిందూ మతానికి వెన్నెముకగా చేశారు. ఇది యాదృచ్ఛికంగానో, సంఘటనాత్మకంగానో జరిగింది కాదు. ఇదంతా అగ్రవర్ణ ఆధిపత్యం కోసం కుట్రగా జరిగింది. ప్రధానంగా బ్రాహ్మణీయ ఆధిపత్య నిర్మాణం కోసం జరిగింది. అదే కొనసాగుతుంది. కాబట్టి హిందూ మతంలోకి కూరుకుపోయిన పీడిత కులాలను మూకుమ్మడిగా కదిలించడం (general mobilization of oppressed castes), వాళ్ళను ఒక్కటి చేసి బ్రాహ్మణీయ ఆధిపత్యానికి వ్యతిరేకంగా నిలబెట్టడం అంత సులభమైన పని కాదు అని అంబేద్కర్ గ్రహించాడు. అందుకే కులాన్ని నిర్మూలించకుండా భారతదేశంలో కేవలం వర్గ పోరాటాల ద్వారా సోషలిస్టు విప్లవం విజయవంతం కాదని ప్రకటించాడు. కుల నిర్మూలనే విప్లవానికి మొదటి మెట్టని భావించాడు. (అయితే ఒకటి ముందు, మరొకటి వెనుక అని కాకుండా కులానికి, వర్గానికి మధ్య వుండే గతితార్కిక సంబంధాన్ని అర్థం చేసుకున్న విప్లవ పార్టీలు తర్వాతి కాలంలో కులాన్ని విప్లవాంతర (post-revolution) సమస్యగానో లేక విప్లవం విజయవంతమైతే కులం దానికదిగా పోతుందనో భావించకుండా కులానికి ఉండే వర్గ పునాదులను, ఉపరితల

భావజాల అంశాలను ఏకకాలంలో ధ్వంసం చేయాలని నిర్ణయించుకున్నాయి. ఆ పనిని కొంతైనా తమ ఉద్యమ ప్రాంతాలలో చేయగలిగాయి).

ఇక అంబేద్కర్ వెతికిన రెండవ కారణం పీడిత కులాల దగ్గర వారి విముక్తికి కావాల్సిన ఆయుధాలు (weapons of emancipation) వారి దగ్గర లేకపోవడం. దానికితోడు తరతరాల బానిసత్వం మూలంగా ఆధిపత్య కుల, వర్గాలతో ప్రత్యక్షంగా కలబడి పోరాడే శక్తి వాళ్ళకు వాళ్ళుగా లేకపోవడం (disabled for direct action) అని భావించాడు. పీడిత కులాల చేతుల్లోకి వారిని వారు విముక్తి చేసుకునే ఆయుధాలు రావాలంటే ముందు వాళ్ళకి రాజ్యాధికారం రావాలని అనుకున్నాడు అంబేద్కర్. అయితే అంబేద్కర్ విమర్శకులు అనేదేమంటే ఒక సామాజిక విప్లవానికి కావాల్సిన ఆయుధాలు ప్రజల దగ్గర లేనప్పుడు ముందు ఆ కావాల్సిన ఆయుధాలు సమకూర్చుకోవాలి కాని ఒక్కసారిగా గరిష్టస్థాయి(maximalist) ప్రజాతంత్ర విప్లవం, రాజ్యాధికారం గురించి మాట్లాడటం ఎంత వరకు ఆచరణాత్మకమైనది అని. అంబేద్కర్ కూడా తన స్వీయ అనుభవాల ద్వారా తెలుసుకున్నదేమంటే సామాజిక విముక్తి (social emancipation) చెందని పీడిత కులాలు రాజకీయ విముక్తి పొందినా ప్రయోజనం వుండదని. అంతేకాదు, రాజకీయ విముక్తికి కూడా నిచ్చెన మెట్ల కుల వ్యవస్థ నిరంతరంగా అడ్డుపడుతూనే వుంటదని.

అందుకోసమే కుల వ్యవస్థను పెంచి పోషించే బ్రాహ్మణీయ ఆధిపత్యాన్ని, దానికి సత్తువనిచ్చే హిందూమత శాస్త్రాల సాధికారతను ధ్వంసం (destroy the authority of Shastras) చేయాలని పిలుపునిచ్చాడు. చివరికి హిందూమతం అట్టడుగు కులాలకు ఒక మరణశాసనం లాంటిదని, దానిని వదులుకోవడం ఒక్కటే మార్గమని నమ్మి సమతను, అహింసను బోధించే బౌద్ధాన్ని స్వీకరించాడు. (ఇక్కడ అహింస గురించి ఒక్క మాట చెప్పుకోవాలి. అంబేద్కర్‌కు గాంధీ మాదిరిగా అహింస ఒక విలువ కాదు. ఒక మత విధానంలో భాగం అంతకన్నా కాదు. అతనికి అది కేవలం ఒక రాజకీయ వ్యూహం మాత్రమే.) అనేక ఆటు పోట్ల మధ్య అంబేద్కర్ కుల నిర్మూలన కోసం అన్ని రకాల వ్యూహాలను, ఎత్తుగడలను ఉపయోగించాడు. తన మేధో శ్రమనంతా పీడిత కులాల విముక్తి కోసమే ధారపోశాడు. అయితే తాను చేసిన శ్రమను వాస్తవికవాద (pragmatic) దృష్టితో చూసేవాళ్ళు ఉన్నారు. ఉదారవాద అవకాశవాదంగా విమర్శించేవాళ్ళు ఉన్నారు. ఎవరి అంచనాలు ఏమైనా వాస్తవానికి అంబేద్కర్ రాజ్యాధికారం కోసం చేసిన రాజకీయ ప్రయోగం, మత మార్పిడితో కుల నిర్మూలన కోసం చేసిన ప్రయత్నం రెండూ పెద్దగా ఫలితాలను ఇవ్వలేదని చరిత్ర చెబుతుంది.

ఇప్పుడు తెలంగాణలో బహుజన రాజ్యాధికారం సాధించాలని కొత్త రాజకీయ సమీకరణాలు, కొత్త నాయకత్వం ముందుకొస్తుంది. అందులో ముఖ్యంగా మాజీ పోలీస్ అధికారి ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బహుజన సమాజ్ పార్టీలో చేరడం, నాయకత్వ బాధ్యతలను తీసుకోవడం బహుజనులలో కొత్త ఆశలను పుట్టిస్తున్నాయి. ఈ రాజకీయ సమూహాలలో "దళిత్" (oppressed, broken people) అనే పదం వాడడం కూడా సరైనది కాదు. ఎందుకంటే అది గత కాలం నాటి పీడన, హింస, అణిచివేత చిహ్నంగా ఉండి సామాజిక చైతన్యానికి ప్రతికూలంగా మారుతుందని, దాని స్థానంలో "బహుజన్" అనే పదాన్ని వాడుతున్నారు. భాషా పరమైన, భావోద్వేగమైన అభ్యంతరాలే కాకుండా బహుజన్ అనే పదం దళిత్ అనే దానికన్నా విశాలమైనదని, అది అన్ని అట్టడుగు కులాలను, మత మైనారిటీలను కలుపుకుపోయేలా చేస్తుందనే ఒక రాజకీయ ఎత్తుగడ కూడా అందులో వుంది. కానీ వాస్తవానికి దళిత్ పాంథర్స్ "దళిత్" అనే పదాన్ని కేవలం ఒక భాషా సాధనంగా చూడలేదు. వారు దళితవాదాన్ని పీడిత కులాల చారిత్రక పోరాట క్రమాన్ని, వర్తమాన ఉద్యమాలను కలుపగలిగే ఒక భౌతికవాద జ్ఞానమార్గంగా (materialistic epistemology) చూశారు. దళిత్ అనే సామాజిక కేటగిరీలో అన్ని "కింది" కులాలు, శ్రామిక వర్గాలు, ఆదివాసులు, మహిళలను కూడా కలిపి చూశారు. ఏది ఏమైనా పెట్రేగుతున్న హిందుత్వ ఫాసిజం సందర్భంలో బహుజన రాజకీయాలు బలపడటం అవసరమే. కాని అది (అంబేద్కర్ పదే పదే చెప్పినట్లు) సామాజిక వాస్తవికత (social reality) మీద ఆధారపడి జరగాలే కాని భ్రమల గూడు కట్టే విధంగా ఉండకూడదు. సనాతన ధర్మం పేరుతో హిందుత్వ, నయా ఉదారవాద రూపంలో సామ్రాజ్యవాదం సమాజంలోని అన్ని వ్యవస్థలను కైవసం చేసుకొని హింసను కొనసాగిస్తున్నాయి. ఇవి రెండూ ఒకదానికొకటి మద్దతు ఇచ్చుకుంటూ పీడిత కులాల, వర్గాల, లింగాల, ఆదివాసుల, మత మైనారిటీలపై అణిచివేతను, దోపిడీని కొనసాగిస్తున్నాయి. ఇది ఒక సామాజిక వాస్తవం. ఈ సందర్భంలో వాటికి వ్యతిరేకంగా పోరాటం చేయకుండా 'ముందు రాజ్యాధికారం రానివ్వండి. తర్వాత అన్నీ మార్చేస్తాం' అనడం వాస్తవ విరుద్ధమే అవుతుంది. ఇలాంటి మాటలు సభల్లో చప్పట్లు కొట్టిస్తుండొచ్చు. సోషల్ మీడియాలో లైకులు కురిపిస్తుండొచ్చు. కానీ ఎన్నికల్లో ఓట్ల పంట పండించవు. దేశ ఎన్నికల రాజకీయాలను పరిశీలించే ఎవరికైనా మతం, కులం, మత్తు, డబ్బు ఎలా పనిచేస్తాయో, ఎన్నికల బూటకత్వం, విలువలు లేని తనం ఏమిటో చెప్పనక్కర లేదు. అణగారిన ప్రజలను కేవలం బహుజనులు, మహాజనులు అని ఒక పెద్ద సంఖ్య కిందికి కుదించి వాళ్ళను ఓటర్లుగా చూసి మురిసిపోకుండా, నిబద్ధతతో కూడిన నిర్మాణాత్మక ఉద్యమాలు చేయడం అవసరం. ఆ ఉద్యమాలకు హిందూత్వం,

సామ్రాజ్యవాద వ్యతిరేక రాజకీయాలు లేకపోతే అవి దళిత, బహుజనులను మోసగించడానికే దారితీస్తాయి.

వీటికి తోడు నాయకుల వ్యక్తి పూజ, వారి జనరంజకవాద (populist) ప్రచార ఎత్తుగడలు దళిత బహుజన రాజకీయాలను మరింత పలుచన చేసేవిగా వున్నాయి. ఈ ధోరణులు ముఖ్యంగా ప్రవీణ్ కుమార్ తన పోలీస్ పదవికి రాజీనామా చేసి బహుజన రాజకీయ జెండాను ఎత్తుకున్న తర్వాత ఎక్కువగా కనిపిస్తున్నాయి. ప్రవీణ్‌కుమార్ సోషల్ వెల్ ఫేర్ గురుకులాల సారథిగా చేసిన కృషిని దృష్టిలో పెట్టుకొని ఆయనను 'అభినవ అంబేద్కర్' అని ఆకాశానికి ఎత్తే వాళ్ళున్నారు. ఆయన మీద ఎలాంటి విమర్శ వాలనీయకుండా అభిమాన కోట ఒకటి నిర్మితమయ్యింది. వీళ్ళకి ప్రవీణ్‌కుమార్ కుల నిర్మూలన ఉద్యమాలకు ఏమైనా చేశాడా లేదా అనేది సంబంధం లేదు. ఆయన పోలీస్ అధికారిగా ప్రజా ఉద్యమాల అణిచివేతలో ఎంత దూకుడుగా వ్యవహరించాడో, ఆయన ఇప్పుడు 'జనజీవన స్రవంతి'లోకి వచ్చి 'దొర ఏందిరో వాడి పీకుడేందిరో' అని ఎగిరెగిరి పాడుతుండు. కానీ అలాంటి పాటలతో, రాజకీయ చైతన్యంతో తెలంగాణలో దొరతనం మీద యుద్ధం చేసిన ఎందరిని 'ఎన్ కౌంటర్' పేరిట చంపడానికి బాధ్యుడయ్యిండో ఇప్పుడు ఆయనలో బహుజన మొఖాన్ని చూసే వాళ్ళకు అర్థమయ్యే అవకాశం లేదు. అర్థమయిన వాళ్ళు ఆ 'ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్' తన 'ఉద్యోగ ధర్మాన్ని' నిర్వహించాడని సుతిమెత్తగా చెబుతున్నారు. (నిజానికి పోలీసులకు "ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్" అని టైటిల్ పెట్టి 'గౌరవించడం' మన సమాజ పతనస్థితికి అద్దం పడుతుంది. దొరికిన మనుషుల్ని దొరికినట్లు చంపేవాడికి ప్రత్యేకమైన నైపుణ్యం అవసరం లేదు. కేవలం నరహంతకుడు అయివుంటే చాలు.) 'ఉద్యోగ ధర్మంలో' భాగంగా ప్రవీణ్‌కుమార్ చేసిన ఎన్ కౌంటర్ హత్యల గురించి పౌరహక్కుల సంఘాలు, ఉద్యమ సమాజమే ఈ తరానికి వివరించాలి. శంభూకుడిని చంపిన రాముడు రాజుగా చతుర్వర్ణ వ్యవస్థను కాపాడానికే తన రాజ ధర్మంలో భాగంగానే ఆ పని చేశాడని చెబితే అంగీకరిద్దామా? ఈ ప్రశ్న నేను వేస్తున్నది కాదు. స్వయంగా అంబేద్కర్ తన 'కుల నిర్మూలన' ఉపన్యాసంలో చెప్పిందే.

కాని ప్రవీణ్‌కుమార్ అభిమానులకు చరిత్రతో గానీ, వర్తమాన వాస్తవికతతో గానీ పనిలేదు. వాళ్ళకు కేవలం ఆయన గురుకులాలకు చేసిన 'సేవ' ఒక్కటే కావాలి. నిజానికి వాళ్ళు ప్రవీణ్ కుమార్ జీవితాన్ని ముక్కలు చేసి కేవలం తమకు నచ్చిన ముక్కను ఆరాధిస్తున్నారు. అతనిలో ఒక విముక్తికారున్ని(savior), రక్షకుడిని చూస్తున్నారు. వాస్తవానికి రిజర్వేషన్లు కాని, ప్రత్యేక గురుకులాలు కాని, మరే ఇతర ఉపాధి పథకాలు కాని ఒకరి దయా దాక్షిణ్యం అనుకోవడంలోనే లోపముంది. అవన్నీ కూడా అణగారిన ప్రజలు హక్కుగా పొందేవి. అవన్నీ సవర్ణ రాజ్యం తారతరాల దోపిడీకి, చేసిన నష్టానికి ఇచ్చే పరిహారం (reparation). ఆ పరిహారాన్ని చిత్తశుద్ధితో ప్రవీణ్ కుమార్ అందించి వుంటే అందుకు అభినందనీయుడే! ఎందుకంటే మన సమాజంలో తాము రాజ్యాంగబద్ధంగా చేయాల్సిన 'ఉద్యోగ ధర్మాన్ని' చేసినా గొప్పే కదా!

నిజమైన అంబేద్కర్‌వాదులు ఈ గురుకులాల విషయంలో సౌకర్యాలు, ఫలితాలు కాకుండా ఇంకో అడుగు ముందుకేసి లోతైన ఆలోచన చేస్తారు. అసలు అంబేద్కర్ విద్య గురించి ఏమన్నాడో, ఎలాంటి విద్య అందరికి అందాలని కోరుకున్నాడో, పిల్లలు ఎలాంటి మానసిక వికాసం చెందాలని బావించాడో ఆలోచిస్తారు. అంబేద్కర్ పిల్లలకు విద్య వారి సామాజిక, సాంస్కృతిక ఆవరణలో జరగాలని కోరుకున్నాడు. ఎందుకంటే పిల్లలను తమ మనుషుల నుండి, తాము ఎరిగిన భౌతిక, సామాజిక వాతావరణం నుండి దూరం చేసి సార్వజనీయత, ఆధునికత పేరిట కొత్త విలువలను, కొత్త అలవాట్లను వాళ్ళ మీద రుద్దడం మూలంగా వారి నుండి వారే పరాయీకరణ చెందుతారు. నా స్వీయానుభవంలో ఆరేండ్ల నా గురుకుల బాల్యం కూడా ఇదే విషయాన్ని రిజిస్టర్ చేసింది. అమెరికా, కెనడాలో ఆదివాసీ పిల్లలను రెసిడెన్షియల్ విద్యా విధానంలోకి నెట్టడం మూలంగా వాళ్ళు మానసికంగా ఎట్లా కుంగిపోయారో, ఎట్లా ఆత్మన్యూనతకు గురయ్యారో, తమ మూలాల నుండి ఎట్లా దూరమయ్యారో అనేక ఉదంతాలు, పరిశోధనలు వున్నాయి. విద్య అనగానే ఒక పరిమిత నిర్వచనానికి, విజయం అనగానే మార్కెట్ నిర్దేశించే ప్రమాణాలకు కుదించి చూడడం అలవాటయ్యింది. అందుకే మనం ఇంకా గురుకులాలను మించి ఆలోచించడం లేదు. అన్నింటినిమించి బహుజనులు అనే ఒక పెద్ద సామాజిక కేటగిరీలో ఇంకా నిచ్చెన మెట్లు పదిలంగానే ఉన్నాయి. అంతరాలు పెరుగుతున్నాయి. జెండర్‌కు సంబంధించిన ప్రశ్నలు వస్తున్నాయి. కాబట్టి (మిత్ర, శత్రు) వైరుధ్యాలు ఉన్న పెద్ద సమూహంలో విమర్శలు సహజం. విమర్శ రాగానే మనోభావాలకు అగ్గి పెట్టుకొని ఊరు, వాడ తగలబెడితే సమస్య పరిష్కారం కాదు. ఇప్పుడు దేశం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య హిందూత్వ ఫాసిజం (అందులో ప్రధాన భాగమైన కుల వ్యవస్థ) దీనితో మిలాఖత్ అయ్యి బలపడుతున్న సామ్రాజ్యవాదం. ఈ రెండింటిని కనీసం సూత్రబద్ధంగానైనా ఎదిరించకుండా, వాటిని ఎదిరించే శక్తులతో కలిసి నడవకుండా 'నేను అందరి వాడిని' అని అమాయకంగా నటిస్తే అంబేద్కర్ ఆశయాలకు తూట్లు పొడిచినట్లే. బహుజనవాదానికి నష్టం చేసినట్లే. అందుకే బహుజన వాదాన్ని భ్రమల్లో బంధీ కాకుండా చూద్దాం. ప్రశ్నలు నాటి, ప్రజాస్వామ్య సంస్కృతిని చిగురింపజేద్దాం. ❑

**(కొలిమి సౌజన్యంతో)**

# రాజ్యాంగ లక్ష్యాలపై దాడి..



కెఎస్ లక్ష్మణరావు,
శాసనమండలి సభ్యులు

**జాతీయోద్యమంలో పాల్గొనని ఆర్.ఎస్.ఎస్. రాజకీయ రూపమైన భారతీయ జనతా పార్టీ నరేంద్రమోడీ నాయకత్వంలో గత ఎనిమిదేళ్లుగా అధికారంలో ఉండి ప్రస్తుతం జాతీయోద్యమ, రాజ్యాంగ లక్ష్యాలకు విఘాతం కలిగిస్తూ భారత దేశ భిన్నత్వానికి, బహుళత్వానికి ప్రమాదం కలిగించే విధంగా ప్రయత్నాలు చేస్తున్నది. దేశ సమగ్రతను, రాజ్యాంగాన్ని కాపాడుకోవలసిన బాధ్యత పౌర సమాజం, మేధావులు, విద్యావంతులు, లౌకికవాదులు, అభ్యుదయ వాదులు, వామపక్ష వాదులపై పడింది.**

మహోన్నతమైన, మహోజ్వలమైన పోరాటం. వివిధ జాతులు, మతాలు, కులాలు, ప్రాంతాలు, సంస్కృతులు, జీవన విధానాలకు చెందిన ప్రజలు పోరాటంలో పాల్గొన్నారు. జాతీయ కాంగ్రెస్‌తోపాటు, విప్లవకారులు, కార్మిక ఉద్యమాలు, కమ్యూనిస్టులు, రైతాంగ ఉద్యమాలు, సంఘ సంస్కరణోద్యమాలు ఆ మహత్తర పోరాటంలో పాల్గొన్నాయి. అనేకమంది ప్రాణ త్యాగాలు చేశారు. వేలాది మంది ఉరి తీయబడ్డారు. కాల్చి చంపబడ్డారు. ఇప్పుడు 75 ఏళ్ల స్వాతంత్ర్య ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్నాయి. స్వాతంత్ర్యోద్యమం ఆశించిన లక్ష్యాలు సాధించామా? లేదా? రాజ్యాంగ లక్ష్యాలు, ఆశయాలు, ఆదర్శాలు ఏమిటి ? రాజ్యాంగ స్వాతంత్ర్యాన్ని సాధించిన మనం ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాలు సాధించామా? ఇవన్నీ సమీక్షించుకోవలసిన సమయం ఇది. ఇలాంటి పరిస్థితికి భిన్నంగా స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనని వారు 'అమృతోత్సవాలు' అంటూ జరపడం హాస్యాస్పదం. ఈ నేపథ్యంలో ప్రత్యేక కథనం..

### రాజ్యాంగ లక్ష్యాలపై దాడి

అరవై దేశాల రాజ్యాంగాలను తులనాత్మక అధ్యయనం చేసి డాక్టర్ అంబేద్కర్ నాయకత్వంలో ఉన్నతమైన రాజ్యాంగాన్ని రూపొందించారు. రాజ్యాంగ పీఠికలు, రాజ్యాంగ ఆశయాలు, లక్ష్యాలు వివరించారు. సమాఖ్య విధానం (ఫెడరిలిజం), లౌకిక విధానం, పార్లమెంటరీ ప్రజాస్వామ్యం, భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆర్థిక-సామాజిక న్యాయం, మొదలైన అంశాలను రాజ్యాంగ లక్ష్యాలుగా పేర్కొన్నారు. కేరళ ప్రభుత్వం తీసుకొచ్చిన భూసంస్కరణలకు వ్యతిరేకంగా కేశవానంద భారతి వేసిన కేసులో




1973లో సుప్రీంకోర్టుపై అంశాలను రాజ్యాంగ ఆశయాలుగా పేర్కొన్నది.

### సమాఖ్య విధానానికి విఘాతం..

నరేంద్ర మోడీ ప్రభుత్వం భారత సమాఖ్యను (ఫెడరిలిజం) దెబ్బతీయటానికి ప్రయత్నిస్తున్నది. జిఎస్‌టి ప్రవేశపెట్టి, రాష్ట్రాల ఆర్థిక వనరులు దెబ్బతీసినది. రాష్ట్రాలకు దాదాపు మూడు లక్షలకోట్ల రూపాయలు చెల్లించాలి. మూడు వ్యవసాయ చట్టాలు కేంద్రం చేయటం రాష్ట్రాల హక్కులు హరించటమే. రాష్ట్రాలతో సంప్రదించకుండానే ఎన్ఇపి-2020 (నూతన విద్యావిధానం) ప్రకటించింది. ఆర్థిక సంఘం సిఫార్సులను సక్రమంగా అమలు చేయటం లేదు. నీతి ఆయోగ్‌కు ఎటువంటి చట్టబద్ధత లేదు. దాని ద్వారా రాష్ట్రాలపై కేంద్రం స్వారీ చేస్తున్నది. రాష్ట్రాలలో ప్రభుత్వాలను రకరకాల కుట్రలతో కూల్చివేస్తున్నది. తమకు నచ్చని రాష్ట్ర ప్రభుత్వాలకు నిధులు సక్రమంగా కేటాయించటం లేదు. భారత సమాఖ్య దెబ్బతింటే దేశ సమగ్రత ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుంది.

### ప్రమాదంలో లౌకికవాదం..

భారతదేశ సమగ్రత, ప్రజాస్వామ్య భద్రత లౌకికవాదంతో ముడిపడి ఉన్నది. రాజ్యాంగం మనదేశాన్ని లౌకిక రాజ్యంగా పేర్కొన్నది. అయితే హిందూ-ముస్లింల మధ్య అగాధాన్ని సృష్టించి, మెజారిటీ హిందూ మత పార్టీగా ఉండాలని బిజెపి అనేక ప్రయత్నాలు చేస్తున్నది. జమ్ముకాశ్మీర్ 370వ ఆర్టికల్

రద్దు చేసింది. మైనారిటీలపై, దళితులపై దాడులు చేస్తూ మతపరమైన విభజన సృష్టిస్తున్నాయి. సిఎఎ వంటి చట్టాల ద్వారా మత ఆధారిత పౌరసత్వం కోసం పావులు కదుపుతున్నాయి. పాఠ్యపుస్తకాలను, సిలబస్‌ను మత ఆధారిత అంశాలుగా మారుస్తున్నారు. మత సామరస్యాన్ని దెబ్బతీసి లౌకికవాదం బలహీనపడే విధంగా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం బాహాటంగా ప్రయత్నాలు చేస్తోంది. మతపరమైన విభజన లౌకిక వాదానికి, దేశ సమగ్రతకు నష్టదాయకం.

### భావ ప్రకటనా స్వేచ్ఛ..

రాజ్యాంగం ప్రాథమికహక్కుల ద్వారా ప్రజలకు భావ ప్రకటనా స్వేచ్ఛ కల్పించింది. సంఘాలను ఏర్పాటు చేసుకోవటానికి ఉద్యమాలకు అవకాశం కల్పించింది. కానీ ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిరంకుశ విధానాల ద్వారా భావ ప్రకటనా స్వేచ్ఛ లేకుండా చేస్తుంది. భిన్న ఆలోచనలు కలిగిన గౌరీ లంకేష్, దబోల్కర్, కల్బుర్గి, గోవింద్ పన్సారీ వంటి మేధావులను హతమార్చారు. భిన్నాభిప్రాయాలను సహించలేని పరిస్థితులు, అసహన పరిస్థితులు దేశంలో ఏర్పడ్డాయి.

### ఏమి చేయాలి ?

డెబ్భై ఐదేళ్ల స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా ప్రజలు, పౌర సమాజం, దేశ సమగ్రతను, స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి ప్రతిజ్ఞ పూనాలి. ప్రస్తుత మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక, సామాజిక విధానాలను వ్యతిరేకించాలి. మతతత్వ శక్తుల నుండి దేశాన్ని సంరక్షించుకోవడానికి సిద్ధపడాలి. జాతీయోద్యమ నాయకులు, విప్లవకారులు ఆశించిన ఆర్థిక, సామాజిక స్వాతంత్ర్యాన్ని సాధించుకోవడానికి పౌర సమాజం పూనుకోవాలి.

### చరిత్రను చెరిపేయడమే !

19వ, 20వ శతాబ్ధాల గొప్ప సామాజిక-రాజకీయ సంస్కర్తలు తమ పూర్వీకులని, లేదా వారి వారసులమని తమని తాము చిత్రీకరించుకోవాలనీ ప్రయత్నిస్తున్నారు. అలా వారు అంచెలంచెలుగా గాంధీజీ, భగత్‌సింగ్, చంద్రశేఖర్ అజాద్ తదితర జాతీయ విప్లవకారులు, సుభాష్ చంద్రబోస్, బాలగంగాధర్ తిలక్, సర్దార్ పటేల్, స్వామీ వివేకానంద, బంకించటర్జీ, బిపిన్ పాల్, అరవింద ఘోష్ తదితరుల వారసులుగా, అనుయాయులుగా చెప్పుకోవడానికీ ప్రయత్నించారు. కానీ వారు విఫలమయ్యారు. ఇంతకుముందే చెప్పినట్లు, జాతీయోద్యమ నాయకులు దాదాభాయి నౌరోజీ నుంచి గాంధీజీ వరకు అనేక విషయాల్లో పరస్పరం విభేదించుకున్నారు. సామాజిక-ఆర్థిక కార్యక్రమాలు, విధానాల మీదో లేదా వలసవాదంపై ఎలా పోరాడాలి లేక అహింస పాత్ర ఏమిటి..? సాయుధ పోరాటమా, రాజ్యాంగబద్ధ పద్ధతులే అనుసరణీయమా? వంటి అంశాల మీదో వారి మధ్య భిన్నాభిప్రాయాలు ఉండేవి. అయినప్పటికీ వలసవాదం, మతతత్వం, కులతత్వాల వ్యతిరేక పోరాటం వారందరి ఉమ్మడి లక్ష్యంగా ఉండేది. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు, లౌకికవాదం, స్వతంత్ర ఆర్థికాభివృద్ధి, పేదల అనుకూలత అంశాలపై వారందరి నడుమ మౌలికంగా ఏకాభిప్రాయం వ్యక్తమయ్యేది. ఈ విలువల విషయంలో వారెప్పుడూ రాజీపడలేదు. పరమత ప్రజల మీద విద్వేషం రగిల్చినంత కాలం, వలసపాలనను వ్యతిరేకించినంత కాలం.. ఆఖరుకు సరళ మతతత్వవాదులను సైతం తమతో కలుపుకుపోయారు. ఎప్పుడైతే మతాల మధ్య చిచ్చుపెట్టారో అప్పుడు అంటే 1937 తర్వాత మతతత్వవాదులను జాతీయోద్యమ పదవుల నుంచి బహిష్కరించారు. నిజమైన జాతీయ నాయకులను తమ స్వంతం చేసుకునే పనిలో విఫలం కావడంతో.. ఆర్ఎస్ఎస్, బిజెపీలు ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం మీద, అధికారిక మీడియా మీద, ఎన్‌సీఈఆర్‌టీ మీద, పాఠ్యపుస్తకాల మీద తమ అధికారాన్ని వినియోగిస్తూ సావర్కర్, హేడ్గేవార్ వంటి వారిని గొప్ప జాతీయతావాద నాయకులుగా చెలామణి చేయాలని ప్రయత్నిస్తోంది.

### ఆర్థిక, సామాజిక న్యాయం..

రాజ్యాంగ నిర్మాతలు ఆశించిన ఆర్థిక, సామాజిక న్యాయాన్ని ప్రస్తుత పాలకులు పూర్తిగా విస్మరించారు. ఆర్థిక సంస్కరణల వేగాన్ని పెంచి, లాభాలతో నడిచే పరిశ్రమలను సైతం ప్రైవేటీకరిస్తున్నారు. ఎల్ఐసి, విశాఖ ఉక్కు వంటి సంస్థలను ప్రైవేటీకరించటానికి పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయి. మానిటైజేషన్ పేరుతో మౌలిక రంగాలను అమ్మివేయటానికి ప్రభుత్వం సిద్ధపడుతున్నది. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పేద ప్రజలకు, రైతులకు, అసంఘటితరంగ కార్మికులకు, సామాజిక వర్గాలకు నష్టదాయకం.

### తెలుగుజాతికి నమ్మకద్రోహం !

ఒకే భాష, ఒకే సంస్కృతి, ఒకే మార్కెట్, ఒకే పన్ను, ఒకే విద్యా విధానం, ఒకే ఆహారపుటలవాట్లు – ఇలా పైకి ఆకర్షణీయంగా కనిపించే నినాదాలతో హిందూత్వ – బిజెపి ప్రభుత్వం మన దేశంలోని వివిధ జాతుల, భాషల, సంస్కృతుల మధ్య ఉన్న వైవిధ్యాన్ని కాలరాయజూస్తున్నది. మనువాదాన్నే మన దేశ జీవన విధానంగా రుద్దడానికి ప్రయత్నిస్తున్నది. భిన్న మతాల నడుమ ఉన్న సామరస్యాన్ని నాశనం చేస్తున్నది. రాష్ట్రాల స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసి, అధికారాలన్నీ తన గుప్పెట్లో బిగించుకుంటున్నది. ప్రత్యేకించి మన తెలుగు రాష్ట్రాన్ని ముక్కలు చెయ్యడంలో కీలక భూమిక పోషించింది. దానిని సమర్థించుకోడానికి 'ప్రత్యేక హోదా' ఆశ చూపింది. తర్వాత మొండిచెయ్యి చూపించింది. రాజధాని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి నిధులు, విభజన హామీలు, పోలవరం పునరావాసం, కడప ఉక్కు, రైల్వే జోన్ – ఇలా అన్ని విషయాల్లోనూ నమ్మించి,

మోసం చేసింది. తాజాగా విశాఖ ఉక్కును అమ్మి తీరుతానని అడ్డగోలుగా ప్రకటించింది. తెలుగువాడి ఆత్మగౌరవాన్ని సవాలు చేస్తోంది బిజెపి ఏకపక్ష పెత్తందారీ పాలన. అందుకే తెలుగు 'వాడితనాన్ని' ఢిల్లీ పాలకులకు రుచి చూపించాల్సిన సమయం ఆసన్నమైంది.

**ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తున్న హిందూత్వ..**

కేవలం రైతులే కాదు, దేశంలో మెజారిటీగా ఉన్న యువత స్థబ్దత నుండి, రాజకీయ రాహిత్యం నుండి, పాలకవర్గ ప్రచార ప్రభావం నుండి బయటపడాలి. అందులో నుండి ఉద్యమాల బాట పట్టాలంటే వారిలో ఆత్మవిశ్వాసం పాదుకొల్పాల్సిన అవసరం చాలా ఉంది. హిందూత్వ శక్తులు ఎక్కిస్తున్న జాతీయతా భావం నిజానికి దేశంలోని వివిధ జాతుల, మతాల, ప్రాంతాల ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరుస్తుంది. భిన్న భాషలను, భిన్న సంస్కృతులను బేఖాతరు చేస్తుంది. చివరికి ఏ తిండి తినాలో, ఏవిధంగా దుస్తులు ధరించాలో, ఏ సినిమా చూడాలో, ఎవరిని పెళ్ళాడాలో కూడా శాసిస్తుంది. దీనికి తలొగ్గడం అంటే మన యువత తమ ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడమే. హిందూత్వ గురించి గొప్పగా చెప్పుకుంటూ మరోవైపు దేశాన్ని అమెరికన్ సామ్రాజ్యవాదులకు అప్పజెప్తున్న బిజెపి-ఆరెస్సెస్ ద్రోహాన్ని ఇటువంటి ఆత్మగౌరవ ఉద్యమమే బయటపెట్టగలదు. అందుకే నాడు స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పోరాడిన అమరవీరులు మనకు స్ఫూర్తి కావాలి.

**సంస్కృతులు.. సమానత్వం**

సంస్కృతుల మధ్య సమానత్వం, పరస్పర గౌరవం ఉండాలి. ఒకటి ఎక్కువ మరొకటి తక్కువా కాదు. దేని ప్రత్యేకత దానిది. దేని విశిష్టత దానిది. కానీ, మన సమాజంలో అంతర్లీనంగానూ, బాహాటంగానూ ఒక లక్షణం ఉంటుంది. ఆధిపత్య సంస్కృతులు, అలవాట్లు.. ఆడంబరంగా, అట్టహాసంగా ప్రదర్శితమవుతాయి. వాటికి సహజంగా లేని 'ఉన్నతతత్వాన్ని' ఆపాదించుకొని- గొప్పవిగా ప్రాచుర్యం పొందుతాయి. అది గొప్ప అనుకునే వాళ్లు క్రమంగా దానిని అనుసరించటం, అనుకరించటం మొదలెడతారు. ఆ విధంగా ఆధిపత్య సంస్కృతి అన్నింటా నెమ్మది నెమ్మదిగా చొచ్చుకొస్తుంది. స్థానిక సంస్కృతి అంతే నెమ్మదిగా ప్రాముఖ్యాన్ని కోల్పోతూ ఉంటుంది. ముఖ్యంగా వేషభాషల్లో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. స్వల్ప స్థాయీ చలనంతో సహజంగా జరిగే మార్పును మనం కాదనలేం. కానీ, అది బలవంతంగానో, మార్కెట్టు శక్తుల ప్రమేయంతోనో జరిగితే-అభ్యంతరకరం. తాము చెప్పింది తప్ప మరేదీ సంస్కృతి కాదని ఎవరన్నా విర్రవీగితే- అది ప్రమాదకరం. ఒక ప్రాంత సంస్కృతిని మరో ప్రాంత సంస్కృతితో తూకమేసి, సరిచేయాలను కోవటం అరాచకవాదం. ఇక్కడే మనం గురజాడ మాటలను గుర్తుచేసుకోవాలి. 'దేశమంటే మట్టి కాదోయ్. దేశమంటే మనుషులోయ్' అన్న ప్రబోధాన్ని పాటించాలి. ఎప్పుడైనా సరే మనుషులు, వారి అభీష్టాలు ప్రధానం. తంతులూ తతంగాలూ, ప్రాంతాలూ, ప్రదేశాలూ తరువాత. కనిపించే సాటి మనుషుల కన్నా కనపడని నమ్మకాలూ, కాల్పనిక కథలూ ఎప్పుడూ ఎక్కువ కావు. పైగా, నమ్మకాలు అనేకమైనా.. ఎల్లప్పుడూ ఒకేలా ఉండ వు.. అన్నిచోట్లా ఒకే విలువతో చెలామణి కావు. ఆంధ్రా బ్రహ్మ ణులు సహజంగా చేపలను తినరు. అది మాంసాహారం. ఒడిశా, బెంగాలు బ్రాహ్మణులకు అవి ప్రియమైన శాఖాహారం. ఇక్కడ ఎవరి అలవాటు ప్రామాణికం? ఎవరి ఆచరణ అనుసరణీయం? అసలు ఈ ప్రశ్నలే అసంబద్ధం. ఎవరి అలవాటు వారిది. ఒకరి ఆహారపు అలవాటును మరొకరి ఆహా రపు అలవాటుతో కొలత వేయటం - మన దేశ భిన్నత్వాన్ని అవమానించటమే! చాలామంది మేక మాంసం, కోడి మాంసం తిన్నట్టే - కొంత మంది గొడ్డుమాంసం తింటారు. కాదనే హక్కు ఎవరికీ ఉండదు. కానీ, కొన్నేళ్లుగా ఇదొక సమస్యగా మారింది. ఇంట్లో గొడ్డు మాంసం ఉందనే పేరిట మనుషులనే చంపేసే ఉన్మాదమూకల స్వైర విహారం సాగుతోంది. పాలకులు ఇలాంటి దుశ్చర్యలను అరికట్టకపోగా, నిందితులను అభినందించటం అప్రజాస్వామికం.

**దేశభక్తి పేరిట అరాచకం..**

చిత్రం ఏమిటంటే- చేసే వ్యాఖ్యలూ వ్యవహారాలూ, దాడులూ దౌర్జన్యాలూ 'దేశభక్తి' పేరుతో జరుగుతున్నాయి. దేశాన్ని రక్షించే పేరుతో నడుస్తున్నాయి. ఆవులకు ఒక ప్రత్యేకతా, పవిత్రతా ఆపాదించి మనుషులపై దాడులు, హత్యలూ జరుగుతున్నాయి. దేశభక్తి గురించి మాట్లాడుతూ భిన్నాభిప్రాయంపై దాడులూ దౌర్జన్యాలూ. మహిళల గొప్పతనం గురించి కీర్తిస్తూ.. కథలు కల్పిస్తూ.. స్త్రీలపై, వారి ప్రాథమిక హక్కులపై దాడులూ, అత్యాచారాలూ. వాళ్లకు రాజ్యాంగం కన్నా మనుస్మృతి ఎక్కువ. ఆధునిక సమాజపు ఆకాంక్షల కన్నా ఆటవిక యుగపు దౌర్జన్యాలపై మక్కువ. వారిది దేశాన్ని మనుషులతో చూడలేని అంధత్వం. దేశమంటే దేవాలయాలు, విగ్రహాలు, చరిత్రను రూపుమాపే కట్టడాలు.. వీరిది సారం లేని చరిత్రలూ అనుకొనే తత్వం. దేశాన్ని మనుషులుగా చూసి, వారి సమస్యలను పరిష్కరించాల్సింది పోయి.. వారిని కులాలుగా, మతాలుగా విడగొట్టే.. భావోద్వేగాలను రెచ్చగొట్టే కుతంత్రం! ఇలాంటి విధ్వంసం జరుగుతున్నప్పుడు స్వాతంత్ర్యానికి అర్థం ఏముంది? కులమతాలకు అతీతంగా పౌరుడిని పౌరుడిగా గుర్తించాలన్న రాజ్యాంగం స్ఫూర్తి ఏంటి? మూకస్వామ్యపు ఉన్మాదం ఆ స్ఫూర్తికి బహిరంగంగానే తూట్లు పొడుస్తోంది. మనమిప్పుడు స్వాతంత్ర్యాన్ని, ప్రజాస్వామ్యాన్ని, చివరకు రాజ్యాంగాన్నీ కాపాడుకోవాల్సిన స్థితిలో ఉన్నాం. మాట్లాడే హక్కుని, పోరాడే హక్కుని మనమే రక్షించుకోవాలి. ❑

# భారత జర్నలిజంలో చీకటి యుగం



(హిందీ నుంచి ఇంగ్లిష్ : రక్షా కుమార్,
ఇంగ్లిష్ నుంచి తెలుగు: ఎన్.వేణుగోపాల్)

రవీష్ కుమార్

**రవీష్ కుమార్ అత్యంత గౌరవనీయమైన భారత జర్నలిస్టు. ఆయన 1996లో ఎన్‌డి టి.వి.లో చేరి, రవీష్ కీ రిపోర్ట్, దేశ్ కీ బాత్, ప్రైమ్ టైమ్ విత్ రవీష్ వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఆసియాలోకెల్లా సంపన్నుడూ, భారత ప్రధాని నరేంద్ర మోడీకి సన్నిహితుడూ అయిన గౌతమ్ అదానీ ఎన్‌డి టివిని కొనివేయబోతున్నాడనే వార్త వెలువడిన కొద్ది గంటల్లోనే రవీష్ కుమార్ తాను ఎన్‌డి టి.వి.కి రాజీనామా చేస్తున్నానని తన యూట్యూబ్ చానల్ మీద ప్రకటించారు. ఆ రాజీనామా సందర్భంగా 2022 డిసెంబర్ 1న ఆయన ఇచ్చిన ఉపన్యాస పాఠానికి అనువాదం.**

భారత జర్నలిజంలో స్వర్ణయుగం అనబడేదేదీ లేదు. కాని పరిస్థితి ఇవాళ ఉన్నంత ఘోరంగా మరెప్పుడూ లేదు. జర్నలిజం లోని ప్రతి ఒక్క మంచి అంశాన్నీ వేగంగా ధ్వంసం చేస్తున్నారు. ఇది ఊహించినదే. కాని, ఇవాళ వాస్తవంగా నడుస్తున్నది జర్న లిజంలో 'చీకటి యుగం'. దేశంలో లెక్కలేనన్ని వార్తా చానళ్లు ఉన్నాయి. కాని అన్నిటికన్నీ నీతి తప్పి ఉన్నాయి. మన ప్రచార మాధ్యమాల పర్యావరణమే కుప్పకూలిపోయి, ధ్వంసమై ఉన్నది. ఇవాళ ప్రతి ఒక్కరూ తనను తాను జర్నలిస్టుననే చెప్పు కుంటున్నారు. మరీ ముఖ్యంగా అధికార బలం ఉన్న వారికి సన్నిహితంగా ఉన్నవారు, లేదా వారితో ఉన్నవారు. ఈ దేశంలో జర్నలిజం అణగిపోవడానికి అసలైన కారణం ఈ జర్నలిస్టుల ముఖాలూ, వారి సంస్థలూ కావడం ఒక వైచిత్రి. వాళ్లు తామే మంచి జర్నలిజాన్ని తెస్తున్నామని చెప్పుకుంటున్నారు. వారిని జాగ్రత్తగా, అనుమానంగా ఉండమని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రశ్నలే లేని ఈ జర్నలిస్టులూ, చివరికి ప్రభుత్వమూ జర్నలిజం గురించి వారి నిర్వచనాన్నే మీ గొంతుల్లోకి తోయడానికి ప్రయత్నిస్తున్నారు.

**ఎన్‌డి టి.వి.తో నా జ్ఞాపకాలు**

ఈ దశలో నేను ఇంత కాలమూ పనిచేసిన సంస్థ గురించి మాట్లాడదలచుకోలేదు. ఎందుకంటే భావోద్వేగంతో ఉన్నప్పుడు వస్తుగతంగా ఉండడం సాధ్యం కాదు. వాస్తవాల మీద భావోద్వేగాలదే పైచేయి అవుతుంది. కనుక భావోద్వేగాలను పక్కన పెడదాం. ఎన్.డి.టి.వి.తో నాకు ఆసక్తికరమైన జ్ఞాపకాలెన్నో ఉన్నాయి. ఎవరో ఒక వ్యక్తికి కృతజ్ఞతలు చెప్పడం చాలా కష్టం. మీ వృత్తిపరమైన ప్రయాణానికి ఎందరెందరో దోహదం చేసినప్పుడు, ఎవరో ఒకరికే కృతజ్ఞతలు ఎలా చెప్పగలరు? గతంలో పనిచేసిన, ప్రస్తుతం పనిచేస్తున్న సహోద్యోగులు ఎంతో మంది తమలోని ఒక భాగాన్ని నాలో చూస్తారని నాకు తెలుసు. అది సరైనదే కూడ. నేను ప్రతి ఒక్కరి నుంచీ ఎంతో కొంత తీసుకున్నాను. అందుకు కృతజ్ఞుణ్ని. పెళ్లికూతురు పుట్టింటి నుంచి వెళ్లిపోయేటప్పుడు ఆ కన్న ఇంటి కోసం విలపిస్తుంది. మరొక ఇంటికి వెళ్లిపోయాక కూడ కన్న ఇంటిని గుర్తు చేసుకుంటుంది. ఇవాళ నేను ఆ పెళ్లికూతురిలా ఉన్నాను. బహుశా అటువంటి అనుభూతిలో మునిగిపోయే క్షణం ఇది. భవిష్యత్తులో ఎప్పుడైనా అటువంటి భావోద్వేగం లేని సమతాస్థితిలో ఎన్‌డి టి.వి. గురించి మాట్లాడతాను. ఒక టివిని నిర్మించేది బృందాలే అని ఎన్‌డి టి.వి. నాకు నేర్పింది. యాంకర్లకు ప్రాధాన్యత పెరిగిపోయి వాళ్లు స్టార్లుగా మారాక, ఈ భావన కొంత దెబ్బతిన్నది. అయినా, మీ బృందం ఎంత మంచిదైతే మీ పని అంత మంచిదవుతుందని ఇవాళ కూడ నేను నమ్ముతున్నాను. ఎన్‌డి టి.విలో అనువాదకుడిగా లాంఛనంగా 1996 ఆగస్ట్‌లో చేరాను. కాని అంతకు ముందు కూడ, ఎన్‌డి టి.వి.లో వీక్షకులు రాసిన చేతి రాత ఉత్తరాలు చదివే పని చేసేవాణ్ని. ఆ ఉత్తరాలు వేరు వేరు కార్యక్రమాల మీద ఆయా యాంకర్లను ఉద్దేశించి ఉండేవి. ఆ ఉత్తరాలు చదువుతున్నప్పుడే దేశంలో టివి వీక్షకులు ఎలా తయారవుతున్నారో నాకు తెలిసింది. ఆ ఉత్తరాలు చదివి, వాటి ఆధారంగా నివేదికలు తయారుచేసి ఆయా కార్యక్రమాల నిర్మాతలకు ఇవ్వడం నా పని. అప్పుడు నేను ఒకరోజు కూలీని. నాకు అట్లాగే లెక్కకట్టి డబ్బులు ఇచ్చేవారు.

**వీక్షకుల పట్ల నిజాయితీగా ఉండడం**

నేను ఇప్పటికీ అటువంటి పనే చేస్తున్నాననుకుంటాను. ఇవాళ కూడ, వేలాది మంది నాకు రాస్తుంటారు. ఇప్పటికీ మీలో కొందరి నుంచి చేతిరాత ఉత్తరాలే అందుకుంటాను. వాటిలో చాలా ఉత్తరాలను నేను చదువుతాను. వీలైనన్ని ఎక్కువ ఉత్తరాలకు జవాబిస్తాను. మీ ముందర నన్ను నేను బహిరంగ పరచుకుంటాను. మీ గురించి నేనేమనుకుంటానో నిజాయితీగా చెప్పదలచాను. నేను నా ఆలోచనలను కత్తిరించుకుంటే, అది మీ పట్ల నిజాయితీగా లేకపోవడం అవుతుంది. ఒక రకంగా

నేను పూర్తిచక్రం తిరిగి వచ్చాననుకుంటాను. వీక్షకుల అభిప్రాయాల ఉత్తరాలు ఒకప్పుడు చదువుతుండేవాణ్ని, ఇప్పుడూ చదువుతున్నాను. మీ అందరి సలహాలు, ప్రతిస్పందనలు, ఆశలు, విమర్శలు, అప్పుడప్పుడు నిందలు మధ్యనే నా జీవితమంతా సాగింది. అదే నన్ను మీకు చాలా దగ్గర చేసింది. నేను మీ మధ్య ఉన్నప్పుడు, నిజంగా నేను నా కోసం జీవించలేదు. ఇప్పుడు, నాకు అందుకు సమయం దొరుకుతుందని నా ఆశ. ఎవరో లాగేసినందు వల్ల గూడు కోల్పోయిన పక్షి లాగుంది నా పరిస్థితి. కాని పక్షికి ఇప్పుడింకా ఎగరడానికి విశాల ఆకాశం ఉంది. నేను విలేఖరులు రాసిన నివేదికలనూ కథనాలనూ ఇంగ్లిష్ నుంచి హిందీలోకి అనువాదం చేస్తుండేవాణ్ని. ఆ తర్వాత నేనే విలేఖరినయ్యాను. రవీష్ కీ రిపోర్ట్ అనే అనుదిన కార్యక్రమ నిర్మాతనయ్యాను. ఉత్తరాలు చదివే పనిలో చేరిన మనిషి గ్రూప్ ఎడిటర్ అయ్యాడు. అది కేవలం ఎన్‌డి టి.వి.లోనే సాధ్యం. ఇవాళ ఆ మనిషి తన రాజీనామా సమర్పిస్తున్నాడు. ఈ సంస్థ వెనుక దారాలు లాగే శక్తిమంతమైన మనుషులెందరో ఉన్నారు. అందువల్ల ఇటువంటి రోజొకటి వస్తుందనేది నిశ్చయమే. కాని ఇప్పుడు ఆ రోజు వచ్చేసరికి, అది విచారకరంగా అనిపిస్తున్నది. నన్ను అంచనా కట్టేటప్పుడు, చాలా కింది స్థాయిలో ప్రారంభించానని నా మీద జాలిపడరనే ఆశిస్తాను. చాలా కింది స్థాయిలో ప్రారంభించామని చెప్పి సానుభూతి సంపాదించేవాణ్ని కాను నేను. అటువంటివాళ్లు తాను ఎట్లా ఒక చిన్న చాయ్ దుకాణంలో బాల్యం గడిపానో అని హఠాత్తుగా చెపుతుంటారు. అదే సమయంలో అత్యంత ఖరీదైన విమానాల్లో ప్రయాణిస్తుంటారు. నా జీవన ప్రయాణం ఏదో అసాధారణమైనదని నేను అనుకోను. ఈ దేశంలో ప్రతి ఒక్కరిదీ కష్టభరితమైన జీవితమే. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌లో ఉన్న రోగుల కుటుంబాలతో మాట్లాడి చూడండి. వాళ్లు ఎన్నెన్ని కొండగుట్టలు ఎక్కి అక్కడికి చేరారో ఊహించడం సాధ్యం కాదు. వాళ్లతో పోలిస్తే మన కష్టాలు పిపీలికాలు.

## 'నేను మీ కోసం పనిచెయ్యడానికి ప్రయత్నించాను'

ఇవాళ నేను మీతో టివి వీక్షకుల గురించి మాట్లాడదలచాను. వ్యవస్థలూ నిర్మాణాలూ పడిపోవడమూ, సమాజాలను విద్వేష కెరటాలు ముంచెత్తడమూ ఇటీవల మనందరమూ చూస్తున్నాం. కాని ఒక కొత్త వ్యవస్థ రూపు దిద్దుకోవడం నేను కళ్లారా చూశాను. ఆ వ్యవస్థ పేరు పౌరసత్వం. ఎన్‌డి టివి నాకొక అవకాశం ఇచ్చినప్పుడల్లా నేను మీ కోసమే పని చెయ్యడానికి ప్రయత్నించాను. నాకు అందిన అవకాశాన్ని మీ కథలతోనే నింపాను. మీరు నా మీద పెద్ద బాధ్యత పెట్టారు. మీరు మీ ఇళ్లలో, మీ మనసుల్లో నాకోసం ఒక న్యూస్ రూం నిర్మించారు. ప్రపంచవ్యాప్తంగా వీక్షకులు నాకు సహాయపడదానికి ముందు కొచ్చారు. మీరు నన్ను డబ్బు అడగలేదు. మీ కోసం ఏదో సహాయం చేయమని అడగలేదు. చాలమంది నా వీడియోలు రికార్డ్ చేసి పెట్టారు. నా పరిశోధనలో సహకరించారు. నా కార్యక్రమాలలో ప్రతి ఒక్కటీ మీ సహకారానికి ఒక వ్యక్తీకరణ. మీరే నాకు సమాచారం అందించారు. నా పొరపాట్లకు మందలించారు. నా కార్యక్రమాల్లో భాగమయ్యారు. నిపుణులు, విద్యార్థులు, ప్రవాసులు, భారతీయులు అందరూ వీక్షకులే. కాని నా సహప్రయాణికులయ్యారు. తమంతట తామే జర్నలిస్టులయ్యారు. ఆ విధంగా వాళ్లు జర్నలిజం అనే ఒక చిన్న ద్వీపాన్ని పరిరక్షించారు. ఆ అర్థంలో నేను టివి వీక్షకుల సముదాయం తయారు కావడమూ చూశాను. అది పూర్తిగా విచ్ఛిన్నమై పోవడమూ చూశాను. ఇప్పుడు, ఆ సముదాయం ఒక వ్యవస్థగా లేచి నిలవడం చూస్తున్నాను. మీరు నా కృషిని విభిన్నమైన భాషలలోకి అనువదించారు. నాకు కావలసిన వనరులు ఎప్పుడూ అందుబాటులో ఉండేవి కావు, కాని మీరే వాటిని నాకు అందుబాటులోకి తెచ్చారు. నిజానికి నేను నడిపిన కార్యక్రమం ప్రైమ్ టైమ్ మీ ప్రైమ్ టైమే. ఆ కార్యక్రమంలో ఎప్పుడన్నా కొరత కనబడితే, వెనువెంటనే మీ అసంతృప్తి ప్రదర్శించేవారు. వీక్షకులే నాకు ఎల్లవేళలా సంపాదకులు. ఒక మనిషంటే అతని చుట్టూ ఉన్న మనుషుల సమాహారమే అని నేను ఎప్పుడూ అంటుంటాను. వీక్షకులుగా మీరు ఉన్నందువల్లనే రవీష్ కుమార్ ఇవాళ ఇక్కడ నిలబడి ఉన్నాడు. మీ మద్దతు వల్లనే ఎంతో మంది జర్నలిస్టులు యూట్యూబ్ మీద, ట్విట్టర్ మీద ఉండగలుగుతున్నారు. మీరు వెబ్ సైట్లకు చందాదారులయ్యారంటే, అవి నిలబడి ఉండడానికి సహాయ పడుతున్నారన్నమాట.

## జర్నలిస్టులకు వీక్షకులెట్లా సహకరిస్తారు

ప్రజాస్వామిక వ్యవస్థలు బలహీనపడినప్పుడు, న్యాయస్థానాలు బలహీనపడినట్టు కనబడినప్పుడు, బలోపేతంగా నిలబడినది మీరే. ఇవాళ్టి పరిస్థితులలో జర్నలిజపు అతి పెద్ద వ్యవస్థ మీరే. ఇవాళ జర్నలిజం వివేకవంతులైన వీక్షకులలోనే జీవిస్తున్నది, బ్రహ్మాండమైన భవనాల్లో, సంస్థల్లో కాదు. ఈ కాలంలో మీరు చేస్తున్న అతి పెద్ద సహాయం ఏమంటే, మీరు కఠినమైన ప్రశ్నలు అడిగే జర్నలిస్టుల పక్కన నిలబడుతున్నారు. ప్రజల గొంతును నొక్కేసే శక్తులుండవచ్చు. ప్రజల గొంతును మత విద్వేషంతో నింపే,ప్రజాస్వామ్యాన్ని హత్య చేసే శక్తులుండవచ్చు. కాని మీలో కొందరు నాలో ఆశలు రేకెత్తిస్తున్నారు. ఎందుకంటే, ప్రజాస్వామ్యమనేది చచ్చిపోయినప్పటికీ, సవ్యంగా సాగే ప్రజాస్వామ్యం ఉండాలనే కోరిక మిగిలే ఉంటుంది. అదంతా మీ వంటి బాధ్యతాయుత వీక్షకుల వల్లనే. ఈ కష్ట సమయంలో, అభిమానంతో నా బుగ్గలు పిండిన వృద్ధ స్త్రీలను కృతజ్ఞతతో తలచుకుంటున్నాను. నాకు మొక్కల కుండీలు కానుకలుగా ఇచ్చిన వాళ్లను, నేను ఆరోగ్యంగా ఉండాలని బలవర్ధక ఆహారం అందించినవాళ్లను కృతజ్ఞతతో తలచుకుంటున్నాను. మండు టెండల్లో పనిచేస్తున్నప్పుడు నా మీద నీడగా గొడుగులు

పట్టుకున్న వాళ్లున్నారు. గుట్టుచప్పుడు కాకుండా నా జేబులోకి ఖరీదైన కలాలను తోసినవాళ్లున్నారు. అందువల్లనే ఇవాళ నాకు మీ అందరినీ తలచుకోవాలనిపిస్తున్నది. మీరందరూ లేకపోతే నేననేవాణ్ని ఉండేవాణ్ని కాదు. మీరందరూ నాకు గర్వకారణం. చాలాసార్లు నాకు ఉద్యోగం ఇచ్చిన సంస్థ ప్రతినిధిని కాననీ, మీ ప్రతినిధినేననీ అనిపించింది. నాకు పని చేసుకోవడానికి అవధులు లేని స్వేచ్ఛ లభించింది. నా జీవితమే దాని మీద ఆధారపడినట్టుగా నేనా స్వేచ్ఛను కాపాడుకున్నాను. ఆ సమయంలో మీరు, విజ్ఞులైన వీక్షకులు నన్ను పరీక్షిస్తున్నారని నాకు తెలుసు. ఏ పొరపాటూ చేయకుండా ఉండడానికీ, అహంకారాన్ని దరిచేరనీయకుండా ఉండడానికీ జాగ్రత్తలు తీసుకున్నాను.అహంకారం వచ్చిందంటే నా స్వేచ్ఛను కోల్పోతానని నాకు తెలుసు. నా కళ్ల ముందే ప్రపంచం మారిపోతూ ఉండగా, టెస్ట్ మాచ్ లో బాట్స్ మన్ లాగ నేను రేఖ మీదనే నిలబడ్డాను.కాని హఠాత్తుగా ఎవరో అసలు మాచ్ నే ముగించారు,ఆట నియమాలను మార్చేశారు. వీక్షకుల మీద ఇష్టారాజ్యంగా స్వారీ చేసేవాళ్లు ప్రతి దేశంలోనూ ఉంటారు. భారతదేశంలో కూడ ఉన్నారు. వాళ్లు మీకు వాస్తవాలే ఇస్తున్నామని నమ్మబలికితే అర్థమేమంటే, డాలర్లకు డాలర్లు తమ జేబుల్లో వేసుకుంటూ మీకు చిల్లర సెంట్లు విసురుతున్నారన్నమాట. వాళ్ల తప్పులను బహిర్గతం చేయడానికి జర్నలిస్టులో, వార్తా సంస్థలో ప్రయత్నిస్తే, వారి మీద లెక్కలేనన్ని కేసులు బనాయిస్తారు.మళ్లీ వాళ్లే అర్థవంతమైన జర్నలిజమంటే తమకు అమిత ఆసక్తి అని గంభీరంగా చెపుతుంటారు.

**హిందీ జర్నలిజం అవసరం**

హిందీలో పనిచేసే అద్భుతమైన జర్నలిస్టులెందరో తమ అభిప్రాయాలను ప్రపంచంతో ఎందుకు పంచుకోరు ? వాళ్ల పరిజ్ఞానం ఎంత లోతైనదో చూసి నేను ఆశ్చర్యపోయాను. కాని ఎప్పుడూ వారికి దక్కవలసిన స్థానం దక్కలేదు. భారతదేశంలో అత్యధిక గౌరవం పొందే జర్నలిస్టులు ఇంగ్లిష్ మాధ్యమాలలో పనిచేసేవారే. అందువల్లనే నేను హిందీ జర్నలిజానికి గౌరవ నీయత తేవడానికి ప్రయత్నించాను. ఈ భాషలో జర్నలిజం కూడ ముఖ్యమైనదేనని చూపాను. దేశం మొత్తం నుంచీ ప్రజలు నా హిందీని ప్రేమించేలా చేసేందుకు ప్రయత్నించాను. నిజానికి నా మాతృభాష హిందీ కాదు, భోజ్ పురి. నేను నా భోజ్ పురి కుగ్రామం నుంచి ఈ హిందీ మహానగరానికి నడిచివచ్చాను. నా హిందీని సంపద్వంతం చేసిన దేశంలోని హిందీయేతర ప్రాంతాల ప్రజలందరికీ కృతజ్ఞతలు చెప్పదలచాను. వారు నా పనిని తమ భాషల్లోకి అనువదించారు. వారి రచనలను నాకోసం హిందీలోకి అనువదించారు! నేనొక బిడారులో ప్రయాణిస్తున్నాననీ, ఈ ప్రయాణంలో ఎంతో మంది నాతో భుజం కలిపి నడిచారనీ నాకు తరచుగా అనిపిస్తుంటుంది. ఇదేమీ హిందీ, ఇంగ్లిష్ జర్నలిజాల మధ్య కుస్తీ పోటీలా మారాలని నేను అనుకోవడం లేదు. అందువల్ల నా జీవితంలో ఇంగ్లిష్ భాషా జర్నలిస్టులు చేసిన ఎన్నెన్నో సహకారాలను కూడ తలచుకోవాలి.

**జర్నలిస్టులు ఏం చేయవలసి ఉంది**

వీక్షకులతో సమయం పంచుకున్నప్పుడల్లా, జర్నలిస్టుల పట్ల మీ విశ్వాసాన్నీ, సమస్యల పట్ల మీ లోతైన అవగాహనలనూ చూసి నేను ముగ్ధుడి నయ్యాను.మీ దగ్గర చెప్పవలసింది ఎంతో ఉంది. నిజానికి అదంతా వినడం ప్రభుత్వ బాధ్యత. మీ గళాన్ని అత్యున్నత స్థాయిల దాకా తీసుకుపోయే మాధ్యమంగా ఉండడమే జర్నలిస్టులు చేయవలసిన పని. ఈ దేశాన్ని మీ కళ్ల ద్వారా చూడడానికే నేను ఎల్లప్పుడూ ప్రయత్నించాను. మీ క్రియాశీలతే భారత ప్రజాస్వామ్యాన్ని సజీవంగా ఉంచుతుంది. షహీన్ బాగ్, రైతుల ఆందోళన మీలో నా విశ్వాసాన్ని ఇనుమడింపజేశాయి. మీరు బాధ్యతాయుత పౌరులుగా రూపాంతరం చెందుతుండడం నేను గమనించాను. మీరే భవిష్యత్తులో మెరుగైన సమాజాలను సృష్టించగలరు. సమాజంలోని సమస్త రంగాలనూ తమ అదుపులో ఉంచుకోగలమని ఇవాళ కొందరు భావిస్తున్నారు. పౌరులను గడ్డిపోచల్లా తీసేయగలమని లెక్కలేకుండా ప్రవర్తిస్తున్నారు. ప్రచార మాధ్యమాలనేవి మరణించాయి.రాజకీయ ప్రతిపక్షం పెనుగు లాడుతున్నది. అదంతా నిజమే. కాని ఇటువంటి స్థితి శాశ్వతం కాదు. ఒక రోజున ప్రజలు తమ విద్వేషాన్ని అధిగమిస్తారు.వారు ఒక కొత్త సమాజాన్ని నిర్మించడం గురించి ఆలోచిస్తారు. అప్పుడు వారు జర్నలిజం గురించి ఆలోచిస్తారు. నేను చదవడమూ, మాట్లాడడమూ,రాయడమూ ఎన్‌డి టి.వి. దగ్గరే నేర్చుకున్నాను. మంచి దుస్తులు ధరించడం ఎట్లాగో, టై కట్టుకోవడం ఎట్లాగో ఎన్‌డి టివి దగ్గరే నేర్చు కున్నాను.ఖాళీ సమయమే దొరకలేదు గనుక నాట్యం ఎలా చేయాలో మాత్రం నేర్చుకోలేకపోయాను.

**మహిళా జర్నలిస్టుల దగ్గర నేర్చుకున్న పాఠాలు**


నా మహిళా సహోద్యోగులను నేను ప్రత్యేకంగా తలచుకోదలచుకున్నాను. వాళ్లే నాకు నిజాయితీగా ఉండడం, కష్టపడి పని చేయడం, నీతిగా ఉండడం నేర్పారు. సామాజిక సమస్యల పట్ల నా అవగాహనలను వాళ్లు విశాలం చేశారు. ఎందరో స్త్రీల, బాలికల అనుభవాలు నా ప్రయాణంలో కలిసిపోయాయి. నా సహచరి, నా కూతుళ్లు, మా అమ్మ నాకు మద్దతు ఇచ్చారు. జర్నలిజంలో పురుషుల రాజ్యమే, పితృ స్వామ్యమే నడుస్తున్నది. వారి దూకుడు ఇబ్బందికరంగా ఉండేది. అటువంటి దూకుడు సృజనాత్మకతనూ, ఆలోచననూ చంపేస్తుంది. అటువంటి దూకుడుకు పాల్పడకుండా నన్ను నా మహిళా సహోద్యోగులే కాపాడారు. (మిగతా 29వ పేజీలో)

# విఫల ప్రత్యామ్నాయం సుభాష్ బోస్



కొప్పర్తి వెంకటరమణమూర్తి

కేంద్ర ప్రభుత్వం నేతాజీ సుభాష్ చంద్రబోస్ నూట ఇరవై ఐదవ జన్మదినం 23 జనవరి 2021ను పరాక్రమ దివస్‌గా ప్రకటించింది. సుభాష్ చంద్రబోస్ సమరశీల దృక్పథం ఉన్నవాడు. యోధ. మొదటి నుంచీ గంధక ధూమంలా ఘాటెక్కుతూ చివరి ఘట్టంలో తారాజువ్వలా మిరుమిట్లు గొలుపుతూ ఎగిరి ఆకాశంలోనే పేలి, రాలిపోయాడు. స్వాతంత్ర్యోద్యమ చరిత్రే లేని భారతీయ జనతాపార్టీ చాకచక్యంగా తనకంటూ ఒక స్వాతంత్ర్యోద్యమ దండును ఏర్పరచుకుంటున్నట్టు స్పష్టమౌతోంది. తానెట్లాగూ ఉద్యమంలో పాల్గొననూ లేదు, త్యాగాలు చెయ్యనూ లేదు కాబట్టి ఆ పనులు చేసిన తన ప్రధాన ప్రత్యర్థి భారత జాతీయ కాంగ్రెస్‌తో లేదా దాని ప్రధాన నాయకులైన గాంధీ, నెహ్రూలతో విభేదించిన వాళ్లని తన బ్యాండ్‌లో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నది. అందులో భాగంగా నెహ్రూ ప్రత్యర్థి పటేల్‌ను ఇప్పటికే తన ఖాతాలో వేసేసుకుంది. అందరికీ కనిపించేటట్టు ఆయనకు కట్టించిన ఆకాశమంత విగ్రహం అసలు రహస్యం ఆయన తమ బుట్టలో ఉన్నాడని చెప్పడమే ! ఇప్పుడిక గాంధీ ప్రత్యర్థి బోస్ వంతు వచ్చినట్లుంది. ముందేం చెయ్యబోతోందో తెలీదు గానీ, ప్రస్తుతానికి మాత్రం ఆయన జన్మదినం పరాక్రమ దివస్ !



**ఇప్పుడు బోస్ దేనికి ప్రతీక అవుతున్నాడన్నది ఆసక్తికరమైన ప్రశ్న. ఆయన పుట్టినరోజు పరాక్రమ దివస్ అయినపుడు ఆయన తప్పక పరాక్రమానికే ప్రతినిధి అవుతాడు. ఆయనిచ్చిన జై హింద్ నినాదమూ, మీ రక్తాన్నివ్వండి మీకు స్వాతంత్ర్యాన్నిస్తాను లాంటి మాటలు కొత్త అర్థాల్ని సంతరించుకుంటాయేమో తెలియదు. యుద్ధాల్ని అనివార్యం చేసి త్వరలో ఎవరైనా మనల్నికూడా మన రక్తం ఇవ్వమని అడుగుతారేమో తెలియదు.**

నూట ఇరవై ఐదేళ్ల క్రితం జన్మించి డెబ్బై ఐదేళ్ల క్రితం మరణించిన అగ్రశ్రేణి స్వాతంత్ర్య సమరయోధుణ్ణి స్మరించుకోవడం పునరవలోకనం చెసుకోవడం అవసరమే. కాంగ్రెస్‌లో గాంధీ తొలి ప్రత్యర్థి చిత్తరంజన్ దాస్ కాగా, ఆయన్ని తన రాజకీయ గురువుగా ప్రకటించుకున్న సుభాష్ చంద్రబోస్ అయనతో కలిసీ, ఆయన తర్వాత గాంధీ వ్యతిరేక వారసత్వాన్ని కొనసాగించాడు. చౌరిచౌరాలో జరిగిన హింసాత్మక సంఘటన పర్యవసానంగా గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని నిలిపివేయడాన్ని national calamityగా అభివర్ణించి మొదటిసారి బోస్ తన గాంధీ వ్యతిరేక స్వరాన్ని వినిపించాడు. అది మొదలు చివరిదాకా కాంగ్రెస్‌లో గాంధీకి సమాంతర పాయనొకదాన్ని ప్రవహింపచేస్తూ వచ్చాడు. గురువు చిత్తరంజన్‌దాస్ మోతీలాల్తో కలిసి ప్రారంభించిన స్వరాజ్య పార్టీ గాంధీ సహాయ నిరాకరణ స్ఫూర్తికి భిన్నంగా ఎన్నికల్లో పాల్గొని శాసనసభల్లోకి ప్రవేశించి ప్రభుత్వాన్ని స్థంభింప చెయ్యడానికి ప్రయత్నించింది. 1928లో గాంధీ, మోతీలాల్ తదితరులు బ్రిటీష్ ప్రభుత్వం నుంచి అధినివేశ ప్రతిపత్తి కొరితే జవహర్‌లాల్ నెహ్రూ, శ్రీనివాస అయ్యంగార్‌లతో కలిసి బోస్ ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్‌ను స్థాపించి సంపూర్ణ స్వరాజ్యాన్ని కోరాడు. 1938, 1939 సంవత్సరాలలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా గాంధీతోనూ ఆయన అనుయాయులతోనూ తీవ్ర విబేధాలను ఎదుర్కొన్న బోస్ 1939లో వరుసగా రెండవసారి కాంగ్రెస్ అధ్యక్ష పీఠం స్వీకరించడం సంప్రదాయానికి విరుద్ధంకావడాన అంగీకరించని గాంధీని ఎదుర్కొని ఆయన అభ్యర్థి పఠాభి మీద విజయం సాధించాడు. రెండవ

ప్రపంచయుద్ధ ఛాయలు ముసురుకుంటున్న ఆ సమయంలో బ్రిటన్‌కు ఆరు నెలల గడువిచ్చి స్వాతంత్ర్యం ఇవ్వకపోతే మహాసంగ్రామం మొదలు పెట్టాలని, అందుకు బ్రిటన్ శత్రువులతో చేతులు కలపాలని ప్రతిపాదించడం బోస్‌లోని గాంధీ ప్రతికూల భావజాలానికి పరాకాష్ట. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్ కార్యవర్గం బోస్ తీవ్రవాద అనుచరులతో నిండి పోకుండా గాంధీ పట్టు బిగించడంతో బోస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశాడు. వెంటనే కాంగ్రెస్‌లోనే ఫార్వర్డ్ బ్లాక్‌ను స్థాపించి యుద్ధ సమయంలో స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పించుకున్నాడు. యుద్ధం ఆరంభమైంది. భారతదేశం ఇంగ్లండ్‌కు సహకరించకూడదని చేసిన అందోళన ఫలితంగా బోస్‌తో సహా ఫార్వర్డ్ బ్లాక్ సభ్యులు నిర్బంధానికి గురయ్యారు. 1941లో బోస్ గృహ నిర్బంధం నుంచి తప్పించుకుని దేశ సరిహద్దులు దాటిపోవడంతో ఆయన జీవితంలోనూ దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో విలక్షణ ఘట్టానికి తెరలేచింది. ఈ ఘట్టంలో జర్మనీ మీదుగా జపాన్, సింగపూర్ చేరుకుని అజాద్ హింద్ ఫౌజ్‌కు నాయకత్వం వహించడం వంటి పరిణామాల గురించి అంతో ఇంతో తెలియని వారుండరు. ఇక్కడే సుభాష్ చంద్రబోస్ ఆలోచనా విధానానికి సంబంధించిన కొన్ని మౌలిక ప్రశ్నలు మనకు ఎదురౌతాయి. దేశానికి స్వాతంత్ర్యం సాధించడమనే మహత్తర ఆశయ సాధనకు వ్యక్తిత్వంతో, భావజాలంతో నిమిత్తం లేకుండా మన శత్రువు శత్రువు మనకు మిత్రుడే అనే ఆలోచనా విధానాన్ని అంగీకరించినట్టు స్పష్టమౌతుంది. ఇది చేరుకోవలసిన గమ్యాలే కాదు, అనుసరించవలసిన మార్గాలు కూడా సరైనవే అయి ఉండాలనే గాంధీ ఆలోచనలకు పూర్తిగా వ్యతిరేకమైనవి. రెండవ ప్రపంచ యుద్ధం మొదలైనపుడు Britains peril is Indias opportunity అని బోస్ ప్రకటించడం చూస్తే ఉద్యమ సమయాల్లో క్రిస్మస్ వంటి పండుగలు వచ్చినపుడు బ్రిటీష్ వారు వాటిని జరుపుకునేందుకు వీలుగా ఉద్యమాన్ని తాత్కాలికంగా నిలిపివేసిన గాంధీది విపక్షమేనని స్పష్టమౌతుంది. నాజీ హిట్లర్‌తో, ఫాసిస్ట్ ముస్సోలినితో జత కట్టడానికి ప్రయత్నించిన బోస్ యుద్ధం ప్రారంభం కావడానికి ముందు ఫాసిస్ట్ నాజీ తీవ్ర జాతీయవాదం సృష్టించిన భీభత్సం పట్ల అంత ఉదాసీనత ఎట్లా వహించాడా అని విస్తుపోతాం. ఆస్ట్రియాతో మొదలుపెట్టి పోలెండ్ దాకా, అల్బేనియా నుంచి అబిసీనియా దాకా దేశం తర్వాత దేశాన్ని ఆక్రమించుకుంటూ వస్తున్న ఈ దేశాలను విశ్వసించిన బోస్ దేశభక్తిలో కసాయిని నమ్మే గొర్రె అమాయకత్వం ప్రతిఫలిస్తుంది. బోస్ తన జాతీయాభిమానాన్ని హిట్లర్ ముస్సోలినీల తీవ్ర జాతీయాభిమానంలో విలీనం చేసే అనాలోచిత చర్యకు పూనుకున్నాడా అని అనిపిస్తుంది. రెండవ ప్రపంచ యుద్ధం ప్రజాస్వామిక సామ్యవాద దేశాలు నిరంకుశ రాజ్యాలమీద చేస్తున్న యుద్ధంగా పరిగణింపబడుతున్న కాలంలో తానెవరి పక్షం వహిస్తున్నాడో ఆ జర్మనీ, ఇటలీ ల సహకారంతో సాధించే విజయ పర్యవసానంగా ఏర్పడే ప్రభుత్వం ఎట్లా ఉండబోతోందో ననే విచక్షణకు ప్రాధాన్యతనిచ్చినట్లు కనిపించదు. అజాద్ హింద్ ఫౌజ్ నాయకుడిగా సేనాధిపతిగా సింగపూర్‌లో స్వతంత్ర తాత్కాలిక భారతప్రభుత్వ అధ్యక్షుడిగా బోస్ సైనిక దుస్తులు ధరించి ఉండడం సైనిక నియంతలను జ్ఞప్తికి తెస్తే ఎవరిని నిందించాలీ ? నాయకులుగా హిట్లర్ ను ఫ్యూరర్ అనీ, ముస్సోలినీని ఇల్ డ్యూస్ అని పిలిచినట్లు బోస్ ని నేతాజీ అని పిలిచినట్లున్నది అనుకుంటే తప్పవుతుందా ? అది అటుంచి అప్పటికే 'ఆసియా ఆసియన్లకే' అనే నినాదం ముసుగులో ఆసియా నుంచి యూరప్‌ని తరిమేసి ఆ స్థానాన్ని ఆక్రమించడానికి విజృభిస్తున్న జపాన్ సహాయం కోరడమేమిటో అర్థం కాదు. అప్పటికే మిత్రపక్షాల సేనలను మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్న జపాన్ సహాయంతో అజాద్ హింద్ ఫౌజ్ భారత్ లోకి ప్రవేశిస్తే మళ్లీ జపాన్ నిష్క్రమణ అంటూ ఉంటుందా ? సుడేటాన్‌లోకి మాత్రమే ప్రవేశానికీ ఆక్రమణకూ అనుమతి పొందిన హిట్లర్ దాంతోపాటు మొత్తం చెకొస్లవేకియాను ఆక్రమించేసుకోలేదూ ? క్విట్ ఇండియా అంటే ఏమిటీ? చొచ్చుకు వస్తున్న జపాన్‌ను నిలువరించడంలో విఫలమౌతున్న బ్రిటన్ సేనలు పూర్తిగా విఫలమై దేశం జపాన పరమైపోతే పెనం మీదనుంచి పొయ్యిలో పడినట్లవుతుందని భావించి పెట్టిన పెడబొబ్బ కదా అది ! జపాన్‌తో స్నేహం ఎంత వివక్షాపూరితమో కష్టకాలంలో ఫౌజ్ కు ఆహారమూ, వస్త్రాలు, మందుల సరఫరాలో చూపిన వలపక్షం ఆయనకు వెంటనే అనుభవంలోకి రాలేదూ !? ఇంకెక్కడి విజయం ? ఇంకెక్కడి స్వాతంత్ర్యం ? అట్లాగే, ఇటీవల కేంద్ర మంత్రి ఒకరు నేతాజీ తృటిలో బ్రిటీష్ వ్యతిరేక సైన్యాన్ని సృష్టించాడనీ, ఆయన ఒక్క పిలుపు ఇవ్వగానే వేలాదిగా ప్రజలు తృణప్రాయంగా ప్రాణ త్యాగం చేశారనీ, ఆయన అజాద్ హింద్ ఫౌజ్ అనే సరికొత్త బలగాన్ని సృష్టించి శత్రువు ముందు నిలిపారనీ అన్నారు. అజాద్ హింద్ ఫౌజ్ స్థాపకుడు సుభాష్ చంద్రబోసేనని సాధారణ ప్రజలు అనుకోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ బాధ్యతాయుత స్థానంలో ఉన్నవాళ్లు చరిత్రను అవాస్తవాలతో అతిశయోక్తులతో నింపకూడదు. ప్రజలూ సైనికులూ ప్రాణత్యాగం చెయ్య లేదనటం లేదుగానీ ఈ వాక్యాలు చదివే సాధారణ పాఠకులు బోస్ ఏ జపాన్ నుంచో సింగపూర్ నుంచో పిలుపు నిస్తే ప్రజలు ఇక్కణ్ణుంచి తరలివెళ్లి పోరాడినట్టు అర్థం చెసుకునే ప్రమాదం ఉంది. వాస్తవమేమంటే అజాద్ హింద్ ఫౌజ్ స్థాపకుడు బోస్ కాదు, కెప్టెన్ మోహన్‌సింగ్ అనే జపనీయులకు పట్టుబడిన బ్రిటీష్ ఇండియా సైన్యాధికారి. అందులోని సైనికులు సాధారణ ప్రజలు కాదు. వారు కూడా పోరులో ఓడి జపాన్ వారికి బందీలుగా చిక్కిన బ్రిటీష్ ఇండియా సైనికులు. జపాన్ అనుమతితో బ్రిటీష్ ఇండియా సైన్యంతో పోరాడడానికి అజాద్

హింద్ ఫౌజ్‌ను రూపొందించాడు మోహన్‌సింగ్. వారికి ముప్పై ఏళ్ళుగా ప్రవాస జీవితం గడుపుతున్న విప్లవకారుడు రాస్ బిహారీ బోస్ నాయకత్వంలోని ఇండియన్ ఇండిపెండెన్స్ లీగ్ సభ్యులు జత కలిశారు. తూర్పు ఆసియాలోని భారతీయులు ఈ విప్లవసేనలో చేరాలని రాస్ బిహారీ బోస్ అప్పటికే పిలుపు నిచ్చాడు. జర్మనీలో విఫలమైన ప్రయత్నాల నేపథ్యంలో ఫౌజ్ నాయకుల ఆహ్వానం మేరకు అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో సింగపూర్ చేరుకుని బోస్ ఫౌజ్ నాయకత్వ బాధ్యతలు స్వీకరించి దానికొక నిర్దిష్టతను, సమగ్రతను సంతరించాడు. ఆయనిచ్చిన పిలుపు మేరకు కొందరు తూర్పు ఆసియాలో నివసిస్తున్న భారతీయులు సేనలో చేరారు. యుద్ధం మళ్లీ మొద లైంది. ఇంతకీ అజాద్ సేన జపాన్ సహకారంతో భారతదేశ విముక్తి కోసం ఎవరితో పోరాడిందీ అనే ప్రశ్నకు బ్రిటీష్ ఇండి యా సైన్యంతోనే అన్నదే సమాధానం. ఇది అరుదైన సంఘటన. అంతర్యుద్ధంలో మాత్రమే తల ఎత్తే పరిస్థితి. అనంతర పరిణా మాల ఫలితంగా హిట్లర్ ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకు ముందే ముస్సోలినీని స్వంత సైనికులే కాల్చివేశారు. ఇంఫాల్ లో జరిగిన పోరులో అజాద్ సేన ఓటమి పొందింది. రెండు అణుబాంబు ప్రయోగాల తర్వాత జపాన్ లొంగిపోయింది. అజాద్ సేనను లొంగదీసుకోవడానికి ఖాతరు చేసినవారు లేరు. 1945 ఆగస్టు 18న తైపీలోని పైగాన్ విమానాశ్రయం నుంచి బయలుదేరిన బోస్ మళ్లీ కనిపించలేదు. ఆయన మరణం చుట్టూ, 'మరణం తర్వాత జీవితం 'చుట్టూ అల్లుకున్న కథలు అందరికీ తెలిసినవే. His end was of a piece with his character అనిపిస్తుంది. బోస్ చివరి ఘట్టంలో అనుసరించిన విధానాల ప్రతిఫలనాలే ఆయన అంతి మఘట్టంపై పడ్డాయన్నది స్పష్టం. ఆయన ఎక్కడికి బయలుదేరారో, ఎక్కడ విమాన ప్రమా దం జరిగిందో, అసలు జరిగిందో లేదో జరిగితే మరణించారో లేక ప్రాణాలతో బయటపడ్డారో అంతా అస్పష్టం. ఇందులో అస్పష్టం ఒక్కటే స్పష్టం. బ్రిటీష్ ప్రభుత్వం యుద్ధం తర్వాత అజాద్ సేన మీద దేశంపై యుద్ధం ప్రకటించినందుకు దేశద్రోహ నేరం మోపింది. వాళ్లు దేశభక్తులా దేశద్రోహులా అనే చర్చ జరిగింది. దేశం వాళ్లని దేశభక్తులుగానే గుర్తించి అం డగా నిలిచింది. కేసు నడచింది. దేశం గెలిచింది.

అయితే ఇప్పుడు బోస్ దేనికి ప్రతీక అవుతున్నాడన్నది ఆసక్తిక రమైన ప్రశ్న. ఆయన పుట్టినరోజు పరాక్రమ దివస్ అయినపుడు ఆయన తప్పక పరాక్రమానికే ప్రతినిధి అవుతాడు. ఆయనిచ్చిన జై హింద్ నినాదమూ, మీ రక్తాన్నివ్వండి మీకు స్వాతంత్ర్యా న్నిస్తాను లాంటి మాటలు కొత్త అర్థాల్ని సంతరించుకుంటా యేమో తెలియదు. యుద్ధాల్ని అనివార్యం చేసి త్వరలో ఎవరైనా మనల్ని కూడా మన రక్తం ఇవ్వమని అడుగుతారేమో కూడా తెలియదు. ❑

# 'విఫల ప్రత్యామ్నాయం బోస్' మీద విమర్శకు సమాధానం

**జనవరి 31 నాటి 'విఫల ప్రత్యామ్నాయం బోస్' అనే నా వ్యాసం మీద మార్చి 3న మంగెన గంగాధరరావు గారు, అంతకు ముందు బాపూజీ గారు (తేదీ గుర్తులేదు) చేసిన వ్యాఖ్యలు చూశాను.**

గాంధీకి కాదు బోస్‌కు భయపడే స్వాతంత్ర్యం ఇచ్చాం అని క్లైమెంట్ అట్లీ 1956 పర్యటనలో బెంగాల్ చీఫ్ జస్టిస్, యాక్టింగ్ గవర్నర్ పీబీ చక్రవర్తితో జరిపిన వ్యక్తిగత సంభా షణల్లో అన్న మాటలు చర్చకు నిలిచేవి కావు. బహిరంగంగా అనడానికి నైతికశక్తి లేని అంశాలే ఇటువంటి సంభాషణల్లో దొర్లుతాయి. ఇందులో గాంధీ పాత్ర లేదా అన్న తన ప్రశ్నకు అట్లీ మూతి ముడిచి minimal అని సణిగినట్టు కూడా జస్టిస్ చక్రవర్తి చెప్పారు. సణగడం ఈ బ్రిటీష్ మాజీ ప్రధాని వ్యక్తిత్వం లోనే ఉందనే విషయం అటుంచి సణగడం ఎందుకు, తన అభి ప్రాయాన్ని ధైర్యంగా ప్రకటించవచ్చుగా అనే ప్రశ్నకు ప్రకటిం చలేడు అనేదే సమాధానం. ఎందుకంటే గాంధీ వెనుక మూడు దశాబ్దాలు, అంతకు ముందు మరో మూడు దశాబ్దాల స్వాతంత్ర్యోద్యమం ఉంది. బోస్‌కు భయపడే స్వాతంత్ర్యం ఇచ్చి ఉంటే క్రిప్స్ మిషన్, వేవెల్ ప్లాన్, కాబినెట్ మిషన్‌లు ఎందుకు ? బ్రిటిష్ పార్లమెంట్‌లో స్వాతంత్ర్య ప్రకటన చేయక ముందే దేశంలో ఎన్నికలు జరిపి తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం ఎందుకు ? బోస్ బతికి ఉన్నప్పుడే ఆయనతో మంత నాలు జరిపి ఉండవచ్చు కదా !? బతికి ఉన్న గాంధీకి కాక చనిపోయిన బోస్‌కు భయపడి స్వాతంత్ర్యం ఇచ్చామనడం మెరమెచ్చు మాట. యుద్ధానంతరం అజాద్ హింద్ సేన ప్రభావంతో భారత సైన్యం లో అసంతృప్తి పొడచూపిందనీ దాన్ని అణచే శక్తి బ్రిటిష్ సైన్యానికి లేదని అట్లీ అనడం గోరును గొడ్డలిగా చూపించడమే. అది భారత సైన్యానికే కాదు, ప్రపంచ వ్యాపితంగా యుద్ధంలో పాల్గొన్న దేశాల సేన లన్నిటిలో ఉన్న నిరసనే. అది తిరుగుబాటు రూపం తీసుకునే స్థాయిలో లేదు. దానికి నాయకత్వమూ లేదు. అప్పటికి అజాద్ హింద్ సేనా నాయకుల మీద దేశద్రోహ నేరం మోపబడి రెడ్ ఫోర్ట్ ట్రయల్స్ పేరుతో జరుగుతున్న విచారణ పట్ల సైన్యంలో వ్యతిరేకత కనిపించడం మాత్రం వాస్తవం. అది ఒకనాటి సహచరుల పట్ల సైన్యం చూపిన అభిమానం. ఇక బొంబాయి లో 1946 లో జరిగిన రాయల్ ఇండియన్ నేవీ(రిన్) తిరుగుబాటును బోస్ ఖాతాలో వెయ్యడం కుదరదు. అది సరైన వేతనాలు భోజన సదుపాయాలు లేవనీ జాతి వివక్షకు గురౌతున్నామనీ నావికులు చేసిన తిరుగుబాటు. పటేల్ చొరవతో అది సద్దుమణిగింది. ఇక్కడ గుర్తు తెచ్చుకోవలసింది అట్లీ మాటలు కాదు, గాంధీ బయోగ్రాఫర్ లూయీ ఫిషర్ అన్న మాటలు. 'బ్రిటన్ భారత దేశం నుంచి నిష్క్రమించింది పరిపాలించే భౌతిక బలం లేక కాదు, కొనసాగే

నైతిక బలం లేక' అన్నాడాయన. అవి పైపై మాటలు కావు. ఒక ప్రత్యామ్నాయ పోరాట మార్గ తాత్విక సారాన్నీ, నాగరికతనీ నింపుకున్న మాటలు. అది అటుంచి, గాంధీ, నెహ్రూలు మాత్రమే దేశానికి స్వాతంత్ర్యం తెచ్చారని ఇప్పుడెవరూ అనడం లేదు. ఆ మాటకు ఎప్పుడో కాలం చెల్లింది. ఇది సమిష్టి కృషి ఫలితం. అందులో బోస్ పాత్ర కూడా ఉండి ఉండ వచ్చు. అయితే ఏ అహింసాయుత, ప్రజస్వామిక, లౌకిక, సామ్యవాద భావనలు ఉద్యమాన్ని నడిపి స్వతంత్ర భారత రాజ్యాంగానికీ మనుగడకూ దిక్సూచీలయ్యాయో అవి ముఖ్యం. వాటికెవరు ప్రాతినిథ్యం వహిస్తున్నారన్నది ముఖ్యం. ఎవరిని ఎవరు ప్రతినిథిగా ఎందుకు ముందుకు తెస్తున్నారన్నది మరీ ముఖ్యం. ఇట్లా చూసినప్పుడు గాంధీకి బోస్ ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాజాలడు. బోస్ మొదటి నుంచీ టొటాలిటేరియన్ దృక్పథం ఉన్నవాడు. 1921లో ఇంగ్లండ్‌లో ఐసియస్‌ను మధ్యలో వదలి బొంబయి రేవులో దిగిన రోజే గాంధీతో జరిపిన భేటీలో తను శరపరంపరగా కురిపించిన ప్రశ్నలకు ఒకటొకటిగా మాత్రమే గాంధీ నుంచి వచ్చిన సమాధానాల్లో తమ దారులే కాదు స్వాతంత్ర్యానంతరం దేశంలో ఏర్పడాల్సిన వ్యవస్థ కూడ వేరైనదని గుర్తించాడు. అది బోస్‌లో ఎప్పుడూ సమసిపోలేదు. బోస్‌ను సైనిక దుస్తుల్లో చూడడానికి మనం 1943 దాకా ఆగనవసరం లేదు. 1928లోనే చూడవచ్చు. ఆ సంవత్సరం కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సమావేశ నిర్వహణ లో వలంటీర్ దళపతిగా తను సైనిక దుస్తులు ధరించి అనుచరులకూ అటువంటి యూనిఫామే ఇచ్చాడు. ఆ సందర్భంగా ఆ పెరేడ్లూ, ఇనుప బూట్ల చప్పుళ్లూ, శాల్యూట్లకూ విసిగిన గాంధీ దాన్ని ఇంగ్లండ్‌లో అప్పట్లో ప్రసిద్ధి చెందిన బెట్రాం మిల్స్ సర్కస్ పోల్చి ఈసడించాడు. (అప్పుడు కూడా బెంగాలీలకు కోపం వచ్చిందనుకోండి) బోస్ సామ్యవాదం శాస్త్రీయ సామ్యవాదం కాదు. కనీసం నెహ్రూ సోషలిజం కూడా కాదు. అది వివేకా నందుడి సోషలిజం. దాన్ని పక్కన పెడితే, ఆయన 1940 తర్వాతే హఠాత్తుగా ఫాసిస్ట్ శక్తులతో చేతులు కలిపాడనుకోవడం పొరపాటు. 1930లోనే దేశానికి సోషలిస్ట్ ఫాసిస్ట్ భావజాలాల మిశ్రమ వ్యవస్థ కావాలన్నాడు. 1944లో మరింత స్పష్టంగా మన సిద్ధాంతం నేషనల్ సోషలిజం(నాజీ) కమ్యూనిజంల సమ్మిళితం అని ప్రకటించాడు. 1944 లోనే టోక్యో విశ్వ విద్యాలయ విద్యార్థులను ఉద్దేశించి 'భారతదేశ మౌలిక సమస్యలు' అనే అంశం మీద ప్రసంగిస్తూ ఇంగ్లండ్, ఫ్రాన్స్, అమెరికాలాంటి దేశాల్లో ప్రజాస్వామిక వ్యవస్థలు విఫలమైనాయనీ, భారతదేశ ఆర్థిక వ్యవస్థను బాగు చెయ్యడానికి అథారిటేరియన్ లక్షణాలున్న ప్రభుత్వం రావాలనీ అన్నాడు. కాబట్టి సైనిక మార్గంలో సాధించిన స్వతంత్ర్య భారతదేశంలో బోస్ స్థాపించబూనుకున్న దేమిటో స్పష్టమైంది. అది ఏదైనా ప్రజాస్వామ్యం మాత్రం కాదు. కాబట్టి చరిత్ర తెలియడం వేరు. చరిత్రను ఎవరు ఏ ప్రయోజనాలు ఆశించి వ్యాఖ్యానిస్తున్నారో తెలుసుకోవడం వేరు. ❑

(ఆంధ్రజ్యోతి నుంచి)

# భారత జర్నలిజంలో చీకటి యుగం

**(25వ పేజీ తరువాయి)** ఈ జర్నలిజం క్షేత్రంలో ఇప్పుడిప్పుడే అడుగు పెడుతున్నట్టయితే మీకు నా సలహా ఏమంటే ఎల్లప్పుడూ మీ మహిళా సహోద్యోగులతో మన్ననగా ఉండండి. వాళ్ల సామర్థ్యాన్ని అంగీకరించండి, గౌరవించండి. వాళ్లను ప్రశంసించండి. నేను ప్రైమ్ టైమ్ యాంకర్‌గా ఉన్న రోజుల్లో నా జీవితమంతా ఆ కార్యక్రమానికే ముడిపడి ఉండేది. టివి వార్తలతో నేను ప్రేమలో పడ్డాను.బహుశా అందువల్లనే ఇవాళ నా గుండె పగులుతున్నది కాబోలు. ఎన్‌డి టి.వి. ఎర్ర మైక్రోఫోన్ ఎల్లవేళలా నా స్మృతిలో నిలిచే ఉంటుంది. నేను మీ దిన చర్యలో భాగమయ్యానని, మీరు నా గురించి ఆలోచిస్తుండే వారని నాకు తెలుసు. నిజానికి నేను మౌనంగా వెళిపోదామనుకున్నాను. అందుకే గత కొన్ని రోజులుగా ప్రైమ్ టైమ్ నుంచి తప్పుకున్నాను. మీ దినచర్య నుంచి నన్ను చెరిపెయ్యాలనుకున్నాను. మీరు నన్ను మరిచిపోయేలా చేయాలనుకున్నాను. కాని మీరు నన్ను ఆ పని చేయనివ్వలేదు.నేను ఎందుకు కనబడడం లేదని మీరు ప్రశ్నలు గుప్పించారు,నాకేమైనా అయ్యిందా అని అడిగారు, నా ఆరోగ్యం ఎలా ఉందని అడిగారు. భారత దేశపు ప్రచారమాధ్యమాల స్థలం మారిపోయింది.జర్నలిస్టులుగా మారాలనే కోరికతో లక్షలాది రూపాయలు ఖర్చుపెట్టి చదువుకుంటున్న భారతీయ యువకులను తలచుకుంటే నా హృదయం ద్రవిస్తున్నది. ఎందుకంటే, వాళ్లు చివరికి భారత రాజ్యపు సేవకులుగా పని చేయవలసి వస్తుంది. నీతిమంతులైన జర్నలిస్టులు పని చేయడానికి ఏ ఒక్క సంస్థా మిగలలేదు. ఇవాళ జర్నలిస్టులుగా ఉన్న వారందరూ కూడ అయితే ఊపిరిసలపని స్థితిలోనైనా ఉన్నారు. లేదా ఈ వృత్తినే వదిలేసి వెళ్లిపోయారు. జర్నలిజం అంటే నెల జీతం అందే ఒకానొక వృత్తే తప్ప మరేమీ కాదని నాకు ఎందరో చెప్పారు. జీతం మినహా జర్నలిజంలో ప్రోత్సాహకమైన ప్రేరణ ఏదీ లేదు. పవిత్రమైన జర్నలిస్టు మృత పౌర ప్రజానీకానికి బాధ్యత వహించాలి. కనుక నిర్భయంగా మాట్లాడండి. ఉట్టి పాదాలతో నడిచి మహా బలోపేతమైన బ్రిటిష్ పాలనను మట్టి కరిపించిన దేశపు పౌరులు మీరు. మిమ్మల్ని నమ్మకుండా ఉండడానికి కారణమే లేదు. అనైతికమైన మాధ్యమాల వార్తా సందేశాల సంకెళ్లను మీరు తెంచుకోగలరు. మీరు అందుకు పోరాడవలసి ఉంది. పోరాడకపోతే మీకు తలెత్తి నడిచే అవకాశమే లేదు. మీరు ఆ పోరాటం చేయకపోతే, మీరు ఒక స్వతంత్ర దేశపు పౌరులుగా ఉంటారేమో గాని, అమ్ముడు పోయిన మాధ్యమాల బానిసలుగా మిగిలిపోతారు. అటువంటి స్థితి వస్తుందేమో తస్మాత్ జాగ్రత్త. చట్టవ్యతిరేకమైనదంతా చట్ట బద్ధమైనదిగా కనబడేలా చేసేందుకు చట్టాల పేరు మీద ప్రజల హక్కులు కొల్లగొట్టబడుతున్నాయి. ఈ క్షణాన, నా భవిష్యత్తు అనిశ్చితం. కచ్చితంగా ఉన్నదొకే ఒకటి, ఆశ. ❑


# అక్షరాలే సాక్ష్యాలుగా మార్క్స్ ఏంగెల్స్ జీవితాలు

- అనువాదం:కొండూరి వీరయ్య



మార్సెలో ముస్తో

కారల్ మార్క్స్, ఏంగెల్స్‌లు మొదటిసారి నవంబరు 1842లో కొలోన్‌లో కలిశారు. వారిద్దరి మధ్య సైద్ధాంతిక సహవాసం మాత్రం 1844 నుండే మొదలైంది. 1849లో యూరోపియన్ విప్లవ వెల్లువ వెనకపట్టు పట్టడంతో మార్క్స్ ఇంగ్లాండ్‌కు వలస పోవాల్సి వచ్చింది. ఏంగెల్స్ కూడా మార్క్స్‌తో పాటే ఇంగ్లాండ్ చేరారు. మార్క్స్ లాడ్జింగ్‌లలో తలదాచుకుంటే ఏంగెల్స్ అక్కడికి వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న మాంచెస్టర్‌లో కుటుంబ యాజమాన్యంలో ఉన్న నూలు మిల్లు నడిపే బాధ్యతలు తీసుకున్నారు. 1850 నుండి 1870 వరకూ నూలు మిల్లు బాధ్యతల్లో ఉన్నప్పటికీ ఏంగెల్స్ మార్క్స్‌ల మధ్య సైద్ధాంతిక బంధం గాఢంగా పెనవేసుకుపోయింది. ఇద్దరూ ఏ చిన్న అంశంపై రాసినా పరస్పరం పంచుకుని సరి చూసుకునేవాళ్లు.



**ఏంగెల్స్ మార్క్స్‌తో ముచ్చటించిన విషయాలు, చిరాకుపడ్డ సందర్భాలు, మనసారా నవ్వుకున్న చర్చలు, చేజారిన విప్లవ అవకాశాలను మదింపు వేస్తూ రేపటి విప్లవం ఎప్పుడు, ఎక్కడ అంటూ సాగించిన మేథోమథనాలతో ఏంగెల్స్ జ్ఞాపకాల పొరలు రెక్కలు విచ్చుకుంటున్న పక్షుల్లా కిలకిలా రావాలు చేసేవి. ఎంత భావోద్వేగానికి లోనైనా నిద్రాణంగా ఉన్న కోట్లాదిమంది శ్రమ జీవులు దిక్కులు పిక్కటిల్లేలా రంకెలు వేస్తూ పెట్టుబడిదారీ వ్యవస్థ సౌధాన్ని కుప్ప కూల్చనున్నారన్న విషయంలో ఏనాడూ విశ్వాసాన్ని కోల్పోలేదు.**

నాటి ప్రపంచ పరిణామాలను ఎలా అర్థం చేసుకోవాలో లోతుగా చర్చించుకునే వాళ్లు. ఇలాంటి చర్చల కోసం వారు ఇరువురు రాసుకున్న లేఖలు వేల సంఖ్యలో ఉన్నాయంటే ఇద్దరి మధ్య జరిగిన సైద్ధాంతిక సంభాషణ ఏ స్థాయిలో, ఏ తీవ్రతతో సాగిందో అర్థం చేసుకోవచ్చు. ఆ రెండు దశాబ్దాల కాలంలో ఇద్దరి మధ్యా రెండున్నర వేల లేఖలు నడిచాయి. మరో 1500 లేఖలు సమకాలీన విప్లవకారులు, సోషలిస్టులు, కార్మిక నాయకులు, మొదటి ఇంటర్నేషనల్ సభ్యులకు రాసిన లేఖలు ఉన్నాయి.వీటికి తోడు మార్క్స్ ఏంగెల్స్ అందుకున్న మరో 10 వేల లేఖలు ఉండనే ఉన్నాయి. అదనంగా మరో ఆరు వేల లేఖలు లెక్క తేలుతున్నప్పటికీ అవి ఎక్కడ ఏ స్థితిలో ఉన్నాయో తెలియరాలేదు. ఈ లేఖలు అద్భుతమైన చరిత్రకు ఆరంభాలు. ఆయా లేఖల్లో చర్చకు పెట్టిన అనేక సైద్ధాంతిక అంశాలను మార్క్స్ ఏంగెల్స్‌లు తర్వాతి కాలంలో పరిపూర్ణంగా అభివృద్ధి చేసి ఉండలేక పోవచ్చు.కానీ అందులో ఉన్న వివరాలు తెలుసు కోవాల్సిన అవసరం ప్రపంచానికి ఉంది. ఇద్దరు కమ్యూనిస్టు యోధుల కలాల నుండి జాలు వారిన 19వ శతాబ్ది సాహిత్య ప్రస్తావనలు పరిశీలిస్తే ఇద్దరికీ ఆర్థిక రాజకీయ అంశాలతో పాటు సామాజిక సాంస్కృతిక, చారిత్రక అంశాలపై కూడా ఎంతటి పట్టు ఉందో అర్థమవుతుంది.

మార్క్స్ ఎనిమిది భాషల్లో ప్రావీణ్యం సంపాదిస్తే ఏంగెల్స్‌కు 12 భాషల్లో పట్టు ఉండేది. ప్రాచీనమైన లాటిన్ గ్రీకు భాషల్లో మార్క్స్ ఏంగెల్స్‌లు లేఖలు రాశారంటే వాళ్లకున్న సామర్థ్యం తేటతెల్లమవుతుంది. మానవాళి ఉద్ధరణకు కంకణం కట్టుకున్న ఇద్దరూ సాహిత్య ప్రఖండులే. ప్రవీణులే. షేక్‌స్పియర్ నాటకాలు మార్క్స్‌కు కంఠతా వచ్చు. ఎఖిలస్, డాంటే, బాల్జాక్ రచనలు పిలిస్తే పలికేవి. మాంచస్టర్ కేంద్రంగా పనిచేసే షిల్లర్ ఇనిస్టిట్యూట్‌కు ఏంగెల్స్ దీర్ఘకాలం అధ్యక్షుడుగా ఉన్నాడు. అరిస్టాటిల్, గోథె, లీసింగ్‌ల రచనలు నాలిక మీద ఉండేవి. విశ్వ విప్లవం సాధ్యాసాధ్యాల గురించిన చర్చతోపాటు ఇద్దరి మధ్య జరిగిన సంభాషణలు, ఉత్తర ప్రత్యుత్తరాల్లో సమకాలీన శాస్త్ర పరిజ్ఞానం, సాంకేతిక అభివృద్ధి, భూగోళ శాస్త్రం, భౌతిక రసాయన శాస్త్రాల్లో ఆవిష్కృతమవుతున్న పురోగతి, గణితం, మానవ పరిణామ శాస్త్రం గురించిన వివరాలెన్నో వీనులవిందు చేస్తాయి. ఏ విషయం కోసమైనా మార్క్స్ ఆధారపడగల ఏకైక వ్యక్తిగా ఏంగెల్స్ నిలిచాడు. మార్క్స్ ఏ సందర్భంలో ఏ రకమైన సమస్య, ప్రశ్న, మీమాంస ఎదుర్కొన్నా ఆయన పలకరించే మొదటి వ్యక్తి ఏంగెల్స్. వారిద్దరి మధ్య ఉన్నది కేవలం మేధో సంబంధం మాత్రమే కాదు. అద్వితీయమైన మానవ సంబంధం. స్నేహ బంధం. ఏంగెల్స్‌తో చెప్పుకోని సమస్యంటూ మార్క్స్‌కు లేదు. కుటుంబ ఆర్థిక అవసరాల విషయంలో ఎదురవుతున్న విషమ పరిస్థితులు మొదలు కుటుంబ సభ్యుల ఆరోగ్య సమస్యలు, రాగద్వేషాలు అన్నింటినీ ఏంగెల్స్‌తో చర్చించేవాడు మార్క్స్. మార్క్స్ అవసరాలు తీర్చటానికి ఏంగెల్స్ తనను తాను మర్చిపోయి మరీ ప్రయత్నం చేశాడు. ఏ కొద్దిపాటి సాయం అందించగలిగినా వెనకంజవేయలేదు. ఈ విధంగా మార్క్స్‌కు ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చిన పెట్టుబడి గ్రంథాన్ని పూర్తి చేయటానికి తెరవెనక నుండి ఏంగెల్స్ అందించిన సహాయం వెలకట్టలేనిది. మర్చిపోలేనిది. 1867 ఆగస్టులో పెట్టుబడి గ్రంథం తొలి సంపుటాన్ని పూర్తి చేసిన ఓ రాత్రి ఏంగెల్స్‌ను గుర్తు చేసుకుంటూ 'నీకు అన్ని రకాలుగా కృతజ్ఞుడిని. నీవు లేకపోతే పెట్టుబడి గ్రంథం పూర్తయ్యేదే కాదు' అని రాశారు.

## సోషలిస్టు సమాజ నిర్మాణం

మొదటి కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ దైనందిన వ్యవహారాల్లో 1864 నుంచీ మార్క్స్ దిగబడిపోవటం వలన ఈ గ్రంథం మరింత ఆలస్యమైంది. కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ ఏర్పాటు, నిర్మాణం, నిర్వహణలో కీలక నాయకత్వ భారం మార్క్స్‌దే అయినా ఏంగెల్స్ కూడా తనకున్న అన్ని శక్తి సామర్థ్యాలు, నైపుణ్యాలు దీని కోసం వెచ్చించారు. 1871 మార్చి 18, రాత్రి తాము ఊహించిన ఆశాసౌధం పారిస్ కమ్యూన్ రూపంలో ఆవిష్కృతమైందని, సోషలిస్టు సమాజ నిర్మాణం దిశగా తొలి అడుగులు పడ్డాయన్న వార్త విన్నప్పుడు తాము ఊహించిన దానికంటే సమాజం వేగంగానే మారుతోందని గుర్తించారు. జెన్నీ 1881లో మరణించిన తర్వాత మరింత దిగజారిపోయిన మార్క్స్ ఆరోగ్యాన్ని కుదుట పర్చటానికి లండన్‌కు దూరంగా బస చేయించాలని డాక్టర్లు సలహా ఇచ్చినప్పుడు మార్క్స్ ఏంగెల్స్‌ల మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు ఎన్నడూ ఆగలేదు. రకరకాల సందర్భాల్లో ఇద్దరినీ రకరకాల పేర్లతో ప్రవాస కార్మికవర్గ నాయకులు పిలుస్తూ ఉండేవారు. సైనిక శాస్త్రంలో ఏంగెల్స్‌కున్న ప్రావీణ్యం రీత్యా ఆయనను జనరల్ అని, మార్క్స్ గడ్డం, జుట్టు, ఇంగ్లీషు వేషధారణ రీత్యా ఆయన్ను మూర్ అని మొదటి ఇంటర్నేషనల్ కార్యవర్గ సభ్యులు పిలుచుకునేవారు. మార్క్స్ కొద్దిరోజుల్లో చనిపోతాడనగా కూతురు ఎలెనార్‌ను పిలిచి 'ఆ అసంపూర్ణంగా మిగిలిన రాత ప్రతులను ఏదో ఒకటి చేయమని చెప్పు ఏంగెల్స్‌కు' అంటారు మార్క్స్.

## మేధోమథనం

1883 మార్చిలో ఓ మధ్యాహ్న వేళ మార్క్స్‌ను కలిసిన ఏంగెల్స్ మార్క్స్ ఆఖరి కోరికకు విలువనిచ్చి అసంపూర్ణంగా మిగిలిన పెట్టుబడి రెండు, మూడు సంపుటాలను సంస్కరించి ప్రచురించే యజ్ఞాన్ని చేపట్టారు. అదే మార్క్స్‌ను ఏంగెల్స్ ఆఖరిసారి ప్రత్యక్షంగా కలుసుకోవటం. మార్క్స్ మరణించిన తర్వాత ఏంగెల్స్ మరో పుష్కరకాలం జీవించి ఉన్నారు. ఈ కాలంలో ప్రధాన సమయాన్ని పెట్టుబడి గ్రంథం పూర్తిచేసి అచ్చుకు సిద్ధం చేయటానికే వెచ్చించారు ఏంగెల్స్. తన జీవితం చివరి దశాబ్దంలో మార్క్స్‌తో కలిసి చేయాల్సిన ఉత్తర ప్రత్యుత్తరాలతో సహా అనేక పనులను చేయలేకపోయానని ఏంగెల్స్ బాధపడ్డారు. మార్క్స్ మరణానంతరం ఇద్దరి మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను ఓ వరుస క్రమంలో అమరుస్తున్న ఏంగెల్స్ నోట్లో సిగరెట్ పైపుతో అర్థరాత్రి దాటిన తర్వాత మేజా బల్ల మీద లేఖలు రాస్తూ కూర్చున్న మార్క్స్‌ను గుర్తు చేసు కుంటారు. ఈ లేఖలను భద్రపర్చే క్రమంలో తరచూ ఏంగెల్స్ మార్క్స్‌తో ముచ్చటించిన విషయాలు, చిరాకుపడ్డ సందర్భాలు, మనసారా నవ్వుకున్న చర్చలు, చేజారిన విప్లవ అవకాశాలను మదింపు వేస్తూ రేపటి విప్లవం ఎప్పుడు ఎక్కడ అంటూ సాగించిన మేధోమథనాలతో ఏంగెల్స్ జ్ఞాపకాల పొరలు రెక్కలు విచ్చుకుంటున్న పక్షుల్లా కిలకిలా రావాలు చేసేవి. ఎంత భావోద్వేగానికి లోనైనా నిద్రాణంగా ఉన్న కోట్లాదిమంది శ్రమ జీవులు దిక్కులు పిక్కటిల్లేలా రంకెలు వేస్తూ పెట్టుబడిదారీ వ్యవస్థ సౌధాన్ని కుప్ప కూల్చనున్నారన్న విషయంలో ఏ నాడూ విశ్వాసాన్ని కోల్పోలేదు. ❑

# మార్క్సిజాన్ని మరింత పరిపుష్టంగావించిన మేధావి ఆంటోనియో గ్రాంసీ



ఎస్.వెంకట్రావు

**గ్రాంసీ రెండు రకాల మేధావులున్నారని చెప్పాడు. ఒకటి, సంప్రదాయ (ట్రెడిషనల్) మేధావులు, రెండు సజీవ (ఆర్గానిక్) మేధావులు. పాలకవర్గాలతో తమకు నిమిత్తం లేదని అనుకుంటూ, ప్రజల చేత కూడా అలా భావించబడే వారు సంప్రదాయ మేధావులు. వీళ్లు పాలకవర్గాల నుండి తాము స్వతంత్రంగా ఉన్నామని అనుకుంటున్నా అదంతా మిథ్య మాత్రమే. ప్రధానంగా వాళ్లు పాలక వర్గంతో ఉండి వారికి సహకరించే పాతకాలపు లేక మితవాద మేధావులు మాత్రమే. సజీవ మేధావులు రెండో రకం. వీళ్లు ఆధిపత్య వర్గంతోపాటుగానే పుట్టి పెరుగుతారు. వాళ్ల ఆలోచనలకు ప్రతిరూపాలుగా ఉంటూ ప్రజలను సమీకరించే పని చేస్తుంటారు. ఇటువంటి మేధావులు గురించి ఆలోచిండం ముఖ్యం అని గ్రాంసీ చెప్పాడు.**

ఇటలీ కమ్యూనిస్టు పార్టీ నాయకుడైన గ్రాంసీ గొప్ప మార్క్సిస్టు మేధావి, రచయిత, జర్నలిస్టు. ఫాసిస్టు ముస్సోలినీ జైలులో చివరి 11 ఏళ్ల దుర్భరమైన జీవితం గడిపిన గ్రాంసీ 1937లో 46 ఏళ్ల ప్రాయంలో జైలులోనే మరణించాడు. జైలులో ఉండగా ఆయన దాదాపు 3,000 పేజీల రచనలు, 32 నోట్‌బుక్‌లు రాసి రహస్యంగా జైలు బయటికి పంపించాడు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తరువాత వాటిని ఇటలీ భాషలో ప్రచురించారు. 1970లో గానీ అవి ఇంగ్లీషులో ప్రచురించబడ లేదు. ఇతర భాషల్లో ముఖ్యంగా తెలుగులో ఆయన రచనలు తక్కువగానే వచ్చాయి. పెట్టుబడిదారీ వ్యవస్థ పాతుకుపోయిన కొత్త పరిస్థితుల్లో విప్లవపోరాటం ఎలా నడపాలో గ్రాంసీ ప్రధానంగా వివరించాడు. 20వ శతాబ్దపు పశ్చిమ ఐరోపా సమాజంలో వచ్చిన విప్లవాత్మక మార్పులను విశ్లేషించిన మొట్ట మొదటి మార్క్సిస్టు సిద్ధాంత వేత్త ఆయన. బూర్జువా విలువలకు వ్యతిరేకంగా అంటే సైద్ధాంతిక-సాంస్కృతిక రంగంలో పోరాటాల ప్రాధాన్యతను వివరించాడు. ఈ రోజు ప్రపంచ రాజకీయాలు మితవాదం వైపు పయనిస్తున్న తరుణంలో మితవాద దాడిని ఎదుర్కొని, రాజకీయాలను ప్రత్యామ్నాయ



మార్గం పట్టించాల్సిన బాధ్యత కార్మిక వర్గం మీద ఉన్నది. ఈ కర్తవ్య నిర్వహణలో కార్మికవర్గానికి ఆంటోనియో గ్రాంసీ రచనలు ఎంతగానో ఉపయోగపడతాయి. ఆయన రచనలను స్థూలంగా నాలుగు భాగాలుగా వివరించవచ్చు. మొదటిది, ఆర్థికవాదం (ఎకనామిజం), లేక నియతివాదం (డిటర్మినిజం) మీద కార్మికవర్గ పోరాటం. రెండవది, మొత్తం సమాజం మీద కార్మికవర్గం ఆధిపత్యం (హెజిమోనీ) సాధించడం. మూడవది, కార్మికవర్గం సమాజం మీద ఆధిపత్యం (హెజిమోనీ) సాధించేందుకు ఉన్న సాధనాలు. నాల్గవది, కార్మికవర్గాన్ని ఎడ్యుకేట్ చేయడం.

**ఆర్థికవాదం (ఎకనామిజం)**

మార్క్స్-ఏంగెల్స్ సాంస్కృతిక, సైద్ధాంతిక అంశాలను వివరించేటప్పుడు సమాజాన్ని పునాది, ఉపరితలం అనే భాగాలుగా విభజించి వర్ణించారు. ఏ సమాజ నిర్మాణంలోనైనా రెండు భాగాలుంటాయి. ఒకటి పునాది. రెండవది ఉపరితలం. ఒకానొక సమాజంలోని ఉత్పత్తి శక్తులూ, ఉత్పత్తి జరిగేటప్పుడు వాటి మధ్య ఏర్పడే సంబంధాలు అంటే ఆర్థిక సంబంధాలు సమాజపు పునాదిగా ఉంటాయి. ఈ పునాదిపై ఆధారపడిన

ఉపరితలంలో రాజకీయ, సామాజిక, సాంస్కృతిక అంశాలు అంటే రాజ్యాంగ యంత్రం, మతం, సంప్రదాయాలు, సంస్కృతి, కళలు వగైరాలు ఉంటాయి. పునాదికీ, ఉపరితలానికీ మధ్య గతితార్కిక సంబంధం ఉంటుందనీ, వర్గపోరాటం పునాదిలో తెచ్చే మార్పులు అంతిమంగా ఆ సమాజ గమనానికి కారణమవుతాయని మార్క్స్-ఏంగెల్స్ చెప్పారు. అయితే, దీన్ని కొందరు మార్క్సిస్టులు యాంత్రికంగా తీసుకుని సమాజ పురోగమనంలో పునాదే, అంటే ఆర్థిక సంబంధాలే ప్రధానం, ఉపరితలంలోని అంశాలన్నీ దానిపై ఆధారపడి నడుస్తాయని చెప్పడం ప్రారంభించారు. అంటే పునాదిలో మార్పులు జరిగితే ఉపరితలంలోని రాజకీయ, సామాజిక, సాంస్కృతిక విషయాలు వాటంతటవే మారుతాయని భావించారు. అంటే సామాజిక మార్పును వారు 'ఆర్థికవాదం' కిందకు కుదించేశారు. గ్రాంసీ ఈ ఆర్థిక వాదాన్ని తీవ్రంగా విమర్శించాడు. ఈ ఆర్థికవాదాన్ని పుణికిపుచ్చుకున్న వారు సామాజిక పరివర్తన గురించి చెప్పేటప్పుడు కేవలం ఆర్థిక పునాది మీద కేంద్రీకరిస్తారు. సామాజిక మార్పుకు దోహదం చేసే ఇతర అంశాలు అంటే ఉపరితలంలో ఉండే సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అంశాలను విస్మరిస్తారు అని గ్రాంసీ పేర్కొన్నాడు. నిజానికి మార్క్స్ ఏంగెల్స్ కూడా ఉపరితలంలోని చైతన్యానికి సంబంధించిన అంశాల ప్రాధాన్యతను ఏనాడూ తక్కువ అంచనా వేయలేదు. మార్క్స్ మరణించిన తరువాత ఏంగెల్స్ 1890 సెప్టెంబర్‌లో జె. బ్లాక్‌కు రాసిన లేఖలో ఈ విషయాలను వివరించాడు. అయితే పశ్చిమదేశాల్లో స్థిరపడిపోయిన పెట్టుబడిదారీ వ్యవస్థ తన వర్గాధిపత్యాన్ని మొత్తం సమాజం మీద చెలాయించడానికి ఈ ఉపరితలాంశాలను ఎలా ఉపయోగించుకుంటున్నదో లెనిన్ తరువాతి నాయకత్వం గ్రహించలేకపోయింది. దీని గురించి గ్రాంసీ ప్రతిభావంతంగా వివరించాడు.

**ఆధిపత్యం (హెజిమోనీ)**

గ్రాంసీ ప్రతిపాదించిన సూత్రీకరణల్లో 'ఆధిపత్యం' (హెజిమోనీ) అనేది అత్యంత ముఖ్యమైన, అధ్యయనం చేయాల్సిన భావన. ఆధిపత్యం అనే పదాన్ని ఆయన సాధరణ అర్థంలో వాడలేదు. ఏదైనా పాలకవర్గం తన క్రింది వర్గాలపై ఎలా పరిపాలన సాగిస్తుంది అని చెప్పడానికి గ్రాంసీ ఈ 'ఆధిపత్యం'(హెజిమోనీ) అన్న పదాన్ని ఉపయోగించాడు. నిజానికి ఆధిపత్యం అనే భావన మార్క్సిస్టు పరిభాషలో అంతకుముందు నుండి వస్తున్నదే. కార్మికవర్గం ఇతర పీడిత వర్గాలకు నాయకత్వం వహించడాన్ని లెనిన్ కార్మికవర్గ ఆధిపత్యంగా వర్ణించాడు. "వర్తమాన సమాజంలో ఏకైక నిరంతర విప్లవవర్గంగా కార్మిక వర్గం మొత్తం ప్రజల ప్రజాతంత్ర విప్లవానికి నాయకత్వం వహించాలి. అంటే మొత్తం శ్రామికులు, దోపిడీకి గురవుతున్న ప్రజలు తమను పీడిస్తున్న, దోపిడీ చేస్తున్న వర్గాలపై జరిపే పోరాటానికి నాయకత్వం వహించాలి" అని లెనిన్ చెప్పాడు. గ్రాంసీ ఈ లెనినిస్టు భావనను మరింత పరిపుష్టం గావించాడు. గ్రాంసీ చెప్పిన 'ఆధిపత్యం' (హెజిమోనీ) అంటే పీడిత వర్గాలపై పాలక వర్గాల నైతిక, మేధోపరమైన నాయకత్వం అని అర్థం. ఇటువంటి నాయకత్వం వల్ల పీడిత వర్గాలు పాలక వర్గాల నాయకత్వాన్ని అంగీకరిస్తాయి. 1870 తరువాత పశ్చిమ దేశాల్లో ఏర్పడిన బూర్జువా ప్రభుత్వాలు నిరంకుశ అధికార యంత్రాంగం ద్వారా కాకుండా ఈ విధమైన సాంస్కృతిక ఆధిపత్యం ద్వారా, ఒక రకంగా తమ పాలనను పీడిత వర్గాలు అంగీకరించేట్లు ఒప్పించడం ద్వారా పరిపాలన సాగిస్తూ వస్తున్నాయని గ్రాంసీ పేర్కొన్నాడు. పశ్చిమ దేశాల్లోనే కాకుండా బూర్జువా పాలన స్థిరపడిన దేశాలన్నింటా ఇదే పరిస్థితిని మనం చూడగలం. ఆధిపత్య వర్గాలు సమాజాన్ని రెండు రాజకీయ రూపాల్లో నియంత్రిస్తాయని గ్రాంసీ చెప్పాడు. మొదటిది, అదుపు (డోమినేషన్). ఇందులో నేరుగా ప్రజలను పోలీసులు, సైన్యం ఇతర అధికార యంత్రాంగంతో భౌతికంగా అణచివేస్తుంది. రెండవది ఆధిపత్యం (హెజిమోనీ). ఇందులో సైద్ధాంతికంగా, మరీ ముఖ్యంగా ఒప్పించడం ద్వారా నియంత్రిస్తుంది. ఎంతటి నిరంకుశ ప్రభుత్వమైనా కేవలం రాజ్యాధికారం ద్వారా, పోలీసులు, సైన్యం ద్వారా పరిపాలించలేదు. దీర్ఘకాలంలో అది సుస్థిరంగా ఉండాలంటే ప్రజల సమ్మతిని, మద్దతునూ పొందాలి. ఈ సమ్మతిని వారిపై సైద్ధాంతిక ఆధిపత్యం (హెజిమోనీ) ద్వారా పాలకవర్గాలు పొందుతాయని గ్రాంసీ వివరించాడు. గ్రాంసీ దృష్టిలో 'ఆధిపత్యం' అంటే కొన్ని విలువలు, ధోరణులు, నమ్మకాలు, నైతికతలను మొత్తం సమాజం మీద రుద్దడం ద్వారా అధికార సంబంధాల్లో యథాతథ స్థితిని కొనసాగించడం. అంటే ప్రజల దైనందిన జీవితంలోని అన్ని రంగాల్లోకీ ఈ విలువలను చొప్పించడం అనేది ఒక నిరంతర కార్యక్రమంగా జరుగుతుంది. ప్రజా సమూహం ఈ రకమైన చైతన్యాన్ని పుణికి పుచ్చుకోవడం వల్ల అది సాధారణ 'విజ్ఞత'గా మారి పోతుంది. ఆ విధంగా పాలకవర్గాల తత్వం, సంస్కృతి, నైతికవిలువలు అన్నీ కూడా సహజమైన సామాజిక లక్షణాలుగా మారిపోతాయి. 'ఆధిపత్యం' అనేది సమాజ ఉపరితలం ద్వారా నియంత్రించే ఒక రూపం అని గ్రాంసీ చెప్పాడు. ఉపరితలాన్ని ఆయన అణచివేత జరిపేవి, ఒప్పించేవి అనే రెండు భాగాలుగా విభజించాడని చెప్పుకున్నాం. ప్రభుత్వం, పోలీసు, సైన్యం, న్యాయవ్యవస్థ వంటి అణచివేత సంస్థలను రాజ్యం లేక 'రాజకీయ సమాజం' అని పిలిచాడు. ప్రత్యక్షంగా అణచివేతకు పాల్పడకుండా ఒప్పించడం ద్వారా పనిచేసే సంస్థలు అంటే మత సంస్థలు, పాఠశాలలు, ట్రేడ్ యూనియన్‌లు, రాజకీయ పార్టీలు, సాంస్కృతిక సంస్థలు, క్లబ్బులు, కుటుంబం మొదలైన వాటిని 'పౌర సమాజం' అన్నాడు. గ్రాంసీ ఈ రెంటినీ విడదీసి చెప్పినప్పటికీ ఈ రెండూ

అంటే సామాజిక ఆధిపత్యం, రాజకీయ ప్రభుత్వం ఒకే 'సమగ్ర రాజ్యం'లో భాగమే. రాజ్యం అన్నది రాజకీయ సమాజం, పౌర సమాజాల కలయిక అన్నమాట.

**కార్మికవర్గం ఆధిపత్యం (హెజిమోనీ) సాధించే సాధనాలు**

గ్రాంసీ చెప్పినదాని ప్రకారం పాలక వర్గాలు ప్రజల సమ్మతితోనే తమ వర్గాధిపత్యాన్ని కొనసాగించ గలుగుతుంటే, కేవలం చివరి అస్త్రంగా మాత్రమే వారు ప్రత్యక్ష అణచివేత యంత్రాంగాన్ని ఉపయోగిస్తుంటే అప్పుడు పాలక వర్గాలను అధికారం నుంచి తొలగించాలనుకుంటున్న విప్లవవర్గాలు ఏం చేయాలి ? పాలకులకూ, పాలితులకూ మధ్య ఏర్పడిన సైద్ధాంతిక బంధం ద్వారా పాలక పెట్టుబడిదారీ వర్గాలు తమ ఆధిపత్యాన్ని కొనసాగించగలుగుతుంటే విప్లవ వర్గాల వ్యూహం ఎలా ఉండాలి? దానికి గ్రాంసీ ఇలా సమాధానం చెప్పాడు... పాలక వర్గాల సైద్ధాంతిక 'ఆధిపత్యం'(హెజిమోనీ)ని ఛేదించాలనుకునే వారు పాలకవర్గాలకు వ్యతిరేకంగా "ప్రతి-ఆధిపత్యం" (కౌంటర్ హెజిమోనీ) నిర్మించాలి. అంటే వారు సమాజ నిర్మాణంలో మార్పునూ, సైద్ధాంతిక మార్పునూ ఒకే పోరాటంలో భాగంగా చూడాలి. వర్గపోరాటంలో పెట్టుబడికీ, కార్మికవర్గానికీ ఘర్షణ కేంద్రంగా ఉంటుంది. కానీ, పీడించబడుతున్న వర్గాలు తమను పరిపాలించేందుకు తమ రాజకీయ, ఆర్థిక యజమానులకు ఉన్న హక్కును ప్రశ్నించాలంటే, అలా ప్రశ్నించే చైతన్యం వారికి కలగాలి. అటువంటి చైతన్యం వారిలో సైద్ధాంతిక పోరాటం ద్వారా మాత్రమే వస్తుంది. దానికోసం పౌర సమాజంలో విజ్ఞత (కామన్ సెన్స్) రూపంలో స్థిరపడిపోయిన ప్రజా చైతన్యాన్ని సవాలు చేయాలి. అయితే, ప్రజల్లో స్థిరపడిపోయిన చైతన్యాన్ని అధిగమించడం అంత తేలికైన పని కాదు. ఎందుకంటే పాలక వర్గాల సైద్ధాంతిక ఆధిపత్యం వల్ల సమాజంలో జరుగుతున్న దాన్ని 'విజ్ఞతగా' మెజారిటీ ప్రజలు అంగీకరిస్తారు. 'సమాజాన్ని నడపడానికి అదొక్కటే మార్గం' అనుకుంటారు. జరుగుతున్న పరిణామాల పట్ల ఫిర్యాదులు, అసంతృప్తులు ఉండవచ్చు. ప్రజలు మరింత మెరుగైన పాలన, సంస్కరణలు కావాలని కోరుకోవచ్చు. కానీ, సమాజంలోని మౌలికమైన నమ్మకాలు, విలువలు తటస్థంగా ఉన్నాయనీ, లేక వర్గ సమాజం అంతటికీ అవి సాధారణంగా వర్తిస్తాయనీ వారు భావిస్తారు. వాళ్లు రొట్టెల ఫ్యాక్టరీ నాది అనుకోరు. ఒకటో రెండో రొట్టె ముక్కలు అదనంగా లభిస్తే చాలు అనుకుంటారు. ఇలా సామాజిక విజ్ఞత (కామన్‌సెన్స్) రూపంలో చెలామణీ అయ్యే ఈ 'ఆధిపత్య' భావజాలాన్ని 'ప్రతి-ఆధిపత్య' భావజాలంతో సవాలు చేయాలి. 'ప్రతి-ఆధిపత్యం' అనేది నిజమైన 'ఆధిపత్యం' కాదు. కార్మికవర్గం లేక విప్లవ వర్గాలు తమ 'ఆధిపత్యాన్ని' (హెజిమోనీని) నెలకొల్పడానికి ఆర్థికంగా, రాజకీయంగా, సైద్ధాంతికంగా సిద్ధం కావడమే 'ప్రతి-ఆధిపత్యం'.

'ప్రతి-ఆధిపత్యాన్ని' నిర్మించడంలో మేధావుల పాత్రకు గ్రాంసీ అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. కార్మికవర్గ విప్లవ పోరాటానికీ, పురోగామి మేధావులకూ ఉండాల్సిన సంబంధాలను గురించి ఆయన విపులంగా చర్చించాడు. పురోగామి మేధావులను ఆయన రెండుగా విభజించాడు. మొదటి రకం, ఇతర వర్గాల నుండి వచ్చే ప్రజాతంత్ర మేధావులు. రెండు, కార్మిక వర్గ పోరాటం నుండి పుట్టుకు వచ్చిన మేధావులు. ఈ రెండు రకాలూ కలిసి విప్లవ కార్మికవర్గ ఉద్యమం అవుతారు. బూర్జువా వర్గాన్ని అధికారం నుండి తొలగించే చారిత్రక కర్తవ్యాన్ని కార్మిక వర్గం నెరవేర్చాలంటే వారు మూడు రంగాల్లో అంటే ఆర్థిక, రాజకీయ, సైద్ధాంతిక రంగాల్లో సమగ్ర పోరాటాం చేయాలి. ఈ మూడు రంగాల్లో సమగ్రంగా జరిగే పోరాటమే వర్గ పోరాటం. ఏదో ఒక రంగంలో మాత్రమే చేసే పోరాటం పాక్షిక పోరాటం అవుతుంది గానీ సమగ్ర పోరాటం కాదు. మేధావులు ఒక ప్రత్యేక వర్గం కాదని గ్రాంసీ చాలా స్పష్టంగా చెప్పాడు. వాళ్లు అటు పాలకవర్గంలో గానీ, కార్మికవర్గ నాయకత్వంలోని శ్రామిక వర్గంలో గానీ అంతర్భాగంగా ఉంటారు. ఈ రెండువర్గాల్లో అంటే అటు పాలకవర్గంలో ఇటు పాలిత వర్గంలో ఉండే మేధావుల మధ్య ఐక్యత-పోరాటం నిరంతరం సాగుతుంటుంది. ఈ ఐక్యతా-పోరాటమే ప్రజాస్వామ్యం, సోషలిజం కోసం జరిగే పోరాటంలో మేధావుల పాత్రను నిర్ణయిస్తుంది.

గ్రాంసీ రెండు రకాల మేధావులున్నారని చెప్పాడు. ఒకటి, సంప్రదాయ (ట్రెడిషనల్) మేధావులు, రెండు సజీవ (ఆర్గానిక్) మేధావులు. పాలకవర్గాలతో తమకు నిమిత్తం లేదని అనుకుంటూ, ప్రజల చేత కూడా అలా భావించబడేవారు సంప్రదాయ మేధావులు. వీళ్లు పాలకవర్గాల నుండి తాము స్వతంత్రంగా ఉన్నామని అనుకుంటున్నా అదంతా మిథ్య మాత్రమే. ప్రధానంగా వాళ్లు పాలక వర్గంతో ఉండి వారికి సహకరించే పాతకాలపు లేక మితవాద మేధావులు మాత్రమే. సజీవ మేధావులు రెండో రకం. వీళ్లు ఆధిపత్య వర్గంతోబాటుగానే పుట్టిపెరుగుతారు. వాళ్ల ఆలోచనలకు ప్రతిరూపాలుగా ఉంటూ ప్రజలను సమీకరించే పని చేస్తుంటారు. ఇటువంటి మేధావులు గురించి ఆలోచించడం ముఖ్యం అని గ్రాంసీ చెప్పాడు. సమాజంలో పాలకవర్గాల వ్యవహారాలు చక్కబెట్టడానికి విద్యా విధానం ద్వారా వారు ఉత్పత్తి చేయబడతారు. ఈ మేధావుల ద్వారానే పాలక వర్గాలు మొత్తం సమాజం మీద తమ 'ఆధిపత్యం' (హెజిమోనీ)ని చెలా యిస్తాయి. పాలకవర్గాలను అధికారం నుండి తొలగించాలను కునే వారు 'ప్రతి-ఆధిపత్యం' నిర్మించాలి. అంటే చెలామణిలో ఉన్న ఏకాభిప్రాయాన్ని సవాలు చేయాలి, 'విజ్ఞత' పేరుతో సాగుతున్న భావజాలాన్ని ఎదుర్కోవాలి. ఎలా? దీనికి గ్రాంసీ చెప్పిందేమంటే.. కార్మికవర్గం సంప్రదాయ మేధావుల్లో గణనీ యమైన భాగాన్ని తనవైపు

# దేశాన్ని సానిటైజ్ చేద్దాం!



ఈ దేశానికి కొత్త వైరస్ సోకింది.
జాగ్రత్తగా ఉండండి !
ఇది ప్రశ్నను కాపుకాచి హత్య చేస్తుంది
ముస్లింలు, మైనారిటీలు, దళితులపై
బాహాటంగానే దాడి చేస్తుంది
ఊపిరి పీల్చుకుంటే వదలనివ్వదు
వదిలితే పీల్చుకోనివ్వదు ఈ వైరస్!
గడ్డకట్టే చలిలో అక్కడ
రైతులకు రక్త పరీక్షలు చేయిస్తుంది
బ్యాంకులో నాలుగు డబ్బులుంటే చాలు
లాగేసుకుని, నిన్ను రోడ్డున పడేస్తుంది
కాపలాదారు వైరస్ రూపంలో వచ్చి
చేతిలో చిల్లి గవ్వ ఉండనివ్వదు
వైరస్ 'చాయ్ వాలా'గా వచ్చేసి
మన చాయ్ మనల్ని తాగనివ్వదు
ఈ వైరస్ ఇంటికి ఎలా వస్తుందో
మనకే తెలియట్లేదు–
గ్యాస్ బండతో వస్తోందా?
బండిలో పెట్రోలుతో వస్తోందా?
కూరగాయలతో
వస్తోందా?
సరుకులతో
వస్తోందా?
జనాలతో కలిసి మెలసి ఉండొద్దని
చెపుతోంది వైరస్
కులాల పేరుతో, మతాల పేరుతో
వేరు చేస్తుంది వైరస్ –
మనుషులంతా ఒక్కటే అన్నవాణ్ణి
పక్కదేశం పొమ్మంటుంది వైరస్
ఆవుపేడ రాసుకొని ఈ వైరస్,
ఆవు మూత్రం తాగుతుంది!
నినాదాల్లేవ్, హక్కుల్లేవ్, పోరాటాల్లేవ్
ఎక్కువ మాట్లాడితే
నువ్వు ఈ దేశ పౌరుడవని రుజువేంటి?
అని ప్రశ్నిస్తుంది వైరస్!
దేశభక్తి చెట్టు పేరు చెప్పి కాయలు
అమ్ముకుంటుంది
చదువుకున్న వారి చదువులన్నీ
ఈ వైరస్‌తో చంకనాకి పోతాయ్
అబద్ధాలఫ్యాక్టరీలో
ఉన్నతాధికారులవుతారు.
చెవుల్లో పూలు పెట్టి వైరస్,
వీరితో భజన చేయిస్తుంది
శరీర భాగాల్లో కాకుండా ఈ వైరస్,
కేవలం మెదడ్లలో తిష్టవేస్తుంది –
ఆలోచనల్ని తొలిచేసి డొల్లగా చేస్తుంది
రోడ్డు మీద మనుషులు తిరగాలి
కానీ, ఎవరిలోనూ మనిషతత్వం
ఉండకూడదు
మానవత్వం మిగలకూడదు
అయితే, మరి ఇప్పుడు ఏం చేద్దాం?
నువ్వూ, నేనూ సానిటైజర్ రుద్దుకుంటూ
కూర్చుంటే కాదురా తమ్ముడూ!
లే, దేశాన్నికేకెయ్, అందర్నీ పిలు
ఈ దేశాన్ని సానిటైజ్ చేయాల్సి ఉంది!
రండి! ఈ దేశాన్ని సానిటైజ్ చేద్దాం!!
రండి రండి!! ❑

**- డాక్టర్ దేవరాజు మహరాజు,**
**కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు**
**గ్రహీత, బయోలజీ ప్రొఫెసర్**

---

తిప్పుకోవడమే కాకుండా కార్మికవర్గ ఉద్యమం తనదైన 'సజీవ మేధావులను' తయారు చేసుకోవాలి. గ్రాంసీ సైద్ధాంతిక పోరాటం గురించి చెప్పిన విషయాలు కేవలం చైతన్యాన్ని పెంపొందించడానికి మాత్రమే పరిమితం కాలేదు. చైతన్యాన్ని మార్చాలని, సోషలిస్టు చైతన్యాన్ని సృష్టించాలని చెప్పాడు. కార్మికవర్గ దైనందిన జీవితానుభవాల ద్వారా అటువంటి చైతన్యం పొందేందుకు తోడ్పడాలని చెప్పాడు. అందువల్ల మేధావుల కృషి ఎక్కడో నాలుగు గోడల మధ్య కాకుండా ప్రజల దైనందిన జీవితంలో భాగంగా సాగాలని చెప్పాడు. 'కొత్త మేధావులను ఎంతబాగా విషయాలు చెప్పగలుగుతున్నారన్న దాన్ని బట్టి కాకుండా దైనందిన జీవితంలో నిర్మాతలుగా, ఆర్గనైజర్స్‌గా వారి పనిని బట్టి నిర్ణయించాలి. నిరంతరం వెంట బడి పనులు జరిగేట్లు చూసేవారే గానీ కేవలం ఉపన్యాసాలు చెప్పేవారు సజీవ మేధావులు కాదు' అని ఆయన వివరించాడు. దైనందిన జీవితంలో చురుకుగా పాల్గొనే కార్మికవర్గ మేధావు లను తయారు చేసుకోవడం ద్వారా ప్రస్తుత సామాజిక సంబం ధాలను బద్దలుగొట్టే 'ప్రతి–ఆధిపత్యం' ఏర్పాటుకు తోడ్పడాలి అని చెప్పాడు. ఆ విధంగా ఆయన సిద్ధాంతాన్ని ఆచరణకు ముడిపెట్టాడు. కార్మికవర్గం నుండి ఇతర పీడిత వర్గాల నుండి మేధావులను తయారు చేయడంలో అనియత విద్య ఎంతగానో తోడ్పడుతుందని గ్రాంసీ చెప్పాడు. అందువల్లనే గ్రాంసీ జైలు రచనల్లో ఎక్కువ భాగం విద్యా విధానం ఎలా ఉండాలి అన్నదానికి కేటాయించాడు.

### కార్మికవర్గాన్ని ఎడ్యుకేట్ చేయడం

ఒక దేశంలో సమాజం పాలక వర్గాల ఆధిపత్యంలో ఉన్నంత కాలం పాలకవర్గాల ప్రయోజనాలు నెరవేర్చే మేధావులను తయారుచేయడానికే విద్యారంగం ఉపయోగపడుతుంది. అయితే కార్మికవర్గం, ప్రజాతంత్ర శక్తులు కార్మివర్గ, ప్రజాతంత్ర మేధావులను తయారు చేసే విద్యావ్యవస్థను రూపొందించేందు కు ఈ వ్యవస్థలో అనేక అవకాశాలు ఉన్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రాంసీ విద్యారంగంలో అనేక సూచనలు చేశాడు. మొదటిది, విద్యారంగం బాధ్యతను ప్రభుత్వం తీసు కునేట్లు చేయాలి. దానివల్ల ఆ వ్యవస్థ ఉత్పత్తి చేసే మేధావులు మొత్తం సమాజానికి సేవ చేస్తారు. రెండు, విద్యార్థులకు ప్రాకృతిక, సామాజిక సైన్సును బోధించడంతోపాటు ఏదో ఒక వృత్తిని నేర్పించే పాఠ్య విధానం ఉండాలి. ఈ విషయంలో మార్క్స్ చెప్పిన సూచనలనే గ్రాంసీ మరింత విస్తృతపరిచాడు. ❑

**(జనవరి 22 గ్రాంసీ జయంతి)**

# సాహిత్య సవ్యసాచి కేవీయార్



**పుస్తకాలు - పరిచయాలు**

- రాఘవ శర్మ

"నా ఆకాశం ఈ నేల మీదనే. ఈ నా జనమే నా ప్రాణ పంచకం. వీరి ఉన్నతి ఒక్కటే ధ్యేయం. అందుకోసమే నాశక్తి, నా తీరిక, నా కాలం, నా సమస్తం" అని ప్రకటించిన కె.వి. రమణారెడ్డి(కేవీయార్) 'సర్వం సామాజికమ్ జగత్' అనే ఒక ఉచ్ఛస్థితికి వచ్చిన ఒక మహామనీషి. తాను కవినా, అనువాదకుడినా, సంపాదకుడినా, సాహిత్య విమర్శకుడినా, సాహిత్య జీవిత చరిత్రకారుడినా అన్న దానితో పనిలేదు. ఆయనొక సాహిత్య గంభీరుడు, ఒక సాహిత్య సవ్యసాచి. ఆధునిక విమర్శను చారిత్రక భౌతికవాద వెలుగులో కొత్తదారులు పట్టించిన కేవీయార్ సాహిత్య కృషిని, జీవితాన్ని అంచనా వేయడం అంత తేలికైన పనికాదు. దశాబ్దాలపాటు కేవీయార్‌తో సన్నిహితంగా ఉన్న ఆచార్య వకుళాభరణం రామకృష్ణ ఆయన కృషిని, జీవితాన్ని వంద పేజీల్లో అందించగలిగారు. సాహిత్య అకాడమీ ఇటీవల అచ్చేసిన 'భారతీయ సాహిత్య నిర్మాతలు– కె.వి.రమణారెడ్డి' అన్న ఈ చిన్న పుస్తకం ఇతర – భారతీయ భాషల్లోకి అనువాదం కానుంది. నెల్లూరు జిల్లాలో గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చిన కేవీయార్ బాల్యంలోనే గొప్ప భావుకుడు, పుస్తక పిపాసి. 'క్విట్ ఇండియా' ఉద్యమంలో టెలిఫోన్ తీగలు తెంచడానికి యత్నించడం, సుభాస్ చంద్రబోస్ పట్ల ఆరాధనా



**రాచమల్లు రామచంద్రా రెడ్డికి రాసిన లేఖలో 'నా లోపాలను మీరు విస్మరించుకోవాలని నేను కోరుకోను. క్లిష్టాన్వయం కౌగిలి నుంచి నేనిప్పటికీ బయల్పడలేదు. ఎక్కువ భావనను తక్కువ పదాల్లో, ఒక్కోసారి కూరుతానని తుమ్మల వెంకటరామయ్య కూడా ఒకసారి అన్నాడు. కాబట్టి నా లోపాలను మీరు విమర్శించాలి. నా ప్రోస్లో కూడా మీరు సూచించిన లోపాలను తొలగించుకొనేందుకు యత్నిస్తాను' అని రాయడం కేవీయార్ నిజాయితీ, చిత్తశుద్ధికి నిదర్శనం.**

భావన కళాశాల జీవితానికి ముందే మొదలైంది. నెల్లూరులోని కళాశాల విద్యార్థిగా వామపక్ష రాజకీయాల వైపు మొగ్గు చూపారు. ఆంధ్ర విశ్వ విద్యాలయంలో చదువుతున్నప్పుడే అనిశెట్టి సుబ్బారావు పరిచయంతో రచనలు సాగిస్తూ, అభ్యుదయ రచయితల సంఘంలో చేరారు. వాల్తేరులో చదువు ముగించి, ఐ.ఏ.ఎస్. రాత పరీక్ష రాసి నెగ్గినా, వామపక్ష రాజకీయ నేపథ్యంతో ఇంటర్వ్యూలో ఎంపిక కాలేదు. తొలుత ఒంగోలులోను, ఆ తరువాత కావలిలోనూ చరిత్ర లెక్చరర్గా చేరారు. ఆయన సతీమణి శారదాంబ ఆయనకు 'పూర్ణాంగి' యే! చరిత్ర, తత్వశాస్త్రంలో ఆయనకున్న పరిజ్ఞానం, భారతీయ, పాశ్చాత్య సాహిత్యంపై వెలువడ్డ పరిజ్ఞానం వల్ల ఆయన రాసిన సాహిత్యజీవిత చరిత్రలు సమగ్రతను సంతరించుకున్నాయి. కేవీయార్ రాసిన 'కవికోకిల'ను ప్రముఖ భాషాశాస్త్రవేత్త జి.ఎన్.రెడ్డి తెలుగు సాహిత్యంలో 'మాస్టర్ పీస్'గా అభివర్ణించారు. గురజాడపై రాసిన 'మహోదయం' ఒక సమగ్ర రచన. దీన్ని ఆంధ్ర జాతీయ పునర్వికాసాన్ని వివరించడంగా కేవీయారే చెప్పుకున్నారు. గురజాడ నవ్యుడే కానీ, గతాన్ని విస్మరించిన నవ్యుడు కాదంటారు. ఆయన 'ప్రథమాధునికుడు' అని కూడా కీర్తించారు. గురజాడకు నాటకం వల్లనే ఖ్యాతి వచ్చిందంటారు. జాతీయోద్యమం బలం పుంజుకుంటున్న వేళ భారత సమాజానికి భవిష్యత్తు సూచికగా 'దేశభక్తి' గేయం

రాశారంటారు. 'పండిత'కూటమిలో గురజాడ ఒక 'పితూరి' అంటారు కేవీయార్. 'మహోదయం' గురజాడపై ఒక విజ్ఞాన సర్వస్వం అంటారు రారా. హిందీ, బెంగాలి, తమిళం, మలయాళం, కన్నడ, ఒరియా, మరాఠీ భాషలలోని ప్రముఖ సాహిత్య కారులను 'ఆధునిక భారత సాహిత్యకర్తలు'లో కేవీయార్ పరిచయం చేశారు. వీరిలో ప్రేమ్ చంద్, రవీంద్ర నాథ్ టాగూర్, బంకించంద ఛటర్జీ, హరినారాయణ్ ఆప్టే, కందుకూరి, గురజాడ, సుబ్రహ్మణ్య భారతి వంటి సాహితీ ఉద్దండులున్నారు. తెలుగు సాహిత్యంలోని కొందరు ప్రముఖుల జీవిత, సాహిత్య విశేషాలను ఆంగ్లంలో రాశారు. 'ఆధునిక యుగంలో కవిలోకం'లో లబ్ధ ప్రతిష్ఠులైన కవుల గురించి పరిచయం చేశారు. శ్రీశ్రీ గురించి విలువైన సమాచారాన్ని సేకరించి కూడా. ఆయన జీవిత చరిత్ర రాయకుండా వదిలేశారు. అలాగే పుచ్చలపల్లి సుందరయ్య గురించి కూడా. 'ఆధునికాంధ్ర చరిత్ర-నిర్మాణ ప్రయత్నం'లో సాహిత్యం గురించిన అన్ని ప్రక్రియలపైనా రాశారు. రమణారెడ్డి సాహిత్య ప్రస్థానంలో శ్రీశ్రీ సమగ్ర రచనల సంపాదకత్వం ఒక మైలు రాయి. శ్రీశ్రీ 'అనంతం' ఒక ప్రణాళిక లేకుండా రాసిన 'అగమ్య గోచర' గ్రంథంగా కేవీయార్ వ్యాఖ్యానించారు. కేవీయార్ సాహిత్యపరమైన కొన్ని వందల ఉత్తరాలు రాశారు.


**అలుపెరగని లేఖకుడు**

విరసం ఏర్పడినప్పుడు శ్రీశ్రీ అధ్యక్షుడుగా, కేవీయార్ కార్య దర్శిగా ఎన్నికయ్యారు. సికింద్రాబాద్ కుట్ర కేసులో 1974 జూన్ 24న అరెస్టై జైల్లో ఉన్న మూడు నెలల్లో రాసిందే 'మూణెల్ల ముచ్చట' డైరీ. ఎమర్జెన్సీ విధించినప్పుడు కూడా కేవీయార్ను జైల్లో పెట్టిన సందర్భంగా రాసిన 'డిటెన్యూ డైరీ' ఒక సామాజిక, సాహిత్య విషయ గ్రంథం. జనవాణి, జనశక్తి, విశాలాంధ్ర, అరుణ తార పత్రికల్లో వివిధ శీర్షికలు రాశారు. రవీంద్రుడి కథల్లో కొన్నిటిని 'ఆటబొమ్మలు' పేరుతో అనువాదం చేశారు. అలాగే హెరీవర్డ్ ఫాస్ట్ 'ద లాస్ట్ హారిజాన్' నవలను 'మానధనులు' పేరుతో అనువాదం చేశారు. కేవీయార్ ఆరు స్వీయ కవితా సంకలనాలను వెలువరించారు. 'సూరీడు మావోడు' కవితా సంకలనంలో 'మరచిపోయిన మందహాసం' ఒక మంచి కవిత. 'గుమ్మడి పాదులా కళకళ్ళాడాల్సిన పసరు, పచ్చనాగల ప్రియమైన ఈ ఒక్కగానొక్క జన్మని ఎందుకిలా జర్జరీభూతం చేసుకుంటున్నావు సుమీ' అన్న చరణాలు వెంటా డుతాయి. కేవీయార్ వకుళాభరణానికి గురువు, సహ అధ్యాప కుడు, కుటుంబ స్నేహితుడు. కేవీయార్ అంటే అంతులేని అభిమానం. అలాంటి కేవీయార్ గురించి రాసేటప్పుడు ఒక చరిత్రకారుడిగా వకుళాభరణం రాగద్వేషాలకు అతీతంగా ఆయన విశిష్టతతో పాటు లోపాలనుకూడా నిర్మొహమాటంగా ఎత్తిచూపారు. రమణారెడ్డి వచన శైలి చాలా బరువుగా ఉంటుందని, వ్యవహారానికి దూరమైన పదాలను, వాక్యనిర్మాణాన్ని ఉపయోగించడం వల్ల పాఠకుడిని గందరగోళ పరుస్తాయనే విమర్శ సహేతుకమేనని వ్యాఖ్యానిస్తారు. రాచమల్లు రామచంద్రారెడ్డికి రాసిన లేఖలో 'నా లోపాలను మీరు విస్మరించుకోవాలని నేను కోరుకోను. క్లిష్టాన్వయం కౌగిలి నుంచి నేనిప్పటికీ బయల్పడలేదు. ఎక్కువ భావనను తక్కువ పదాల్లో, ఒక్కోసారి కూరుతానని తుమ్మల వెంకటరామయ్య కూడా ఒకసారి అన్నాడు. కాబట్టి నా లోపాలను మీరు విమర్శించాలి. నా ప్రోస్లో కూడా మీరు సూచించిన లోపాలను తొలగించుకొనేందుకు యత్నిస్తాను' అని రాయడం కేవీయార్ నిజాయితీ, చిత్తశుద్ధికి నిదర్శనం. కేవీయార్ ఒక ఆదర్శ మార్క్సిస్టు సాహితీ వేత్త. తాను విశ్వసించిన సిద్ధాంతాలకు తొట్రుపాటు లేకుండా కట్టుబడిన మేధావి. ❑

'మన తెలంగాణా' సౌజన్యంతో..

## స్వీకారం..

**కొత్త పుస్తకాలు**





ప్రతులకు..

శ్రీమతి పి.ఉషారాణి, 104-6-140, ఎంజీ స్ట్రీట్, రామకృష్ణా నగర్, రాజమహేంద్రవరం, ఫోన్ : 94927 04750, 0883 6662509

వెల : రూ.150/-

# ఓ దేశభక్త ముస్లిం ఆత్మఘోష



✍ పుస్తకాలు - పరిచయాలు

-ఆర్వీ రామారావ్

**ముస్లింల మీద విద్వేషాన్ని ఎంతగా నింపినప్పటికీ సవర్ణులు తమను ఎదగనివ్వరన్న భయం వెనుకబడిన వర్గాలను పీడిస్తూనే ఉంది. అందువల్లే ముస్లింలు తమకు శత్రువులు కారని తాము జనాభాలో అత్యధికశాతంగా ఉన్నప్పటికీ తమకు అసలు ముప్పు ముస్లింల నుంచి కాదు సవర్ణుల నుంచేనన్న వాస్తవాన్ని గ్రహిస్తూనే ఉన్నారు. దీర్ఘ కాలంపాటు దళితులు ముస్లింలను ద్వేషించినా, వారితో పోరాడినా తమకు ఆధిపత్యం దక్కకుండా చేస్తున్నది అగ్రవర్ణాల వారేనన్న వాస్తవాన్ని కూడా దళితులు గ్రహించారు.**

బాబ్రీ మసీదును విధ్వసం చేసినప్పటి నుంచి మన దేశంలో సెక్యులర్ జీవన విధానానికి పెద్ద ముప్పు ఎదురవుతోంది. ఈ అంశాలపై మహారాష్ట్ర మాజీ పోలిసు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎస్.ఎం.ముష్రిఫ్, ప్రొఫెసర్ శంసుల్ ఇస్లాం, ప్రసిద్ధ పత్రికా రచయిత ఎ.జి.నూరానీ లాంటి వారు అనేక గ్రంథాలు రాశారు. ముస్లింలను, దళితులను సవర్ణ హిందువులు ఎలా అణచి వేస్తున్నారో కళ్లకు కట్టినట్టు చూపించారు. అయితే ఈ పుస్తకాల నిండా నిజ జీవిత దృశ్యాలు, కిరాతకమైన ఘటనలు కనిపిస్తాయి. ఈ ఘటనల గురించి చదవడమే పెద్ద యాతన. ఈ భయానక పరిస్థితిలో రచయిత, ప్రసిద్ధ పత్రికా రచయిత, ఈ దేశాన్ని అమితంగా ప్రేమించే సయీద్ నఖ్వీ రాసిన 'ది ముస్లిం వానిషెస్' నాటకం వాస్తవ పరిస్థితులను వింగడిస్తూనే కొన్నిచోట్ల హాస్య స్ఫోరకంగా హాయిగా చదవడానికి ఉపకరి స్తుంది. ఈ మధ్య కాలంలో ఇంతకన్నా మెరుగైన గ్రంథం వచ్చిన దాఖలాలు లేవు.

నఖ్వీకి దాదాపు అయిదు దశాబ్దాలుగా పత్రికా రచనతో సంబంధం ఉంది. ఆయన బి.బి.సి. న్యూస్, ది గార్డియన్, వాషింగ్టన్ పోస్ట్, ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఔట్‌లుక్ లాంటి పత్రికలలో పనిచేశారు. ఆయన టీవీలో తరచి చూసే మనస్తత్వం ఉన్న యాంకర్‌గా కూడా ప్రసిద్ధులు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక మంది ప్రముఖులను ఇంటర్వ్యూలు చేసిన అనుభవం ఆయనకు దండిగా ఉంది.

ఈ నాటకంలో ఆయన ముస్లింలు అంతరించిపోయినట్టు చూపించారు. ఆ తరవాత పరిస్థితి ఎలా ఉంటుందో, దేశ విభజన తరవాత దేశం వదిలి పాకిస్తాన్‌కు వెళ్లిపోయిన ముస్లింల ఆస్తులను కాజేయడానికి అగ్రవర్ణాలతోపాటు ఇతరులు ప్రయత్నించిన తీరునూ చూపించారు. సయీద్ నఖ్వీ ఇంతకు ముందే "బీయింగ్ ది అదర్: ముస్లిం ఇన్ ఇండియా", "రిఫ్లెక్షన్స్ ఆఫ్ యాన్ ఇండియన్ ముస్లిం", ది లాస్ట్ బ్రాహ్మిన్ ప్రైం మినిస్టర్" లాంటి గ్రంథాలు వెలువరించారు. వీటన్నిం టిలోనూ ముస్లింలను వెంటాడం, వెలివేయడం వల్ల ఉత్పన్నమవుతున్న పరిస్థితులను చిత్రించారు. నఖ్వీ ముస్లిం అయినందు వల్ల ఈ పుస్తకాలలో ఆయనలో సహ జీవనానికి ఉన్న ప్రత్యేకమైన ఆరాటం కూడా కనిపిస్తుంది. "ది ముస్లిం వానిషెస్" నాటకంలో ఆయన ఈ జటిల సమస్యకు పరిష్కారం ఎలా కనుగొనాలో కూడా తనకు ఊహకు అనుగుణంగా చూపించారు. ముస్లింలు అంతరించిపోయిన తరవాత దేశ జనాభాలో 70 శాతం మంది దళితులే మిగులుతారు. పాలకవర్గాలు ముస్లింలను ఎంత అమానవీయంగా చిత్రించినప్పటికీ దళితుల ఆధిపత్యాన్ని చూసి జడుసుకుంటారు. తమ ఆధిపత్యం కొనసాగాలంటే ముస్లింలు ఉండాల్సిందేనని అనుకుంటారు. ముస్లింల మీద ద్వేషం పెంచడానికి ముస్లింల జనాభా పెరిగిపోతుందనీ, కొన్నాళ్లకు ముస్లింలే అధిక సంఖ్యాకులుగా మారతారని అసంబద్ధ, నిర్హేతుక ప్రచారం చేస్తున్నారు. లవ్ జిహాద్ లాంటి కొత్త మాటలు చెలామణిలోకి తీసుకొచ్చారు. ముస్లింలను ఎంతగా ద్వేషించినప్పటికీ అగ్రవర్ణ పాలక వర్గాలకు వెనుకబడిన వారు ఎక్కడ ఆధిపత్యం సంపాదిస్తారోనన్న భయం వెంటాడుతూనే ఉంటుంది. అందుకే మోదీ లాంటి వారు అణగారిన ముస్లింల అభ్యున్నతి గురించి మాట్లాడతారు. అంటే దళితులు ఆధిపత్య స్థానాల్లోకి రాకుండా ఉండాలంటే ముస్లింలు ఉండాల్సిందే.

ముస్లింల మీద విద్వేషాన్ని ఎంతగా నింపినప్పటికీ సవర్ణులు తమను ఎదగనివ్వరన్న భయం వెనుకబడిన వర్గాలను పీడిస్తూనే ఉంది. అందువల్లే ముస్లింలు తమకు శత్రువులు కారని తాము జనాభాలో అత్యధికశాతంగా ఉన్నప్పటికీ తమకు అసలు ముప్పు

ముస్లింల నుంచి కాదు సవర్ణుల నుంచేనన్న వాస్తవాన్ని గ్రహిస్తూనే ఉన్నారు. దీర్ఘ కాలంపాటు దళితులు ముస్లింలను ద్వేషించినా, వారితో పోరాడినా తమకు ఆధిపత్యం దక్కకుండా చేస్తున్నది అగ్రవర్ణాల వారేనన్న వాస్తవాన్ని కూడా దళితులు గ్రహించారు. సెక్యులర్ విధానాలను అనుసరిస్తున్నామనుకునే వర్గాలకు ముస్లింల అండ అవసరం అన్న గ్రహింపు ఉంది. అగ్రవర్ణాల వారు ముస్లింలను ఎంతగా అపహాస్యం చేసినప్పటికీ వారి ఆధిపత్యం కొనసాగడానికి ముస్లింల అవసరం ఉంటుంది. ముస్లింలు ఈ దేశంలో అంతరించిపోతే దళితుల నుంచి భీకర సవాలు ఎదురవుతుందన్న వాస్తవం సవర్ణులు గ్రహించక పోలేదు.

## దళితుల అభ్యున్నతిపై..

దళిత సామాజిక కార్యకర్తలు గోవింద్ పన్సారే, నరేంద్ర ధభోల్కర్, ఎం.ఎం.కల్బుర్గి లాంటి వారిని తీవ్ర మితవాద, మతతత్వ శక్తులు అంతమొందించాయి. ఈ తీవ్ర మితవాద పక్షాలు అంతిమంగా దళితుల అభ్యున్నతి సహించలేరు. దళితులు, వెనుకబడిన తరగతుల వారి సామాజిక, రాజకీయ సంస్కరణలను చూస్తే అధికారాన్ని గుప్పెట పెట్టుకున్న వారికి ఏ మాత్రం సహించదు. రోహిత్ వేముల, పాయల్ తాడ్వీ లాంటి వారి హత్య, ఊనాలో దళితుడిని చితకబాదడం లాంటి సంఘటనలు దళితులను సైతం భయకంపితుల్ని చేస్తున్నాయి. ఈ అంశాలన్నింటినీ చిత్రిస్తూనే శాంతియుత సహజీవనం కొనసాగడానికి ఏం చేయాలో కూడా సయీద్ నఖ్వీ ఈ నాటకంలో సూచన ప్రాయంగా పరిష్కార మార్గం చూపించారు. ఈ అశాంతి సమసిపోయేట్టు చేయడానికి 11 మంది ప్రముఖులతో ఓ న్యాయపీఠం ఏర్పడినట్టు నఖ్వీ చిత్రించారు. ఇందులో అమీర్ ఖుస్రో, మహాత్మా జ్యోతీరావ్ పూలే, అబ్దుల్ రహీం ఖన్-ఎ-ఖాన్, సల్బేగ్, రసన్, మొహిసిన్ కకోర్వీ, సంత్ కబీర్‌దాస్, ఉస్తాద్ అల్లావుద్దీన్ ఖాన్ లాంటి వారు ఉంటారు. వీరంతా ఈ దేశ మహోన్నత సంస్కృతిని సుసంపన్నం చేసిన వారే. భారత సంస్కృతికి, చారిత్రక వారసత్వానికి ముస్లింల తోడ్పాటును నఖ్వీ ప్రస్తావించారు. జాతీయ, అంతర్‌జాతీయ సంఘటనల ప్రాధాన్యాన్నీ నఖ్వీ చిత్రీకరించారు. ప్రపంచంలో ముస్లింలు అధిక సంఖ్యలో ఉన్న దేశాలలో భారత్ రెండవ స్థానంలో ఉంది. వారందరూ అంతర్ధానం అయిపోతే దేశంలో గందరగోళ వాతావరణం ఏర్పడుతుందన్న విషమ పరిస్థితిని తెలియజేయడానికీ నఖ్వీ ప్రయత్నించారు.

జిన్నా వికృత రాజకీయాలు, దేశ విభజన మొదలుకుని హిందుత్వ తీవ్రవాదం ప్రబలుతున్న భయానక క్రమాన్ని నఖ్వీ చూపించారు. ఇంత సంక్లిష్ట పరిస్థితిని ఎత్తి చూపడానికి నాటక ప్రక్రియే సముచితమని నఖ్వీ భావించినట్టున్నారు. ఈ గ్రంథం చదువుతుంటే బెర్ట్రోల్ బ్రెఖ్ట్ రాసిన "ది కకేషియన్ చాక్ సర్కిల్" లాంటివి గుర్తుకురాక తప్పదు. నఖ్వీ వ్యక్తీకరణకు ఎంచుకున్న శైలి నిరుపమానమైంది. గురజాడ కన్యాశుల్కంలో లాగానే "ది ముస్లిం వానిషెస్"లోనూ నిర్దిష్టమైన కథా నాయకుడు కనిపించదు. ఈ నాటకం చదువుతుంటే చరిత్ర ఆనవాళ్లు రూపు కడ్తాయి. మనం కొనసాగించవలసిన వారసత్వం రూపురేఖలు కూడా పొడచూపుతాయి.

## వెనుకున్న పేర్లే అసలైనవి

గో సంరక్షకుల ముసుగులో మహమ్మద్ అఖ్లాఖ్‌ను, పెహ్లూ ఖాన్‌ను అంతమొందించనవారు, గుజరాత్‌లోని ఉనాలో దళితుడిని చితగ్గొట్టిన దృశ్యాలను ఈ నాటకం ప్రభావవంతంగా గుర్తుకుతెస్తుంది. అలాగే పార్లమెంటు మీద దాడికి కుట్రదారు అన్న ముద్రవేసి అఫ్జల్ గురును ఉరితీసిన దుశ్చర్యా దృశ్యమానం అవుతుంది. హిందుత్వ, మితిమీరిన కుహనా జాతీయవాదం పెంపొందించడానికి మోదీ సర్కారు వీటికి సంక్షేమ పథకాల ముసుగు కప్పిన వైనమూ ఈ నాటకంలో కనిపిస్తుంది. ముస్లింలను వెలివేస్తున్న తీరు, తలపెడ్తున్న ద్రోహం, అల్ప సంఖ్యాక వర్గాల్లో పేరుకుపోతున్న అభద్రతా భావం, పరాయీకరణ ఈ నాటకం చదువుతున్నంత సేపూ అడుగడున గుర్తుకు వస్తూనే ఉంటుంది. నాటకం మొత్తం విషాదం, ఆనందం కలగలుపే. ఈ వాస్తవ సంఘటనల చిత్రీకరణ వల్ల ఇది కల్పిత రచన కాదు అన్న అభిప్రాయం కలుగు తుంది. నాటకంలోని పాత్రల పేర్లు ఏవైనప్పటికీ వాటి వెనకాల ఉన్న అసలు పేర్లు మన ఆలోచనల్లో మెదలుతూనే ఉంటాయి. విచిత్రం ఏమిటంటే ఈ నాటకాన్ని నఖ్వీ చేత్తో రాయలేదు. కంప్యూటర్ మీద ఎక్కించలేదు. నఖ్వీ చెప్తూ ఉంటే ఆయన సెక్రటరీ కంప్యూటర్‌కు ఎక్కించారు.

హిందుత్వం విలయ నర్తనం ప్రారంభించక ముందు ఈ దేశంలో హిందువులు, ముస్లింలు శతాబ్దాల తరబడి సహజీవనం చేశారు. ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో హిందువులు, ముస్లింలు సామ్రాజ్యవాదాన్ని, వలసవాదాన్ని ఓడించడానికి భుజం భుజం కలిపి పోరాడారు. చాలా దేశాల్లో భిన్న మతాల వారి సహజీవనం కొనసాగుతూనే ఉంది. సిరియాలో క్రైస్తవులు, ఇరాక్‌లో యాజీదీలూ సహజీవనమే కొనసాగిస్తున్నారు. ముస్లిం రాజ్యాలలో అల్పసంఖ్యాక మత వర్గాలలో మన దేశంలో హిందూయేతర మతానుయాయులకు ఉన్న అభద్రతాభావం లేదు. ఇదీ సహజీవనంలోని సొగసు. నఖ్వీ చెప్పదలచుకున్నది ఈ సొగసైన వారసత్వాన్ని కాపాడవలసిన ఆవశ్యకతనే. ❑

# కేశవ్ గారి కొత్త పుస్తకం 'మార్కెట్లో..'కు స్వాగతం



✎ పుస్తకాలు - పరిచయాలు

ఎన్.వేణుగోపాల్

**కేశవ్ రాజకీయార్థిక వ్యాసాల సంపుటం 'మర్కెట్లో...' వెలువడిందని ఇప్పుడే తెలిసింది. సాదర స్వాగతం. కలకత్తాలో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్న ఎం.కేశవరావు గారు తెలుగు రచయితగా, ప్రవాసాంధ్ర పత్రిక 'జాగృతి సమీక్ష' సంపాదకులుగా సుప్రసిద్ధులు. కథలు, రాజకీయార్థిక, సామాజిక, సాంస్కృతిక అంశాల మీద వ్యాసాలు రాసిన కేశవరావు గారు వీక్షణం కు కూడ చాల వ్యాసాలు రాశారు. ఆయన రాజకీయార్థిక వ్యాసాల కొత్త సంపుటం 'మార్కెట్లో' (ఇది రెండో సంపుటం, గతంలో 'పగిలిన పాదాల నెత్తురులో' అని ఒక రాజకీయార్థిక వ్యాస సంపుటం వేశారు) కు నేను రాసిన ముందుమాట చూడండి.**

కేశవ్ గారి రచనలు అడపా దడపా చూస్తూనే ఉన్నాను. కాని ఆయనతో ముఖ పరిచయం లేదు. ముఖపుస్తకంలో చూసిన ఫొటోలు తప్ప. వీక్షణంకు కూడ మూడు నాలుగేళ్లలో అర డజనుకు పైగా వ్యాసాలు రాశారు గాని అవి కూడ నేరుగానో, కేవలం ఒక చిన్న మెసేజితోనో పంపినవి మాత్రమే. ఫోన్ సంభాషణలు లేవు. కనుక ఆయన వ్యాసాల మీద నా ఈ పరిశీలన ఆయనతో ఎంత మాత్రమూ పరిచయం లేకుండా చేస్తున్నది. సబ్జెక్టివ్ అని చెప్పడానికి వీలు లేనిది. కేవలం వ్యాసాలకు మాత్రమే సంబంధించిన వస్తుగతమైనది, ఆబ్జెక్టివ్. రచయిత నేపథ్యం తెలియకుండా, రచయితతో పరిచయం లేకుండా రచనల గురించి వ్యాఖ్యానించడం ఆబ్జెక్టివ్ అనీ, అవసరమైనదనీ ఒక రకంగా చూస్తే అనిపించవచ్చు. కాని సబ్జెక్టివ్ ఆబ్జెక్టివ్ అనేవి ఒకదానికొకటి సంబంధం లేకుండా విడిపోయిన అంశాలు కావు. అవి రెండూ గతితార్కికంగా ఏకమైనవే. ఈ వ్యాస రచయితతో ఈ పరిశీలకుడికి సంబంధం లేకపోవడం అనే ఆబ్జెక్టివ్ అంశంతో సమాంతరంగానే ఈ వ్యాసాలలోని ఇతివృత్తాలతో పరిశీలకుడికి సన్నిహిత సంబంధం ఉండడం అనే సబ్జెక్టివ్ అంశం ఉంది. అట్లాగే ఈ రచయిత ఆయా అంశాలను ఎంత ఆబ్జెక్టివ్‌గా పరిశీలించి రాయడానికి ప్రయత్నించినా, ఆయన ప్రవాస జీవితపు నేపథ్యం, ప్రస్తుతం జీవిస్తున్న బెంగాలీ సమాజ వాతావరణం ఈ వ్యాసాలకు సబ్జెక్టివ్ రంగూ రుచీ వాసనా అద్దకుండా ఉండడం అసాధ్యం. విడివిడిగా ఆయా వ్యాసాలు చదివినప్పుడు నేను కేశవ్ సమగ్ర, సర్వాంగీణ దృష్టికి అభిమానినయ్యాను. చర్చిస్తున్న విషయాన్ని ఏదో ఒక కోణం నుంచి మాత్రమే పరిశీలించకుండా, అన్ని కోణాల నుంచీ విశాలంగా, బహుళంగా, లోతుగా అర్థం చేసుకోవడానికీ, చేయించడానికీ ప్రయత్నిస్తారని అనుకున్నాను. ఇప్పుడు ఈ సంపుటంలో దాదాపు ముప్పై ఏళ్ల కాలవ్యవధిలో రాసిన ముప్పైకి పైగా వ్యాసాలను ఒక్కచోట, ఒక్కసారిగా చదివినప్పుడు ఆ అభిప్రాయం మరింత బలపడుతున్నది. ఆ అభిప్రాయానికి ముప్పై నిదర్శనాలు దొరికాయనిపిస్తున్నది. ఇక్కడ ఉన్న ఇన్ని వ్యాసాల ఏకసూత్రత అవన్నీ ఒక్క రచయిత రాయడం మాత్రమే కాదు. అవన్నీ ఒక నిర్దిష్ట దృక్పథం నుంచి వెలువడినవి కావడం, ముప్పై ఏళ్ల కాలక్రమంలో తొలి దశ స్థానిక, ప్రారంభవ్యాసాలలోనైనా, మలిదశ విశాల, పరిణత వ్యాసాలలోనైనా ఒకే విధమైన నిర్మాణ శైలి ఉండడం. పాఠకులను ఒప్పించేలా, తన దృక్పథం వైపు నడిపించేలా, మిత్ర సమ్మితంగా పాఠకులను తన వెంట తీసుకుపోవడం వీటి ఏకసూత్రత. ఈ ఏకసూత్రతతోపాటే ఈ వ్యాసాలలో గౌరవించదగిన వైవిధ్యం ఉంది. ప్రధానంగా రాజకీయార్థిక అంశాలు, ఆరోగ్య అంశాలు, స్థానిక సాహిత్య, సాంస్కృతిక అంశాలు, స్త్రీల పురోభివృద్ధి అంశాలు, వ్యక్తుల గురించిన వ్యాసాలు అనే ఐదు విభాగాల కింద ఈ వ్యాసాలను చూడవచ్చు. వీటిలో కొన్ని ఒకే గుచ్ఛంలో ఇమడని విడివిడి పుష్పాలుగా కనబడవచ్చు. సుదూరమైన, సంబంధం లేని వేర్వేరు విషయాల మీద ఒకే రచయిత రాసినందువల్ల ఒక్కచోటికి వచ్చాయనిపించవచ్చు. కాని ఈ ఇతివృత్తాల మధ్య వైవిధ్యాన్ని, భిన్నత్వాన్ని, బహుళత్వాన్ని రచయిత దృక్పథమూ వాదనాశైలీ ఏకం చేస్తున్నాయి.

ఈ భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించిన ప్రధాన అంశాలలో ఒకటి ఈ వ్యాసాలలో వ్యక్తమైన విశాల దృష్టి. అప్పటికి వ్యాసం రాయడానికి ఎంచుకున్న అంశం ఎంత చిన్నదైనా, పెద్దదైనా దానికి ఉండగల అన్ని కోణాల నుంచీ, సాధ్యమైనంత విస్తృత పరిధిలో చర్చించడం కేశవ్ అభివృద్ధి చేసుకున్న నైపుణ్యం. అది కేవలం తన విస్తృత పరిజ్ఞానాన్ని, తన విశ్లేషణా పటిమను ప్రదర్శించుకునే సాధనం కాదు, పాఠకులకు ఆ అంశం మీద సమగ్రమైన అవగాహన ఏర్పరచే ఆలోచనా, రచనా వ్యూహం. రచయితకు సమగ్ర దృష్టి లేకపోయినా, చర్చనీయాంశాన్ని సమగ్రంగా పరిశీలించకపోయినా, ఆ మేరకు పాఠకులకు సమగ్ర అవగాహన అందడం సాధ్యం కాదు.

ఈ సర్వాంగీణ దృష్టి ఈ వ్యాసాలలో ఏ ఒక్కటి తీసుకున్నా కనబడుతుంది. అది కరోనా కావచ్చు, బ్యాంకింగ్ కావచ్చు, ప్రభుత్వరంగ సంస్థలు కావచ్చు, ప్రపంచ ఆర్థిక సంక్షోభం కావచ్చు, వ్యవసాయ చట్టాలు కావచ్చు, చైనా వస్తువులు కావచ్చు, కరెన్సీ కావచ్చు, పోషకాహార లోపం కావచ్చు, తల్లిపాల ప్రాముఖ్యత కావచ్చు, టీవీ సీరియళ్లు కావచ్చు, ఫాసిజం కావచ్చు, మానసిక అశాంతి – డిప్రెషన్ కావచ్చు. ప్రవాస తెలుగు వారి జీవనంలోని సమస్యలు కావచ్చు. విషయం ఏదైనా సరే, కేశవ్ దాని అంతు చూడకుండా వాడాలరు. దాన్ని నాలుగు వైపుల నుంచీ చూడకుండా, చూపకుండా వదలరు. సాధారణ దృష్టికి అందని లోతులలోని వివరాలు విప్పిచెప్పకుండా వదలరు. అందరూ గమనించే విషయాలలో గమనించలేకపోయిన కోణాల మీద వెలుగు ప్రసరించకుండా వదలరు.

ఉదాహరణకు వ్యాసంలో ప్రధాన చర్చ కరోనా వ్యాక్సిన్లు అనుకుందాం. ఆ వ్యాసం ఆ వ్యాక్సిన్ల గురించి చర్చిస్తూనే విశ్వమంతా చుట్టివస్తుంది. ఆ కేంద్రకం చుట్టూ ఉన్న విశాల ఆవరణంలో పాఠకులు చూడవలసిన అనేక అంశాల మీదికి ప్రత్యేకంగా దృష్టి మళ్లిస్తుంది. వ్యవస్థలో మొత్తంగా సాగుతున్న విధ్వంసక అభివృద్ధినీ, ఆహార ఉత్పత్తుల్లో పెరిగిన ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ పరిశ్రమలనూ, బహుళజాతి సంస్థల కక్కుర్తినీ, పాల కవర్గాల నిరాసక్తతనూ, మూఢ నమ్మకాల ప్రచారాలనూ, అశాస్త్రీయ భావాలనూ, పేటెంట్ హక్కులనూ, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి పెట్టుబడుల ఉపసంహరణనూ... అలా అనేకానేక సంబంధిత అంశాలను ప్రస్తావిస్తుంది. అది కూడ ఏదో ప్రస్తావన కోసం ప్రస్తావనలా కాక, ఈ సుదూరమనిపించే అంశాలన్నీ ఒకే రాజకీయార్థిక వ్యవస్థలో ఎంత అవిభాజ్య భాగాలో చూపుతుంది. వ్యవస్థ మొత్తంగా వ్యాపింపజేస్తున్న స్వేచ్ఛా వాణిజ్య భావన, ప్రపంచీకరణ ఈ అన్నిటికీ మూలధాతువుగా ఎలా ఉన్నదో వివరిస్తుంది.

మరొక ఉదాహరణ చెప్పాలంటే, వ్యాసం చైనా వస్తువుల ప్రపంచీకరణ మీద. అది చైనా, జియో, ఇ-కామర్స్ ల కలయిక మీదుగా దేశం లోని ప్రధాన రాజకీయార్థిక, సాంస్కృతిక సమస్యలన్నిటి దాకా ప్రవహిస్తుంది. "నెల మొత్తం ఒక జిబితో సర్దుకున్న యువతకు, రోజుకి ఒక జిబి ఉచిత కానుకలు లభించడంతో, మొత్తం సామాజిక సాంస్కృతిక పరిస్థితులే మారిపోయాయి. ఫోన్లలో ఫీచర్లను కొంచెం కొంచెం మారుస్తూ, మరో ఫోను, మరో ఫోను, మరో ఫోను ఇలా భారతీయ యువత వేలం వెర్రిగా స్మార్ట్ ఫోన్లలో పడింది.. వినియోగదారుడి చేతిలో మొబైల్ ఫోను పెట్టారు. ఈ మొబైల్ ఫోన్లోనే మార్కెట్టు పెట్టారు. ఇలా భారతదేశంలోని రిటైల్ మార్కెట్‌ను హతమార్చారు. మొబైల్ ఫోన్లకు, జియో ఉచిత ఇంటర్నెట్ రాకతో, వాట్సప్‌ల సహకారంతో యువత మెదళ్లను వ్యవస్థకు అనుగుణంగా బ్రెయిన్ వాష్ చేసే ప్రక్రియ నడపడం నాయకులకు మరింత సులభమయింది. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక విషయాలకు సంబంధించి, ఒక ప్రత్యేక మతస్తుల మీద యువత మెదళ్లలో వ్యతిరేక భావం నాటడం నుండి, బ్లాక్ మనీ, నోట్ల రద్దు మీద ప్రభుత్వానికి అనుకూలంగా ప్రజల మెదళ్లను మలచడం వరకు, ప్రజల్లో 'దేశభక్తి'ని తప్పుడు మార్గాల్లో నాటి తమ ప్రయోజనాలను కాపాడుకోవడం వరకు, ప్రత్యేక ప్రతిపక్ష నాయకులను 'వ్యక్తిత్వం' లేనివారుగా చిత్రీకరించి, తమ స్థానాన్ని పదిలపర్చుకొని ప్రపంచీకరణను మరింత జోరుగా హుషారుగా గనుల మీదకూ రైళ్ల మీదకూ మళ్లించడం వరకు, ఒక్కో గనిని, బ్లాకుని తమ మిత్రకూటమికి ధారదత్తం చేసేసే వరకు ఈ వాట్సప్ విశ్వవిద్యాలయం సహకరించింది" అంటారు. తీగ లాగితే డొంక కదలడం అనే పాత తెలుగు నుడికారం ఉంది. ఇప్పుడు సాగుతున్న పర్యావరణ విధ్వంసంలో తీగలూ లేవు, రియల్ ఎస్టేట్ విజృంభణలో డొంకలూ మాయమైపోతున్నాయి గాని కేశవ్ రచనలో ప్రతి తీగా ఒక డొంకను కదిలిస్తుంది. ఒక చిన్న కుంచె, ఇంకా చిన్నదైన ఆ కుంచె అంచు, మహా విశాలమైన కాన్వాస్ మీద బహుళార్థ బోధకమైన చిత్రాన్ని చిత్రించగలుగుతుంది. కరోనా గురించి రాస్తూ, "వ్యవస్థలోని పోటీ, లాభం, సామ్రాజ్యవాదం, పర్యావరణ విధ్వంసం ఇవేవీ అన్వయించకుండా ఒక్క కరోనా గురించి ఆలోచిస్తే మనకు విషయాలు అర్థం కావు" అని స్పష్టంగానే వ్యవస్థలోని వేరువేరు అంశాల మధ్య అంతస్సంబంధాన్ని ప్రకటిస్తారు. "మన పోరాటం ఒక్క వైరస్‌తోనే కాదు, మానవజాతిని ఇలాంటి కొత్త జబ్బుల్లో ముంచేసే వ్యవస్థతోనూ, ఉత్పత్తి విధానాలతోనూ'' సాగాలంటారు. "కరోనా 19 మనకు చాలా గుణపాఠాల్ని నేర్పింది. మనం ఎలాంటి వ్యవస్థలను తయారు చేసుకోవాలో, ఎలాంటి వ్యవస్థలు కష్టకాలంలో మనిషి పక్కన నిలుచుని సేవ చేస్తాయో, ఎలాంటి వ్యవస్థలు మహమ్మారులు వచ్చేటప్పుడు విఫలమవుతాయో తెలిసేలా చేసింది" అని దిశా నిర్దేశాన్ని కూడ ప్రకటిస్తారు. ఈ సర్వాంగీణ దృష్టి ఒక దృక్పథ స్పష్టతకు సూచిక. ఒక మర గురించి అర్థం చేసుకోవడానికి ప్రయత్నించేటప్పుడు ఆ మరను సూక్ష్మంగా పరిశీలించడం ఎంత అవసరమో, ఎంత ముఖ్యమో, ఆ మర భాగంగా ఉన్న మహా యంత్రం గురించి మొత్తంగా అర్థం చేసుకోవడం అంతే అవసరం. ఆకులను చూస్తూ చెట్లను మరిచిపోతున్న, చెట్లను చూడడంలో పడి అడవిని మరచిపోతున్న ప్రస్తుత సామాజిక స్థితిలో ఈ విశాల, సర్వాంగీణ దృష్టి చాలా అవసరం. సర్వాంగీణ దృష్టికి మరొక కోణం, చర్చలో భాగంగా లోతుల్లోకి వెళుతూ తాత్విక స్థాయిని చేరడం. 'చైనా సరుకులు చౌకగా వస్తున్నాయి గనుక ఎక్కువమంది


కొంటున్నారు' అనేమాట. లేదా 'చైనా వస్తువుల్ని బహిష్కరించాలి' అనే మాట చాలామంది అంటున్నదే. కాని కేశవ్ ఆ చర్చలో మూలాల్లోకి వెళ్లి ఒక తాత్విక ప్రశ్నను లేవనెత్తుతారు. చైనా సరుకు కొనడమనేది, లేదా బహిష్కరించడమనేది, లేదా చైనా యాప్‌ల మాయలో పడి నిష్క్రియాపరులుగా మారడమనేది వ్యక్తిగతమా, విధాన నిర్ణయమా అని ప్రశ్నిస్తారు. అటువంటి నిర్ణయాత్మక వైఖరి తీసుకోవడానికి ఇవాల్టి వ్యవస్థలో వ్యక్తికి ఉన్న స్థానం ఏమిటి, అందులో వ్యక్తిగత ఎంపిక పాత్ర ఎంత అంటూ కొత్త వెలుగులు ప్రసరిస్తారు, కొత్త ప్రశ్నలు వేస్తారు.

'నెమెసిస్' కవితా సంపుటం ఆవిష్కరణను ప్రాతిపదికగా పెట్టుకుని, మొత్తంగా మహిళా చైతన్యం గురించి సాగించిన విశ్వవిన్యాసం చూడండి. కరోనా నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన దుర్గా పూజ శ్రామికుల గురించిన హృదయ విదారక, ఆలోచనాస్ఫోరక కథనం చూడండి. కరెన్సీ సంక్షోభం మీద ద్రవ్య అర్థశాస్త్ర పాఠం లాంటి వ్యాసం చూడండి. ఎన్ని మందులు అవసరం కొద్దీ వాడుతున్నాం, ఎన్ని మందులను ఔషధ కంపెనీలు, డాక్టర్లు, వ్యాపార ప్రకటనలు మన మీద రుద్దుతున్నాయి సవివరంగా చర్చించిన 'వైద్యం కోరుకుంటున్న వైద్యులు', 'ఔరా ఔషధాలు', 'ఆనందయ్యలూ ఆధునిక వైద్యం' వ్యాసాలు చూడండి. మన సామాజిక సంస్కృతి ఎందుకు ఎట్లా పుచ్చిపోతున్నదో చర్చించిన 'మీ పిల్లలు టీవీ చూస్తున్నారా?' 'సామాజిక పతనం వైపుగా టీవీ సీరియళ్లు' వ్యాసాలు చూడండి. లేదా అటువంటి విశాలమైన కాన్వాస్ కు అవకాశం లేనట్టు అనిపించే స్థానిక సమస్యల మీద, స్థానిక చరిత్ర మీద, స్థానిక జన జీవనం మీద రాసిన వ్యాసాలుచూడండి. స్థానిక అవసరాల కోసం, స్థానిక ప్రజలను దృష్టిలో పెట్టుకుని, స్థానిక పత్రికలో చేసిన రచనలైనా, దశాబ్దాల కింద, ఎన్నో ఏళ్ల కింద చేసిన రచనలైనా సమాచారం మారి ఉండవచ్చు గాని విశ్లేషణలో తాజాతనం వదలని వ్యాసాలు ఎన్నో ఉన్నాయి. ఉదాహరణకు విద్య అమ్మాయిల హక్కు అనే ఒకే ఒక్క వ్యాసం చూడండి, టిటాఘర్ తెలుగు సమాజం లోని యువతుల సమస్యలే అక్కడ ప్రాతిపదిక కావచ్చు గాని, విశ్లేషించిన తీరు ఆ వ్యాసాన్ని సార్వత్రికం చేస్తుంది. నిర్దిష్టత నుంచి సార్వజనీనతలోకి ప్రవహింపజేస్తుంది. ఆ వ్యాసాలలో ప్రతి ఒక్కదాన్నీ వివరించాలని ఉంది గాని, ముందుమాట ఇంతకన్న ఎక్కువ పరిచయం చెయ్యగూడదు.

సర్వాంగీణ దృష్టిలో తప్పనిసరిగా సమాచారమూ ఉండాలి. ఆ సమాచారాన్ని విశ్లేషించడమూ ఉండాలి. సమాచారం లేని విశ్లేషణ జీవితానుభవంతో సంబంధం లేని శుష్క సిద్ధాంతంగా మిగిలిపోతుంది. విశ్లేషణ లేని సమాచారం సారం గ్రహించలేని ఉత్తి జాబితాగా, కవిలెకట్టగా, 'అయితే ఏం' అనే ప్రశ్నను మిగిల్చే ఊకదంపుడుగా మిగిలిపోతుంది. కేశవ్ వ్యాసాల్లో ఏ ఒక్కటి తీసుకున్నా అవసరమైన సమాచారమూ ఉంటుంది, అత్యవసరమైన విశ్లేషణా ఉంటుంది.


నిజానికి ఈ సర్వాంగీణ దృష్టి లేకుండా చేయడానికే ఆధునిక పాలక వర్గాలన్నీ, ఆధునిక విద్యలన్నీ ప్రయత్నిస్తున్నాయి. సమాజాన్ని శకలాలు శకలాలుగా విడగొట్టి, ఒక శకలానికీ మరొక శకలానికీ సంబంధం లేదన్న, సంబంధం అవసరం లేదన్న అభిప్రాయం కలిగిస్తున్నాయి. ఎడమచేతి చిటికెనవేలుకు వైద్యం చేయడం ఒక ప్రత్యేక నైపుణ్యం. ఆ చేతి బొటనవేలికే వైద్యం చేయడం మరొక ప్రత్యేక నైపుణ్యం. ఒకదానికీ మరొకదానికీ సంబంధం లేదు. ఆ రెండు అవయవాలకూ, మిగిలిన అవయవాలలో ఏ ఒక్కదానికీ సంబంధం లేదు, మొత్తం శరీరంతో సంబంధం లేదు. అటువంటి శకలీకరణ రాజ్యం ఏలుతున్న వర్తమానంలో కేశవ్ ఒక వ్యాసంలో "గొలుసు ప్రక్రియ" గురించి మాట్లాడతారు. ఈ వ్యవస్థలో అనేకానేక అంశాలు దృశ్యాదృశ్యంగా, బహుశా ఎక్కువ అదృశ్యంగా, ఈ గొలుసు ప్రక్రియలో విడదీయరాని భాగాలుగానే ఉన్నాయి. ఎవరికి వాళ్లు ఆ గొలుసులోని ఏదో ఒక లింకును మాత్రమే చూస్తున్నారు. కావలసింది మొత్తంగా గొలుసును చూడడం. ఆ గొలుసు నిజానికి మనకు సంకెలగా ఉందని చూడడం, చూపడం, ఆ సంకెలను బద్దలు కొట్టాలనే అవగాహనను, ఆదర్శాన్ని, స్ఫూర్తిని అందించడం.

మరొక రచన గురించి కేశవ్ చేసిన వ్యాఖ్య గుర్తు చేసి మీకూ వ్యాసాలకూ మధ్య నుంచి తప్పుకుంటాను: "ఒక రచయిత ఒక సమాజం చరిత్రని పూర్తిగా గాని, ప్రత్యేక అంశంగా గాని రాసేటప్పుడు గత కార్యక్రమాలని వివరించడమే గాక, వాటిలోని వైరుధ్యాలనీ(కాంట్రడిక్షన్స్), అభివృద్ధినీ, అభివృద్ధి నిరోధకత్వాన్నీ విశ్లేషించి, పాఠకుడు ఈ చరిత్ర నించి ఏది గ్రహించాలి? ఏది తిరస్కరించాలి? ఏయే అంశాలు మన అస్తిత్వాన్ని బలపరుస్తున్నాయి? ఏయే అంశాలు మన అస్తిత్వాన్ని దెబ్బతీసే పరిస్థితుల్ని ఏర్పరచాయి? అనే విషయాలను వివరించి ఉంటే, పాఠకుడికి మరింత వివరంగా స్పష్టమయ్యేది". రచన లక్ష్యం ఏమిటని తాను చెపుతున్నారో దానికి తాను కూడ పూర్తిగా అక్షరాలా కట్టుబడి ఉన్నానని కేశవ్ ఇక్కడ ప్రతి వ్యాసం లోనూ చూపుతున్నారు. కేశవ్ లాంటి విశ్లేషకులు, ఈ వ్యాసాల వంటి విశ్లేషణలు ఇంకా ఇంకా ఎక్కువగా రావలసిన సందర్భంలో మన సమాజం, మన కాలం ఉన్నాయి. ఈ పని చేయమని చరిత్ర మనను ఆదేశిస్తున్నది. ఆ చరిత్ర పిలుపుకు స్పందించినందుకు కేశవ్‌ను అభినందిస్తూ, ఆ స్పందనను కొనసాగిస్తారని ఆశిస్తూ.. ❑




స్వేచ్ఛా విహంగం

బుల్డోజర్ ట్రైన్








భవిష్యద్దర్శిని

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 1 - Issue No : 4 January 2023








## కొత్త పుస్తకాలు స్వీకారం




**if undeliverd please return to:**

**B.Ramesh Chandra Babu**
**34-15-1,**
**Doddipatal Vaari Thota Veedhi,**
**Tanuku - 534 211**
**West Godavari, Ap**
**Phone No : 93971 14495**

Printed Matter - Book Post

To :

**Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.**